తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

బుధవారం 10.09.2025 | సంపుటి :12 సంచిక : 52 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

- ఎన్నికలో విజయం సాధించిన ఎన్డీయే అభ్యర్థి
- విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో గెలుపు

- ఓటింగ్‌కు దూరంగా ఉన్న భారాస బీజేడీ, శిరోమణి అకాళీదళ్ సభ్యులు
- తొలి ఓటు వేసిన ప్రధాని మోడీ
- వీల్‌చైర్‌లో వచ్చి ఓటేసిన మాజీప్రధాని దేవేగౌడ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. మొత్తం 781 మంది సభ్యులకుగాను 767 మంది పార్లమెంట్ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత రాష్ట్ర సమితి, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ సభ్యులు ఓటు వేయలేదు. ఉప రాష్ట్రపతి అభ్యర్థులుగా ఎన్డీయే తరఫున సీపీ రాధా కృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీ చేశారు. ఉపరాష్ట్రపతి కోటా విజయాని కి కావాల్సి ఓట్లు 377 కాగా..

మిగతా 2లో..


## ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఓ అరుదైన చర్చ

### మళ్లీ ప్రశ్నించే స్థానంలోనే పౌర సమాజం

### దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం

- వయోభారం లెక్కచేయకుండా రాష్ట్రాలు చుట్టొచ్చిన ఇండియా కూటమి అభ్యర్థి
- తొలిసారిగా చర్చలకు వేదికగా నిలిచిన ఉప రాష్ట్రపతి ఎన్నిక

'పౌర సమాజం ఎప్పుడూ ఓడిపోతుంది. ఇది పెద్ద విషయమేమీ కాదు. అప్పడప్పుడు మాత్రమే పౌర సమాజం అరుదుగా విజయాలు నమోదు చేస్తుంది. ఇప్పుడు కూడా ప్రశ్నించేస్థానం లోనే మళ్లీ నిలిచింది. మొత్తంగా పౌరసమాజం ఈ ఎన్నికకు కదిలింది' అంటూ ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఓ ఆదర్శప్రాయ సందేశమిచ్చారు. గెలుపోటములు లెక్కే కాదని మొదట్నుంచీ ప్రకటిస్తున్న ఆయన.. రాజ్యాంగ విలువలూ, దాని పరిరక్షణకు బరిలో నిలిచారు. సంఖ్యాబలం లేదని తెలిసినా ప్రజాస్వామ్య మూలాలను బతికించాలనే ఉద్దేశంతో ఎన్నికను తేలికగా భావించలేదు. వయోభారం లెక్కచేయకుండా అన్ని రాష్ట్రాలూ తిరిగొచ్చి, అందరి మద్దతు కోరారు. దేశవ్యాప్తంగా ఓ భారీ చర్చగా ఎన్నికను ఉపయోగించుకున్నారు. ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా దేశవ్యాప్తంగా తొలిసారి డిబేట్లు (చర్చ) జరిగాయి. గెలుపోటములు సహజమే అయినా.. ఉప రాష్ట్రపతి ఎన్నిక, జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం ఓ అరుదైన చరిత్రను నమోదు చేసింది.



జనంసాక్షి కరస్పాండెంట్ (హైదరాబాద్) ఎన్డీయే అభ్యర్థి గెలుపొందినా.. నైతిక విజ యం ప్రతిపక్ష ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికే దక్కింది. అందుకు కారణం ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో మునుపెన్నడూ లేనంత చర్చ జరిగింది. పౌర సమాజం ఈ చర్చలో భాగమయ్యింది.ముఖ్యంగా చైతన్య పూరితమైన గడ్డ హైదరాబాద్‌లో సైతం మేధావులందరూ పెద్దమొత్తంలో సుదర్శన్ రెడ్డికే మద్దతు తెలిపారు. హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ

మిగతా 2లో..

# వరద సాయం చేయండి

### తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తెస్తున్నాం



- మా ప్రయత్నానికి మద్దతివ్వండి
- ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించండి
- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణలో వరద నష్టంపై ఆర్థికమంత్రికి నివేదిక అందజేత

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్నకృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి గారికి వివరించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నార్త్ బ్లాక్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్రమంత్రి నిర్మలతో

మిగతా 2లో..

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

2లో..

### ప్రజాకవి కాళోజికి సీఎం రేవంత్ నివాళి

# 2027 చివరినాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి

- ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలనికి ప్రణాళికలు
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూట్ మ్యాప్
- కొత్తగా మంజూరై ఎత్తిపోతల పథకాల పూర్తికి చర్యలు
- అటవీశాఖ అనుమతులు సత్వరమే పూర్తి చేయాలి
- భూసేకరణను వేగవంతం చేయాలి
- పునరావాస ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం




హైదరాబాద్(జనంసాక్షి): 2027 డిసెంబర్ మాసాంతానికి ఎస్.ఎల్.బి.సి పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. తద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించడంతో పాటు సురక్షితమైన త్రాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అదే విదంగా హైలెవల్ కెనాల్ నుండి లో లెవల్ కేనాల్ పనులు పూర్తి చేయడంతో పాటు ఎస్.ఎల్.బి.సి ప్రారంభం అయితే లోలెవల్ కెనాల్ పంప్ హౌజ్ ల ద్వారా సరఫరా చేస్తున్న నీటి వినియోగానికి గాను నెల వారిగా చెల్లిస్తున్న కోటి రెండు లక్షల విద్యుత్ భారం నుండి బయట పడగలమని ఆయన తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీ లోని నీటిపారుదల శాఖా ప్రధాన కార్యాలయం జలసౌధ లో నల్లగొండ, భోనగిరి లోకసభ నియోజకవర్గాలలో ప్రాజెక్టుల పురోగతి పై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్,శాసనసభ్యులు బాలు నాయక్,వేముల విరేశం,కుంభం అనిల్ రెడ్డి,కుందూరు జయదీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,మందుల సామ్యెల్,నీటిపారుదల శాఖా సలహాదారులు అదిత్యా దాస్ నాథ్,లెఫ్టినెంట్ జనరల్ హార్పల్ సింగ్,ప్రత్యేక అధికారి పరిక్షిత్ మేహ్రా, ఆర్,ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,నల్లగొండ, భోనగిరి యాదాద్రి, సూర్యపేట

మిగతా 2లో..

# నేపాల్ ప్రధాని రాజీనామా

- అయినా ఆగని ఆందోళనలు
- సైన్యం చేతుల్లోకి పగ్గాలు..!
- ఆ దేశ పార్లమెంట్‌కి నిప్పుపెట్టిన నిరసనకారులు..





### ఆర్మీ బ్యారక్స్‌కు వీఐపీలు • నిరసనల్లో మాజీ ప్రధాని సతీమణి మృతి!

ఖాట్మండు (జనంసాక్షి):హిమాలయ దేశం నేపాల్‌లో రాజకీయ సంక్షోభం ముదురుతోంది. సోషల్ మీడియాపై నిషేధం ఎత్తివేసినప్పటికీ.. నేపాల్ లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో ప్రధాని పదవికి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. దాంతో ఆ దేశ పగ్గాలు సైన్యం చేతుల్లోకి వెళ్లనున్నాయని తెలుస్తోంది.దీనికి ముందు ప్రధాని కేపీ శర్మ ఓలీ నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌తో మాట్లాడారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్లిష్ట పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు, ప్రధాని నివాసం నుంచి సురక్షితంగా వెళ్లిపోయేందుకు మిలిటరీ సహాయం కావాలని ఆయన అడిగినట్లు పేర్కొన్నాయి. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఓలీకి ఆర్మీ చీఫ్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలను సైన్యం అదుపులోకి తీసుకువస్తుందని పేర్కొన్నట్లు సమాచారం. ఓలీ రాజీనామా చేస్తే.. మిలిటరీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైనట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ తరుణంలోనే రాజీనామా ప్రకటన వెలువడింది. దేశంలోని అస్థిర

మిగతా 2లో..

నేపాల్‌లో ఆందోళనల నేపథ్యంలో

### భారత్ అప్రమత్తత

నేపాల్‌కు ప్రయాణం వాయిదా వేసుకోవాలని సూచన

ఇండిగో విమానాల దారి మళ్లింపు..

2లో..



## హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం రూ.1500 కోట్లు

- ప్రకటించిన మోదీ ..
- ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితులను పరిశీలించిన ప్రధాని

సిమ్లా(జనంసాక్షి):భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద ప్రధాని మోదీ రూ.1500 కోట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత, కొండచరియలు విరిగి పడిన ప్రాంతాల్లో పరిస్థితులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఈ క్రమంలోనే మృతుల బంధువులకు రూ.2 లక్షల

మిగతా 9లో..

## ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా.. అభివృద్ధిని ఆపడంలేదు

- ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం : మంత్రి పొంగులేటి
- పేదవారికి కష్టం కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటోంది
- ఇప్పటి వరకు లబ్ధిదారురలకు నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- రాబోయే మూడేళ్లలో అర్హులైనవారందరికీ అందిస్తాం



కూసుమంచి(జనంసాక్షి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ.8.19 లక్షల కోట్లు అప్పు చేసిందని, పేదవారికి కష్టం కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రాబోయే మూడేళ్లలో అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు.

మిగతా 8లో..

### మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి

12లో..

### రెక్కలు తొడిగిన పసిడి

ఆల్‌టైమ్ గరిష్ఠానికి బంగారం ధర

2లో..

### ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ఏసీబీ గవర్నర్ అనుమతి కోరే అవకాశం

2లో..

### ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

భారీగా లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ మహిళా టౌన్ ప్లానింగ్ అధికారి

8లో..

## పునః మూల్యాంకనం చేయండి

లేదంటే మెయిన్స్ మళ్లీ నిర్వహించండి



- గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు కీలక తీర్పు
- గతంలో ప్రకటించిన జనరల్ ర్యాకింగ్స్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి):గ్రూప్-1 మూల్యాంకనం, ర్యాంకింగ్ లిస్ట్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువ రించింది. మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. సంజయ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పునః మూల్యాంకనం జరపాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 నెలల్లోపు పూర్తిచేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలా చేయని పక్షంలో మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గ్రూప్-1మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపి-కై-న అభ్యర్థులు మరి కొందరు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జులై 7న న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు వాదనలు విన్నారు. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించారు. పునఃమూల్యాంకనం సాధ్యం

మిగతా 2లో..

## పునః మూల్యాంకనం చేయండి

కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. ఈ పిటీషన్లపై జూలై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీ-జీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు- జూలై 7న ప్రకటించారు. తాజాగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రీవాల్యుయేషన్ జరిపించాలని టీ-జీపీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

## హైకోర్టు తీర్పు ఓ గుణపాఠం కావాలి

**గ్రూప్‌-1 పరీక్షలు తిరిగి నిర్వహించాలి: కెటిఆర్**

**హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : హరీశ్**

హైదరాబాద్(జనంసాక్షి):టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణపాఠమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు నిజంగా హర్షించదగినది. గతంలో గ్రూప్‌-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు సాక్ష్యాధారాలతో సహా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, టీఎస్పీఎస్సీ మొండిగా వ్యవహరించింది. నిరుద్యోగుల ఆరోపణలను, వారు లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా మూర్ఖంగా ముందుకు పోయిందని కేటీఆర్ విమర్శించారు. నిరుద్యోగులు లేవనెత్తిన ఏ అంశాన్ని పట్టించుకోకుండా వారిపై కేసులు పెట్టి, అణచివేతకి, లాఠీఛార్జీలకి గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి: హరీశ్

గ్రూప్‌-1 పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సర్కారు నిర్లక్ష్యానికి నిరుద్యోగులు బలవుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరవాలని, తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలన్నారు.గ్రూప్ 1 పరీక్ష మూల్యాంకనంలో అవకతవకలు.. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, పరీక్ష ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. లోప భూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న రేవంత్ రెడ్డి ఈ కోర్టు తీర్పుకు మీరు చెప్పే సమాధానం ఏమిటని ప్రశ్నించారు. హడావుడిగా పరీక్షలు నిర్వహించి, అవకతవకలకు పాల్పడ్డ నీ నిర్లక్ష్యానికి విద్యార్థులు, నిరుద్యోగులు బలవుతున్నారు.గప్పాలు కొట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరీక్షలు ఎలా నిర్వహించాలి అనే సోయి కూడా లేదు. పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం అంటే విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొట్టి చిల్లర రాజకీయాలు చేయడం కాదు రేవంత్ రెడ్డి. ఇప్పటికైనా కండ్లు తెరువు. నీ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరికి సిగ్గుతో తలదించుకో. తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పు అంటూ డిమాండ్ చేశారు.

## కేసీఆర్ అజెండాతోనే ముందుకు..

**- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ సీఎం కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు.అనంతరం కవిత మాట్లాడుతూ.. "ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ఆ పదవికి వన్నె తెస్తారు' అని కవిత అన్నారు.

## ఖైదీల్లో జైలు సిబ్బంది మార్పు తీసుకురావాలి

**- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**హైదరాబాద్(జనంసాక్షి):**7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌కు తెలంగాణ జైళ్ల శాఖ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."10 ఏళ్ల తర్వాత మళ్లీ తెలంగాణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మీట్ ఓ పోటీ కాదు. క్రమశిక్షణ, విధి నిర్వహణలో అంకితభావం పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన మంచి కార్యక్రమం. జైలు సిబ్బంది తమ ప్రతిభను గుర్తుంచుకోవాలి. భద్రతా విధులు నిర్వహిస్తూ ఖైదీలలో మార్పు తీసుకురావాలి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్నాలజీ, వృత్తి శిక్షణ, సంక్షేమ కార్యక్రమాల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయి. మనిషి జీవితంలో అసలైన లక్ష్యం మనసును అభివృద్ధి చేసుకోవడం.సాంస్కృతిక కార్యక్రమాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచి ప్రవర్తనతో ఉన్న 231 మంది ఖైదీలు విడుదలయ్యారు. వారు కొత్త జీవితం సాగించేందుకు అవకాశం కల్పించారు. కొందరికి పెట్రోల్ బంకుల్లో ఉద్యోగాలు వచ్చాయి. మహిళలకు కుట్టు మెషిన్లు ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ ఒక గతంతోపాటు భవిష్యత్తు ఉంటుంది. సంగారెడ్డి, నిజామాబాద్ సెంట్రల్ జైళ్లలో కొత్త సిబ్బంది వచ్చారు. సిద్దిపేట జిల్లా జైలును ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ప్రిజన్ డ్యూటీ మీట్ అందరికీ మంచి అనుభూతి కలిగించడంతోపాటు జైలు సంస్కరణలు చేపట్టడానికి శిక్షణలా ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తున్నా" అని గవర్నర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని 21 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1200 మందికి పైగా జైళ్ల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 34 జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ఏర్పాటు

**ఆన్‌లైన్‌లో ప్రారంభించిన మంత్రి దామోదర**

**సంగారెడ్డి,సెప్టెంబర్9(జనంసాక్షి):** 34 జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ నుంచి అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య ఆసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రి దామోదర రాజనర్సింహ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 బెడ్స్ కెపాసిటీతో 34 సెంటర్స్ ఏర్పాటు- చేసుకున్నామన్నారు. క్యాన్సర్ నివారణకు నోరి దత్తాత్రేయుడి సేవలు మరువలేనివని.. దత్తాత్రేయుడిని ఆరోగ్య శాఖ సలహాదారుగా నియమించుకున్నట్టు చెప్పారు. రేడియేషన్ సెంటర్స్, మొబైల్ కాన్సర్ సెంటర్ ఏర్పాటు- చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రతీ గ్రామంలో మొబైల్ కాన్సర్ సెంటర్స్ పని చేస్తాయని పేర్కొన్నారు. జర్మనీ, జపాన్ వెళ్లే స్థాయిలో నర్సులు ఆలోచన చేయాలని సూచించారు. రాబోయే కాలంలో 70 శాతం క్యాన్సర్ పెరగొచ్చు. ముందస్తు స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి. నర్సింగ్ విద్యార్థులకు ఫారెన్ లాంగ్వేజెస్ లో ట్రైనింగ్ ఇప్పిస్తాం. జపాన్, జర్మనీ భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని.. మన దగ్గర ఏడాదికి 3 వేల మందిని నర్సు లను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

# వరద సాయం చేయండి

సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని నిర్మలా సీతారామన్ గారిని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కోరారు.గత ప్రభుత్వంలో అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కోరారు. ముఖ్యమంత్రి గారు చేసిన విజ్ఞప్తులపై నిర్మలా సీతారామన్ గారు సానుకూలంగా స్పందించారు.



## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా సమావేశమ య్యారు. ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజికి సిఎం రేవంత్ నివాళి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆమనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయనతో పాటు పలువు ఎంపీలు. కాళోజీ చిత్రపటానికి



నివాళులర్పించారు. అనంతనం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు- వేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయలుదేరారు.

## 2027 చివరినాటికి ఎస్‌ఎల్‌బీసీ పూర్తి

జిల్లాల కలెక్టర్లు ఇల త్రిపాఠి, మంత్రిప్రగడ హనుమంత రావు,తేజస్ నందాలాల్ పవర్ లతో పాటు ఇ.ఎన్.సి లు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు సి.ఇ అజయ్ కుమార్ ఇతర నీటిపారుదల శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎస్.ఎల్.బి.సి ని డిసెంబర్,2027 నాటికి పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకుని రూట్ మ్యాప్ రూపొందించినట్లు ఆయన తెలిపారు.మెల్ బోర్న్ హెలికాప్టర్ సర్వే నిర్వహించి ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు.ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ అంశంపై నీటిపారుదల శాఖా ఇంజినీర్లు రూపొందించిన నివేదికను ఈ నెల 15న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించి మంత్రివర్గ ఆమోదంతో పనులు మొదలు పెడతామని ఆయన స్పష్టం చేశారు. ఆందుకు సంబంధించిన టన్నెల్-1,పెండ్లిపాకల రిజర్వాయర్,టన్నెల్-2 ను పూర్తి చేసుకుని 25 కిలో మీటర్ల మెయిన్ కెనాల్ ద్వారా హైలెవల్ కేనాల్ లో కలిపి సాగునీటిని అందిస్తామన్నారు. అందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.యస్.ఎల్.బి.సి పూర్తి అయితే హైలెవల్ కేనాల్ ద్వారా 2 .20 వేలు,ఉదయసముద్రం ద్వారా లక్ష ఎకరాలకు, లో లెవల్ కేనాల్ ద్వారా 80,000 వేల ఏకరాలకు సాగు నీరు మారుమూల గ్రామాలకు సురక్షిత త్రాగునీరు అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. అదే విదంగా డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా 8 రిజర్వాయర్ల నుండి 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు సాగుతున్నాయన్నారు. సింగరాజ్ పల్లి రిజర్వాయర్ ద్వారా 13,000 వేల ఎకరాలకు,ఎర్రబెల్లి-గోకారం ద్వారా 6,000 వేల ఎకరాలకు,ఇర్విన్ ద్వారా 10,000 వేల ఏకరాలకు,గొట్టెముక్కుల ద్వారా 28,000 వేల ఏకరాలకు,చింతపల్లి ద్వారా 15,000 వేల ఎకరాలకు,కృష్ణరాంపల్లి ద్వారా లక్ష ఏకరాలకు,శివన్నగూడెం ద్వారా 1,55,000 ఎకరాలకు అందించేందుకు గాను పనులు వేగవంతం చేస్తున్నామని ఆయన చెప్పారు.ఇప్పటికే డిండి ప్రాజెక్టుకింద 30,000 వేల ఏకరాలు ,ఉలపర కింద 4,000 ఎకరాలకు నీరు అందుతోందన్నారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో బాగంగా నిర్మించిన ఎదుళ్ల రిజర్వాయర్ నుండి దుందుభి వాగు వరకు నీటిని రప్పించేందుకు ఐదు ప్యాకేజ్ లుగా విభజన చేసి పనులు ప్రారంభించినట్లు ఆయాన చెప్పారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఓ అరుదైన చర్చ



ఖండించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు ప్రకటించిన నాటి నుండే పౌర సమాజంలో కదలిక రావడం విశేషం. ఒక అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఆయన వెలువరించిన తీర్పులు, సామాన్యుడి పక్షాన ఆయన అందించిన న్యాయ సేవలను ఈ సందర్భంగా పౌర సమాజం చర్చలోకి తీసుకొచ్చింది. ఎన్డీయే అభ్యర్థిని ప్రకటించిన తర్వాత.. ఇండియా కూటమి అభ్యర్థిగా ఎవరనే చర్చ సైతం ఆసక్తి రేకెత్తించింది. ఆ నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఒక తెలుగువాడి పేరును ప్రకటించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా పౌరసమాజం రాజకీయ పార్టీల మౌన వైఖరిని ఖండించింది. నిశ్శబ్దం వీడుదాం.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతును తెలుపుదాం అంటూ మేధావులు ముందుకు రావడం చారిత్రాత్మకం..!

## ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

**ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ఏసీబీ**

**గవర్నర్ అనుమతి కోరే అవకాశం**

హైదరాబాద్(జనంసాక్షి):ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ స్పీడ్ పెంచింది.ఈ కేసుకు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించింది. అనుమతి రాగానే ఇద్దరిపై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్టు- సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీ-ఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై నమోదైంది. 9 నెలల పాటు- ఈ కేసును విచారించిన ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ కేసులో కేటీ-ఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ రావు, ఎఫ్ఈఓలను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది.. గవర్నర్ అనుమతి రాగానే ఫార్ములా ఈ కార్ రేసులో నిందితులపై చార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫార్ములా ఈ కార్ ఈ రేస్ నిర్వహణ సంస్థకు హెచ్‌ఎండీఏ చెల్లింపులు జరిపింది. అయితే ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి విదేశీ కంపెనీకి నగదు బదిలీ అయిందని.. దాదాపు రూ.55 కోట్లు- దుర్వినియోగం జరిగినట్లు- ఏసీబీ కేసు నమోదు చేసింది.

## రెక్కలు తొడిగిన పసిడి

**ఆల్‌టైమ్ గరిష్ఠానికి బంగారం**

**10 గ్రా॥ల ధర రూ. రూ.1,10,312**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ ఫ్యూచర్ మార్కెట్‌లో పసిడి ధర మంగళవారం ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. ఒక్క రోజులోనే 10 గ్రాముల గోల్డ్ ధర రూ.723 మేర పెరిగి రూ.1,10,312 వద్దకు చేరింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. డాలర్ ఇండెక్స్ బలహీనపడడం కూడా మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబర్ డెలివరీ గోల్డ్ ధర 10 గ్రాములు ఆల్‌టైమ్ గరిష్ఠమైన రూ.1,10,312కు చేరింది. అక్టోబర్ డెలివరీ బంగారం కూడా రూ.982 మేర పెరిగి రూ.1,09,500 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. ఇక అంతర్జాతీయ ఫ్యూచర్ మార్కెట్‌లోనూ డిసెంబర్ నెల డెలివరీ ఔన్సు బంగారం 3,698.02 డాలర్ల వద్ద రికార్డు స్థాయికి చేరింది. స్పాట్ గోల్డ్ ఔన్సు 3,658.38 డాలర్లు పలుకుతోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగా మేలిమి బంగారం 10 గ్రాములు రూ.1,12,500 పైకి చేరింది.

కారణాలు ఇవీ..

గత శుక్రవారం విడుదలైన యూఎస్ జాబ్స్ డేటా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలను పెంచింది. వచ్చే వారం జరిగే భేటీలో వడ్డీ రేట్లలో 25 బేసిస్ పాయింట్ల మేర కోత ఉండొచ్చని అనలిస్టులు పేర్కొంటున్నారు. ఏడాది చివరికి మూడు కోతలు ఉండొచ్చని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్టు జిగర్ త్రివేది పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో జరిగే మానిటరీ పాలసీ భేటీలో ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం ఔన్సు 3,695 డాలర్ల పైన ట్రేడవుతోందని అగ్‌మాంట్ సీనియర్ అనలిస్టు రేనిష చైనానీ పేర్కొన్నారు. డాలర్ నిల్వలపై ఆధారపడడం తగ్గించిన చైనా సెంట్రల్ బ్యాంక్ బంగారంపై తన పెట్టుబడులు కొనసాగిస్తోందని, వరుసగా పదో నెల కూడా పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా తన దూకుడు కొనసాగిస్తోంది. అమెరికా మాటలు పెడచెవిన పెట్టి దాడులు చేపడుతోంది. దీంతో అమెరికా నుంచి మున్ముందు మరిన్ని ఆంక్షలు ఉండొచ్చన్న అంచనాలు కూడా సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయని కమోడిటీ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. డాలర్ బలహీన పడడమూ మరో కారణమని చెబుతున్నారు. డాలర్ ఇండెక్స్ 97.33 వద్ద ట్రేడవుతోంది.

## పాత స్టాక్‌కూ కొత్త ఎమ్మార్పీ

**- కేంద్రం కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):వస్తు, సేవలు పన్ను రేట్లకు సంబంధించి అటు వినియోగదారులకు, ఇటు కంపెనీలకు ఊరటనిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పాత స్టాక్‌కూ గరిష్ఠ రిటైల్ ధరను సవరించే అవకాశం కల్పించింది. దీంతో కొత్త స్టాక్ వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన అవసరం లేకుండా.. పాత స్టాక్ ధరలు కూడా తగ్గనున్నాయి. దీనివల్ల ముఖ్యంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. జీఎస్టీ శ్లాబులకు సంబంధించి ఇటీవల జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇకపై 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉండనున్నాయి.

# నేపాల్ ప్రధాని రాజీనామా

పరిస్థితుల వేళ త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని విమానాలను రద్దు చేశారు. 300 మంది సైనికులను అక్కడ మోహరించారు. మంత్రులను వారి అధికారిక నివాసాల నుంచి ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వద్ద హెలికాప్టర్ల కదలికలు కనిపిస్తున్నాయి. అలాగే రాజధాని కాఠ్‌మాండూలోని ఆర్మీ బ్యారక్స్‌లోకి వీఐపీలను తరలిస్తున్నారు.

**పార్లమెంట్‌లోకి చొరబడిన నిరసనకారులు..**

సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో జరిగిన ఆందోళనల్లో అత్యధికమంది యువత, పాఠశాల విద్యార్థులే పాల్గొనడం గమనార్హం. దీంతోపాటుగా రాజకీయ వారసత్వాలపై నిరసనలు కూడా మొదలయ్యాయి. వీటిని నెపోకిడ్ మూమెంట్‌గా పిలుస్తున్నారు. సంపన్న వర్గాల, రాజకీయ నాయకుల పిల్లలు అవినీతి సొమ్ముతో వచ్చే ఫలాలను అనుభవిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చి.. నిరసనకారులు పార్లమెంట్‌లోకి దూసుకువెళ్లారు. ఆ భవనానికి నిప్పంటించారు. మరోపక్క భక్తాపూర్‌లోని కేపీ శర్మ ఓలీ వ్యక్తిగత నివాసానికి నిప్పుపెట్టిన నిరసకారులు.. అది కాలిపోతుంటే డ్యాన్సులు చేస్తోన్న దృశ్యాలు మీడియాలో చక్కర్లు కొట్టాయి. నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధం విధింపుతో మొదలైన ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. కొన్నిచోట్ల నిరసనకారులు అమానుషంగా వ్యవహరిస్తున్నారు. మంత్రులను వీధుల్లో వెంబడించి దాడి చేస్తున్నారు. దానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.ఆగ్రహావేశాలతో ఊగిపోతున్న ఆందోళనకారులు కర్ఫ్యూ ఆదేశాలను లెక్కచేయడం లేదని కాఠ్‌మాండూ పోలీసులు వెల్లడించారు. చాలా ప్రాంతాల్లో వారు వీధుల్లోకి వచ్చేశారు. ఆ దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. వాటిలో ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడేల్ (65)పై దాడి చేసినట్లు కనిపిస్తోంది. కొందరు మంత్రిని వీధుల్లో పరిగెత్తిస్తుండగా.. ఎదురుగా వచ్చిన ఒక యువ ఆందోళనకారుడు ఆయన్ను ఎగిరితన్నాడు. దాంతో పట్టుకోల్పోయిన ఆయన పక్కనే ఉన్న గోడపై పడిపోయాడు. కానీ దూసుకొస్తున్న నిరసనకారుల నుంచి తప్పించుకునేందుకు మళ్లీ పరిగెత్తడం ప్రారంభించారు. ఈ ఆందోళనకర దృశ్యాలు కలవరపెడుతున్నాయి. మరోపక్క, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా, ఆయన సతీమణి, ప్రస్తుత విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాను ఆందోళనకారులు వదల్లేదు. వారిపైకూడా దాడి చేసి, కొట్టారు.

నేపాల్‌లోనే ఓలీ..!

ప్రధాని పదవికి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేయగా.. దానికి అధ్యక్షుడి ఆమోదం లభించింది. వెంటనే కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఇక, ఓలీ దేశం వీడి వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. ఆయన స్వదేశంలోనే ఉండే అవకాశం ఉందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. చర్చల ద్వారా ఈ సంక్షోభానికి ముగింపు పలకాలని నిరసనకారుల్ని నేపాల్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల చీఫ్స్ కోరుతున్నారు. తదుపరి ప్రధానిగా కాఠ్‌మాండూ మేయర్ బాలేంద్ర షా పేరు వినిపిస్తోంది. ప్రజలు ఆయన్ను బాలెన్‌గా పిలుస్తుంటారు. ఈ నిరసనల వేళ ప్రధాని అభ్యర్థిగా ఆయన పేరు ట్రెండింగ్‌లోకి వచ్చింది.

నేపాల్ మాజీ ప్రధాని సతీమణి మృతి!

కాఠ్‌మాండూ: యువత నిరసనలతో నేపాల్ అట్టుడుకుతోంది. ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులే లక్ష్యంగా ఆందోళనకారులు రెచ్చిపోతున్నారు. కర్ఫ్యూ ఆంక్షలు, భద్రతా బలగాలను లెక్కచేయకుండా.. ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే దేశ రాజధాని కాఠ్‌మండూలోని మాజీ ప్రధాని ఝూలానాథ్ ఖనాల్ నివాసానికి నిప్పంటించారు. ఈ ఘటనలో ఆయన సతీమణి తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతకుముందు ప్రధాని కేపీ శర్మ ఓలీ వ్యక్తిగత నివాసంపైనా దాడి చేశారు. ప్రధాని పదవికి ఆయన రాజీనామా చేయడంతో.. దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. దీంతోపాటు రాజకీయ వారసత్వాలపై ఆందోళనలు మొదలయ్యాయి. వీటిని 'నెపోకిడ్ మూమెంట్'గా పిలుస్తున్నారు. నిరసనకారులు పార్లమెంట్‌లోకి దూసుకువెళ్లారు. ఆ భవనానికి నిప్పంటించారు. దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్, మంత్రి పృథ్వీ సుబ్బ గురుంగ్, మాజీ హోం మంత్రి రమేశ్ లేఖక్ తదితరుల ఆస్తులపై దాడి చేశారు. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను వీధుల్లో పరిగెత్తించారు. మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా, ఆయన సతీమణి, ప్రస్తుత విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాలపై దాడి చేసి, గాయపర్చారు.

## భారత్ అప్రమత్తత

**నేపాల్‌కు ప్రయాణం వాయిదా వేసుకోవాలని సూచన**

**- ఇండిగో విమానాల దారి మళ్లింపు..**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఆ దేశానికి ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని భారతీయులకు విదేశాంగశాఖ సూచించింది. "నేపాల్‌లోని భారత పౌరులు తమ ఇళ్లకే పరిమితం కావాలి. వీధుల్లోకి వెళ్లొద్దు. ఈమేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నేపాల్ అధికారులతో పాటు కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయం భద్రతా సూచనలు పాటించాలి" అని అడ్వైజరీ జారీ చేసింది.దిల్లీ నుంచి కాఠ్‌మాండూ బయల్దేరిన రెండు ఇండిగో విమానాలకు త్రిభువన్ విమానాశ్రయం నుంచి క్లియరెన్స్ లభించలేదు. దాంతో వాటిని దారి మళ్లించాల్సి వచ్చింది. అవి లఖ్‌నవూలో ల్యాండ్ కావాల్సి వచ్చింది. ఈ పరిణామాల వేళ భారత రాయబార కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. 977-9808602881, 977-9810326134 నంబర్లను అందుబాటులో ఉంచింది మంత్రిని వీధుల్లో వెంబడించి దాడి

## ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు, సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొత్తం ఓట్లలో 15 చెల్లనివిగా గుర్తించారు. దీంతో 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు రాజ్యసభ సెక్రటరీ ప్రకటించారు. పార్లమెంట్ నూతన భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. భారత 17వ ఉప రాష్ట్రపతిగా ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్ను స్వామి రాధాకృష్ణన్. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఆయన జన్మించారు. తమిళనాడు నుంచి ఉప రాష్ట్రపతి పీఠం అధిష్ఠించనున్న మూడో వ్యక్తిగా రాధాకృష్ణన్ గుర్తింపు పొందారు.

తొలి ఓటు వేసిన ప్రధాని మోడీ

నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ ఉదయం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 10 గంటలకు పార్లమెంటు నూతన భవనంలోని వసుధ ఎఫ్ 101లో సందడిగా ప్రారంభమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేశారు. ఆ వెంటనే ఆయన వరద బాధిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌కు బయలుదేరారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఓటేశారు. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలు తమ ఓటు- హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ క్యూలో నిలబడి ఓటు వేయడం అందర్నీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేష్, శశిథరూర్ తమ ఓటు- హక్కును వినియోగించుకున్నారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ వీల్‌చైర్‌పై పార్లమెంటుకు వచ్చి ఓటు వేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కిరణ్ రిజిజు, చిరాగ్ పాశ్వాన్, కిషన్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజ్యసభ డిప్యూటీ- చైర్‌పర్సన్ హరివంశ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తదితర ప్రముఖులు ఓటు- హక్కును వినియోగించుకున్నారు. వివిధ కారణాల రీత్యా ఓటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు భారత్ రాష్ట్ర సమితి, బిజూ జనతాదళ్ , శిరోమణి అకాలీదళ్ ప్రకటించాయి. బీఆర్ఎస్‌కు నలుగురు రాజ్యసభ ఎంపీలు, బీజేడీకి ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, శిరోమణి అకాలీదళ్‌కు ఒక ఎంపీ ఉన్నారు. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిలు పోటీ-పడుతున్నారు. పార్లమెంట్ ఉభయసభలకు ప్రాతినిధ్యం వహించే మొత్తం సభ్యుల సంఖ్య 788 అయినప్పటికీ ఏడు స్థానాలు ఖాళీ కావడం వల్ల ప్రస్తుతం 781 మందే ఉన్నారు. ఎన్డీయేకి 425 మంది సభ్యుల బలం ఉంది. వైకాపా, ఇతర పార్టీల మద్దతు కలిపితే ఆ సంఖ్య 438కి మించే అవకాశం కనిపిస్తోంది. ప్రతిపక్ష కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 314 మంది ఎంపీల మద్దతు ఉంది. ఈ సంఖ్య పెద్దగా మారే సూచనలు లేవు. ఎన్డీయే అభ్యర్థి గెలుపు లాంఛనమని తెలిసినా ప్రతిపక్షాలు ఈ ఎన్నికలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని రంగంలోకి దించాయి.

# అధికారులు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి

- మేడారం జాతరపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- 150 కోట్ల రూపాయలతో ఏర్పాట్లు
- భక్తులకు అమ్మవార్లపై భక్తి విశ్వాసం పెంపొందించాలి
- దేవుళ్ళ వద్ద రాజకీయం చేసిన నాయకులు ఎవరు ఎదగలేదు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, మేడారంలో జరుగునున్న పనులను పరిశీలించడానికి వారంలోగా ముఖ్యమంత్రి మేడారాన్ని పర్యటిస్తారని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద్ర లతో కలసి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న విఐపి పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, హరిత హెూటల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మేడారంలోని ఐటీడీఏ సమావేశపు హాల్లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 150 కోట్ల రూపాయలను కేటాయించిందని, కేటాయించిన నిధులతో ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనలు మేరకు నూతన హంగులతో శ్వాశతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని, మేడారం గ్రామస్తులు పూజారుల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పండుగనే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య పౌరుని నుండి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వివిఐపి లకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండే విధంగా పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. దేవుళ్ళు కలిగిన ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహా జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. భక్తులకు అమ్మవార్లపై భక్తి విశ్వాసం పెంపొందించేలా జాతర ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివ నాగిరెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఈఓ వీరస్వామి, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీ వినూత్న సేవా కార్యక్రమం 'యాత్రాదానం'

- ప్రత్యేకమైన, ఆనందదాయకమైన రోజుల్లో యాత్రలను దానం చేసే సదుపాయం
- యాత్రాదానం పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : సామాజిక బాధ్యతలో భాగంగా 'యాత్రాదానం' అనే వినూత్న కార్యక్రమానికి టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. వ్యక్తుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాలు, తదితర ప్రత్యేకమైన, ఆనందదాయకమైన రోజుల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. తాము జరుపుకునే శుభదినాన తగిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా అందజేయడం ద్వారా వారికి టీజీఎస్ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తుంది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం యాత్రాదానం కార్యక్రమ పోస్టర్ ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్‌తోపాటు ఈడీలు మునిశేఖర్, రాజశేఖర్, ఖుస్రోషా ఖాన్, వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, హెచ్ఓడీలు శ్రీధర్, శ్రీదేవి, ఉషాదేవి, ప్రభులత, కవిత, తదితరులు పాల్గొన్నారు. దాతలు చెల్లించే విరాళం మేరకు కిలోమీటర్ల ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులను విహారయాత్రలకు సంస్థ ఏర్పాటు చేస్తుంది. టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్థానిక ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించి యాత్రాదానం కింద బస్సులను బుకింగ్ చేసుకోవచ్చు. ఆర్టీసీ హెల్ప్ లైన్ నంబర్లు 040 69440000 / 040 23450033 కాల్ చేసి సమాచారం ఇస్తే సంబధిత ఆర్టీసీ అధికారులు ఫోన్ చేసి యాత్రాదాన టూర్ ప్యాకేజీల వివరాలను తెలియజేస్తారు. యాత్రాదాన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా వినూత్న ఆలోచనతో యాత్రా దానం కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకు వస్తున్న టీజీఎస్ఆర్టీసీ యాజమా న్యాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని చాలా మందికి ఉంటుందని, అలాంటి వారికి యాత్రాదానం కార్యక్రమం ఒక వరమని అన్నారు.

### యాత్రాదానం నిధికి మంత్రి పొన్నం ప్రభాకర్, సజ్జనర్ చెరో లక్ష విరాళం

యాత్రాదానం నిధికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనర్ చెరో లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ విరాళానికి సంబందించిన చెక్‌లను ఆర్టీసీ ఉన్నతాధికారులకు వారు అందజేశారు. మంత్రి విరాళాన్ని అనాథలు, నిరాశ్రయులైన వృద్దులకు, నిరుపేద విద్యార్థుల విహార యాత్రలకు వినియోగించనుండగా.. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ విరాళాన్ని అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు తాడ్ బండ్ లోని సైన్స్ సెంటర్ లో సైన్స్ ప్రయోగాలు వీక్షించేందుకు వెళ్లేందుకు రవాణా సదుపాయం కోసం ఉపయోగిస్తారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాను కేటాయించాలి




నస్పూరు (జనంసాక్షి) : సింగరేణి యాజమాన్యం ప్రకటించబోయే లాభాల్లో సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీసం 15% లాభాలను కేటాయించాలని ఎస్సిసిడబ్లుయు-ఐఎఫ్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.వారు మాట్లాడుతు సింగరేణి యాజమాన్యం అన్ని విభాగాలలో కాంట్రాక్ట్ కార్మికుల నియమించిందని, కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించడం వల్ల సింగరేణికి లాభాలు వస్తున్నాయని,అదే పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా వేతనాలు చెల్లించి ఉంటే సింగరేణి సంస్థకు ఇంత పెద్ద మొత్తంలో లాభాలు వచ్చేటివి కావని అన్నారు.సింగరేణి యాజమాన్యానికి అనేక సార్లు వివరించడం ద్వారా గత సంవత్సరం లాభాల్లో కేవలం ఐదువేల రూపాయలు చెల్లించడం జరిగిందని,పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు కానీ హక్కులు,సౌకర్యాల విషయంలో విపరీతమైన తేడాలు ఉన్నాయని, ఒకే చోట పక్క పక్కకే పని చేసే పర్మిట్ కార్మికునికి డెబ్బైవేల నుంచి లక్ష రూపాయలు వేతనం చెల్లిస్తు,కాంట్రాక్ట్ కార్మికులకు ఏడువేల నుంచి పదివేల మధ్యలో వేతనలు చెల్లిస్తున్నారన్నారు.ఈ వ్యత్యాసం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని,కనీసం కోల్ ఇండియా వేతనాలు కూడా సింగరేణిలో అమలు చేయడం లేదని,కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ద్వారా వచ్చే లాభాల నైనా 15% చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-ఐఎఫ్టియు గా డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన కొత్తగూడెంలోని హెడ్ ఆఫీస్ ముట్టడించబోతున్నామని, సింగరేణి వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరుచున్నామమని తెలిపారు.

# బైక్‌ను ఢీకొన్న లారీ

- దంపతులు అక్కడిక్కడే మృతి



ఖమ్మం, సెప్టెంబర్9 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఎర్రుపాలెం మండలంలోని తక్కెళ్లపా డు గ్రామ సమీపంలో లారీ ఢీకొని బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలు మృతి చెందారు. ఈసంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతులు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గని ఆత్కూర్ గ్రామానికి చెందిన దామినేని శ్రీనివాసరావు (54), దామినేని రజిని కుమారి(50)గా గుర్తించారు. వీరు తక్కెళ్లపాడు నుండి బైక్ మీద ములుగు మాడు వైపు వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# అల్లు బిజినెస్ పార్కులో పెంట్ హౌజ్ నిర్మాణం

- అక్రమ నిర్మాణంపై జిహెచ్ఎంసి నోటీసులు




హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : ఒకవైపు పుష్ప 2 వివాదం ముగిసింది అనుకునేలోపే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అల్లు ఫ్యామిలీకి మరో షాక్ తగిలింది. ఇటీవల అమ్మ మరణించి బాధలో ఉన్న ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌కి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న ఆయనకు చెందిన అల్లు బిజినెస్ పార్క్‌పై ఈ చర్యలు తీసుకున్నారు. ఈ భవన నిర్మాణానికి నాలుగు అంతస్తుల వరకు మాత్రమే జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చింది.. అయితే, తాజాగా భవనంపై అదనంగా ఒక పెంట్‌హౌస్‌ను నిర్మించారని అధికారులు ఇటీవలే గుర్తించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అనుమతులు లేని ఆ నిర్మాణాన్ని ఎందుకు కూల్చివేయకూడదో వివరించాలని కోరుతూ సర్కిల్-18 అధికారులు అల్లు అరవింద్‌కు షోకాజ్ నోటీసు పంపారు. అల్లు ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు కేంద్రంగా ఉండనున్న ఈ అల్లు బిజినెస్ పార్క్ నిర్మాణ పనులు 2023 నవంబర్‌లో ప్రారంభమయ్యాయి. దివంగత నటుడు అల్లు రామలింగయ్య 101వ జయంతి సందర్భంగా ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. గీతా ఆర్ట్స్, అల్లు ఆర్ట్స్ వంటి సంస్థల కార్యాలయాలు ఈ భవనంలో ఉండనున్నాయి. అయితే, అక్రమ నిర్మాణాల కారణంగా ఈ భవనం ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. అయితే ఈ నోటీసులపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అల్లు ఫ్యామిలీని టార్గెట్ చేస్తుందని కామెంట్లు పెడుతున్నారు.



# వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) : ఈ నెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్లో నిర్వహించే ఫోటో ఎక్స్పో వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి. ఫోటో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు రాపోలు రాంబాబు, నరేష్, ఎడవెల్లి వెంకన్న, బొమ్మగాని ప్రదీప్, వర్ధమాన్ శ్రీనివాస్, రమణ, సురేష్, శివప్రసాద్, ప్రశాంత్. తదితరులు ఉన్నారు.

# గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలను తనిఖీ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 9(జనంసాక్షి): వరంగల్ ఆటోనగర్ లోని గిర్మాజీపేట ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షయ పాత్ర వారిచే వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు రుచి గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పాఠశాలలోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థుల తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల పఠన సామర్థ్యాన్ని పదిశీలించి, పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, వారి విషయావగహన పరీక్షించారు. మెరుగైన బోధన అందించుటకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే.. జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు.మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలి

- ప్రతిపనీ సర్పంచ్ పర్యవేక్షణలో సాగాలి




హైదరాబాద్, సెప్టెంబర్9 (జనంసాక్షి) : త్వరలోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్న ప్రభుత్వం గ్రామాలను బలోపేతం చేసేలా సర్పంచ్ వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంది. గ్రామాలపై అదేపనిగా పెత్తనం చేయకుండా సాగాలి. కులవృత్తులను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయలేం అని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సి ఉంది. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని గుర్తించాలి. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమా లను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్ లకు ఉండాలి. పల్లెలో చేపడుతున్న ఏ కార్యక్రమం అయినా అంతా అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. ఇకపోతే గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామమాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామిలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించు కోవచ్చని నిపుణులు అంటున్నారు. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థికభారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించు కోవాలని కోరుతున్నారు. ఈ నిర్ణయంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏం పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం ఊరటనిస్తోంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని గతంలోనే సర్పంచులు సైతం అంగీకరించారు. పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ఇంతకాలం వంద రోజుల పనులు చేపట్టని కూలీలకు ఏవిధంగా పని చూపించాలనే ఆలోచి స్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం వూరటనిస్తోంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించవచ్చు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో దొంగల బీభత్సం

- 40 తులాల వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు





ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామ శివారులో ఉన్న హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ప్రధాన ఆలయం తలుపుల తాళం పగులగొట్టి ఆలయం గర్భ గుడిలోకి ప్రవేశించిన దొంగలు స్వామివారిపై ఉన్న 40 తులాల వెండి, అరతులం బంగారంతో పాటు ఇతర చిన్నచిన్న నగలను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం యదావిధిగా గ్రామస్తులు, భక్తులు ఆలయంకు వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం తెలుసుకుని వెంటనే తలమడుగు మండలం పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు వచ్చి దొంగతనం జరిగిన తీరును క్లూస్ టీమ్ బృందం రమేష్, గణేష్ లతో విచారణ చేపట్టారు. కాగా ఈ ఆలయంలో దొంగతనం జరగడం ఇది రెండోసారి.

# సీజ్ చేసిన నల్లబెల్లాన్ని రైతులకు తక్కువ ధరకు కేటాయించండి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు.. తనిఖీ చేసి సీజ్ చేస్తున్న నల్లబెల్లాన్ని రైతులకు తక్కువ ధరకు ఇవ్వాలని రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి అన్నారు. రైతులు నల్లబెల్లాన్ని సేంద్రియ ఎరువుల తయారీలో వాడుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని సీజ్ చేసిన నల్లబెల్లాన్ని రైతులకు ఇవ్వడం వలన సాగుకు సాయం చేసినట్లేనన్నారు. దీనిపై ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశమయ్యారు. రీసెంట్‌గా రైతు కమిషన్ ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటన చేసిన సమయంలో చాలా మంది రైతులు నల్లబెల్లంతో సేంద్రియ ఎరువు తయారు చేసే విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చినట్లు మంత్రికి వివరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేసి.. కొంతకాలానికి దాన్ని అడవుల్లో లేదంటే ఇతర ప్రాంతాల్లో పారబోస్తున్నారు. అలా వృధాగా పారబోయడం కంటే.. రైతులకు ఇస్తే.. సేంద్రియ ఎరువు ఉపయోగానికి వాడుకునే అవకాశం వుంటుందన్నారు. రైతు కమిషన్ ప్రతిపాదనకు ఎక్సైజ్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ కొదండరెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కమిషన్ సభ్యులు భూమి సునీల్ తోపాటు కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, కమిషన్ అధికారి హరివెంకట ప్రసాద్, ఆదర్శ రైతు కోటిరెడ్డి వున్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 సెప్టెంబర్ 2025

# నేపాల్‌లో యువత అసంతృప్తి జ్వాలలు



నేపాల్ రాజధాని కాఠ్మండు వీధులు ఇటీవలి రోజుల్లో రక్తపాతంతో మునిగిపోయాయి. యువత నేతృత్వంలోని జెన్ జెడ్ నిరసనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన సోషల్ మీడియా నిషేధం ఇందుకు తాత్కాలిక ట్రిగ్గర్‌గా మారినప్పటికీ, లోతైన కారణాలు అవినీతి, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం వంటివి దేశంలోని యువతను విసిగించి వేధిస్తున్నాయి. సెప్టెంబర్ 8, 2025న జరిగిన ఘర్షణల్లో కనీసం 19 మంది మరణించారు, 300 మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లు, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడంతో పార్లమెంట్ ప్రాంగణం యుద్ధభూమిగా మారింది. ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది, ఆర్మీని రంగంలోకి దింపినప్పటికీ, నిరసనలు దేశవ్యాప్తంగా వ్యాపించాయి. పైకి వినిపిస్తున్నట్లు ఇది కేవలం సోషల్ మీడియా నిషేధం గురించి మాత్రమే కాదు, ఇది దశాబ్దాలుగా పేరుకుపోయిన అసంతృప్తి యొక్క వ్యక్తీకరణ.

నేపాల్ చరిత్రలో నిరసనలు కొత్తవి కావు. 2008లో రాజరికం రద్దు చేసిన తర్వాత, కమ్యూనిస్ట్ గ్రూపులు అధికారంలోకి వచ్చాయి. కానీ ఇది రాజకీయ అస్థిరతకు, అవినీతికి మూలమైంది. మావోయిస్ట్ తిరుగుబాటు (1996-2006) దేశాన్ని సివిల్ వార్‌లో ముంచేసింది. ఆ తర్వాత ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఆశలు రేకెత్తించింది. అయితే, 2025లో ప్రో-మోనార్కీ నిరసనలు మళ్లీ తలెత్తాయి. హిందూ రాజ్య స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 60,000 మంది పాల్గొన్నారు. ఈ తిరుగుబాటు ఉద్యమం కమ్యూనిస్ట్ ప్రభుత్వాలపై అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. ఎందుకంటే రాజరికం రద్దు తర్వాత దేశం ఆర్థిక సంక్షోభాలు, మతపరమైన గుర్తింపు కోల్పోవడం వంటి సమస్యలతో పోరాడుతోంది. మధేసి ఉద్యమాలు, జన జాతి డిమాండ్లు, టీచర్ల నిరసనలు (ఎడ్యుకేషన్ బిల్ కోసం) వంటివి ఫెడరల్ వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి.

ఇటీవలి కోవిడ్-19 మహమ్మారి, 2015 భూకంపం తర్వాత పునర్నిర్మాణ లోపాలు యువతలో అసంతృప్తిని మరింత పెంచాయి. ఈ చారిత్రక నేపథ్యం ఇప్పటి నిరసనలకు బలమైన పునాది ఏర్పరచింది. ఎందుకంటే ప్రజలు ప్రజాస్వామ్య వాగ్దానాలు నెరవేరలేదని భావిస్తున్నారు. ఈ నిరసనలకు ప్రధాన కారణాలు బహుముఖాలుగా ఉన్నాయి. సోషల్ మీడియా నిషేధం (ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి 26 యాప్‌లపై) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధానికి కారణం చూపుతూ ప్రభుత్వం టాక్స్, రిజిస్ట్రేషన్ సమస్యలను సాకుగా చూపిస్తుంది, కానీ యువత దీన్ని సెన్సార్‌షిప్‌గా చూస్తోంది. ఇవి అవినీతిని బహిర్గతం చేసే వీడియోలు, పోస్టులను అడ్డుకోవడానికి ప్రయత్నమని వారి అభిప్రాయం.

లోతుగా చూస్తే, నిరుద్యోగం (15-29 ఏజ్ గ్రూప్‌లో 19.2 శాతం), పేదరికం (పెర్ క్యాపిటా ఇన్‌కమ్ 1,300 డాలర్లు), నెపోటిజం, రాజకీయవర్గాల పిల్లల లగ్జరీ లైఫ్ వంటివి యువతను కదిలిస్తున్నాయి. ప్రభుత్వంలో విశ్వాసం కోల్పోవడం, డెసిషన్ మేకింగ్‌లో యువతను సైడ్‌లైన్ చేయడం ఇందుకు కారణాలు. ఈ నిరసనలు బంగ్లాదేశ్ ఉద్యమాలతో సమానతలు కలిగి ఉన్నాయి, లీడర్‌షిప్ లేకుండానే దేశవ్యాప్తంగా వ్యాపించడం ఆందోళనకరం. విమర్శనాత్మకంగా చూస్తే, ప్రభుత్వం యువత గొంతును అణచివేయడానికి బదులు సమస్యలను పరిష్కరించాలి. లేకపోతే ఇది



రెజిమ్ చేంజ్‌కు దారితీస్తుంది. ప్రస్తుత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. నిషేధాన్ని ఎత్తివేసినప్పటికీ, నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. పార్లమెంట్ స్టార్మింగ్, హోమ్ మినిస్టర్ రమేష్ లేఖక్ రాజీనామా దేశంలోని అస్థిరతను బయటపెడుతున్నాయి.

కెపి శర్మ ఒలి నేతృత్వంలోని ప్రభుత్వం చైనా-లీనింగ్‌గా చూడబడుతోంది, ఇండియా-లీనింగ్ నాయకులు ఇందుకు ప్రత్యామ్నాయంగా ఉద్భవిస్తున్నారు. యుఎన్ సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది, కానీ ప్రభుత్వం హింసాత్మక దమనాన్ని కొనసాగిస్తోంది. అంతేకాదు ఇది రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ఎందుకంటే యువత తమ డెసిషన్ మేకింగ్‌లో భాగస్వామ్యం కోరుతోంది. సెప్టెంబర్ 9న ప్రధాని ఒలి రాజీనామా చేశారు, పార్లమెంట్‌ను దహనం చేశారు, విమానాశ్రయాలు మూసివేయబడ్డాయి. ఆర్మీ సెక్యూరిటీ తీసుకుంది, కానీ నిరసనలు కొనసాగుతున్నాయి.

ఈ సమస్యలకు పరిష్కార మార్గాలు స్పష్టంగా ఉన్నాయి, కానీ వాటిని అమలు చేయడం కష్టం. ముందుగా, మరణాలపై పారదర్శకమైన విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలి. నిరసనకారులతో డైలాగ్ ఏర్పాటు చేసి, అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఆర్థిక సంస్కరణలు, జాబ్ క్రియేషన్, ఎడ్యుకేషన్ బిల్ పాస్ చేయడం ద్వారా యువత విశ్వాసాన్ని తిరిగి పొందాలి. ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌ను రక్షించడం, సిటిజన్ అసెంబ్లీలు ఏర్పాటు చేయడం వంటివి దీర్ఘకాలిక పరిష్కారాలుగా చూడాలి. విమర్శనాత్మకంగా పరిశీలించి చూస్తే, ప్రభుత్వం తన అథారిటేరియన్ ధోరణిని మార్చుకోకపోతే, ఇది మరిన్ని ఘర్షణలకు దారితీస్తుంది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు శాంతియుత నిరసనలను రక్షించాలని పిలుపునిచ్చాయి.

నేపాల్ నిరసనలు ఒక సందేశాన్ని ఇస్తున్నాయి. యువత అసంతృప్తిని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. చారిత్రక లోపాల నుండి పాఠాలు నేర్చుకుని, ప్రస్తుత సమస్యలను పరిష్కరించడం ద్వారా మాత్రమే దేశం స్థిరత్వాన్ని సాధించగలదు. లేకపోతే, ఈ అగ్ని మరింత వ్యాప్తి చెందుతుంది. %శ% ప్లాట్‌ఫాంలోని పోస్టులు ఈ ఉద్రిక్తతను ప్రతిబింబిస్తున్నాయి, హాస్పిటల్స్‌లో గాయాలు, పార్లమెంట్ దాడులు వంటివి రియల్‌టైమ్ ఇమేజెస్‌తో వైరల్ అవుతున్నాయి. ఇటువంటి ఉద్యమాలు పొరుగు దేశాల్లోనూ ప్రభావం చూపుతున్నాయి, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లోని అస్థిరతలు ఇందుకు ఉదాహరణలు. నేపాల్ ప్రభుత్వం యువత డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకపోతే, మరిన్ని మార్పులు అనివార్యం. ఈ సంక్షోభం దేశాన్ని కొత్త దిశగా నడిపించవచ్చు, లేదా మరిన్ని ఘర్షణలకు దారితీయవచ్చు. అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకుని శాంతి మార్గాలు సూచించాలి. యువత శక్తిని సానుకూలంగా మలచడం ద్వారా మాత్రమే నేపాల్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# తెలుగు సాహిత్యంలో హైదరాబాద్ నగర చిత్రణ

పారిశ్రామిక విప్లవం ప్రపంచ చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు, మానవ జీవన విధానాన్ని, సమాజ రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. ఈ విప్లవం నగరీకరణకు పునాది వేసింది. నగరాలు ఉపాధి అవకాశాల కేంద్రాలుగా ఎదగాల్సిన సందర్భంలో, నిరుద్యోగం, పోటీ, అసమానతల కేంద్రాలుగా మారడం విరుద్ధాంశం. ఈ విరుద్ధతలు తెలుగు సాహిత్యంలో అనేక రూపాల్లో ప్రతిబింబించాయి. నగర జీవితం కేవలం భౌగోళిక పట్టణం కాదు, ఒక జీవన శైలి, సంస్కృతి, సామాజిక విరుద్ధతల సమాహారం. బ్యూటీ పార్లర్లు, బంగారు దుకాణాలు, చీరల వ్యాపారం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కష్టాలు, రెడీమేడ్ సంస్కృతిబయటకు ఆకర్షణీయంగా కనిపించినా, లోతులో అస్థిరత, అసమానతలు, నియమ నిబంధనలతో నిండి ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరం ప్రత్యేక అధ్యయనానికి అర్హమవుతుంది. తెలంగాణ గుండెకాయగా, నాలుగు వందల ఏళ్ల సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని మోస్తూ, నిజాం రాజధానిగా, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఈ నగరం తెలుగు సాహిత్యంలో వైవిధ్యభరితంగా చిత్రితమైంది. నవలలు, కథలు, కవితలు, వ్యాసాలు, నాటకాలు, ఆత్మకథలు, పరిశోధనలు నగర జీవన వైవిధ్యాన్ని, విరుద్ధతలను ప్రతిబింబిస్తాయి. కొందరు రచయితలు హైదరాబాద్‌ను ఆకర్షణల తోటగా వర్ణిస్తే, మరికొందరు అల్లకల్లోల క్షేత్రంగా చిత్రించారు.

తెలుగు కవిత్వంలో హైదరాబాద్ సూఫీ సంస్కృతి, తెలంగాణ జీవనశైలి, ఆధునికత, వలసవాద ప్రభావం, గ్లోబల్ సాంస్కృతిక మార్పులకు ప్రతిబింబం. సరోజిని నాయుడు భాగ్యనగర వైభవాన్ని, సూఫీ భావజాలాన్ని వర్ణించారు. సినారె ఆమె కవితలను ముత్యాల కోకిలగా అనువదించి తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అలిశెట్టి ప్రభాకర్ "సిటీ లైఫ్" శీర్షికతో హైదరాబాద్‌ను మినీ కవితల్లో చిత్రించారు. "నగరం అర్థం కాని రసాయనశాల, చిక్కుముడి పద్మవ్యూహం" అని నగర సంక్లిష్టతను వర్ణించారు. 2009లో వెలువడిన హైదరాబాద్ కవుల సంకలనంలో 49 మంది కవులు నగర జీవనాన్ని వివిధ కోణాల్లో చిత్రించారు. వేముగంటి మురళి "ఆ కేఫ్ మూతపడిరది" కవితలో పాత కేఫ్ కల్చర్ పతనాన్ని, కొత్త వినియోగ సంస్కృతి ప్రభావాన్ని వర్ణించారు. కాంచనపల్లి "డ్రైవర్ జీవితం"లో బస్సు డ్రైవర్ యాంత్రిక జీవనాన్ని చిత్రించారు. సబ్బని లక్ష్మీనారాయణ "హైదరాబాద్! ఓ! హైదరాబాద్" కవితలో చారిత్రకత, సంస్కృతి, మమకారాన్ని సమగ్రంగా వర్ణించారు.స్వీయచరిత్రలు హైదరాబాద్ చరిత్రను అర్థం చేసుకోవడానికి విలువైన మూలాధారాలు. రావి నారాయణరెడ్డి "నా జీవితపథం"లో తెలంగాణ రైతాంగ పోరాటం, నిజాం దమనకాండ, పోలీసు చర్యలను వివరించారు. స్వామి రామానంద తీర్థ సామాజిక అసమానతలు, గ్రామీణ ఆందోళనలను చిత్రించారు.

కథలు నగరంలోని విభిన్న వృత్తులు, జీవన శైలులను చిత్రిస్తాయి. కాసుల ప్రతాపరెడ్డి "ఒక రోజు"లో జర్నలిస్టుల అస్థిరత, అంపశయ్య నవీన్ "చివరి కానుక"లో మధ్యతరగతి జర్నలిస్టుల కష్టాలు, "గన్ అండ్ యూనిఫామ్"లో పోలీసు వ్యవస్థ అవినీతిని, కాలువ మల్లయ్య "తీపి"లో వైద్యుడి నైతికతను, "విశ్వనాథం"లో పేదరికం నుండి విశ్వవిద్యాలయ పదవి వరకు పోరాటాన్ని చిత్రించారు. జాతశ్రీ "సబ్ ఠీక్ నహీ హై"లో నేపాలీ వాచ్‌మన్ కష్టాలు, కె.వి. నరేందర్ "వీకెండ్"లో సాఫ్ట్‌వేర్ జంటల ఒత్తిడిని వర్ణించారు. చిన్న వ్యాపారాలు, కూలీల జీవితాలు జ్వాలాముఖి, కె.వి. నరేందర్ కథల్లో కనిపిస్తాయి.

నవలలు విద్యార్థి జీవితం, నిరుద్యోగం, వలసలు, మురికివాడలు, ఆధునిక జీవనశైలిని చిత్రిస్తాయి. అంపశయ్య నవీన్ "ఉస్మానియా"లో విశ్వవిద్యాలయ వాతావరణం, "ముళ్ళపొదలు"లో నిరుద్యోగ కష్టాలు, భాస్కరభట్ల కృష్ణారావు "వెల్లువలో పూచిక పుల్ల"లో గ్రామీణ-నగర బేధాలు, దాశరథి రంగాచార్య "మాయ జలతారు"లో మురికివాడల దోపిడీ, ముదిగంటి సుజాత రెడ్డి "మలుపు తిరిగిన రథచక్రాలు"లో స్త్రీ జీవన కష్టాలు, పరవస్తు లోకేశ్వర్ "సలాం హైదరాబాద్"లో చారిత్రక ఉద్యమాలు చిత్రితమయ్యాయి.పరిశోధనలలో సి.హెచ్. సోమాచారి ఉస్మానియా యూనివర్సిటీలో నగర జీవన చిత్రణ, సామిడి జగన్ రెడ్డి విలీన నేపథ్యంలో సాహిత్యాన్ని విశ్లేషించారు. హైదరాబాద్ నగరం తెలుగు సాహిత్యంలో సాంస్కృతిక ప్రతీకగా, సజీవ పాత్రధారిగా నిలిచింది. కథలు, నవలలు, కవిత్వం, ఆత్మకథలు నగర హృదయ స్పందనలను చేరువ చేశాయి.

డా. ఐ. చిదానందం,
తెలుగు ఉపన్యాసకులు,
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ,
నాగర్‌కర్నూల్ జిల్లా,
చరవాణి: 8801444335

## పాడుబడ్డ ఊరు



ఆ ఊరంతా నిర్మానుష్యయి
పాడుబడ్డ గోడలు,
గోడలపై పగుళ్లలో
నిశ్శబ్దం పుట్టుకువచ్చినట్టూ...
ఇంటి పైకప్పుల్లోంచి వేళ్లూనుకుపోయిన
చెట్లు.

ఆమె ఒక్కతే
ఆ ఊళ్ళో ఇంకా జీవిస్తోంది,
సగం చినిగిన జాకెట్ ముక్కతో
తన ఒళ్ళంతా కప్పేసుకుని.

తనకంటూ
తోడెవ్వరూ లేని ఆ నిర్మానుష్య నేత్రాల్లో,
ఒక ఆశ అనుకోకుండానే
తనలోకి పాకినట్టైంది.

భాష తెలీని ఉద్వేగంలో,
తన మౌనం భావమైంది.

ముసలి ఛాయల్లో...
ఊపిరి గాల్లో మిళితం అవ్వటమే ఆలస్యం.
ఇకు
ఇంకొన్ని రోజుల్లో,
అడవి ఆ ఊరిని తనలో ఐక్యం
చేసుకుంటది,
తనూ
ఆ నేలలోనే ఐక్యం అవుతది,
ఎన్నో ఏండ్లకు,
మళ్ళీ అదే నేలపై
జనాలు తిరగాడుతారు.

బాలాజీ పోతుల
8179283830


# చిత్ర రేఖలలో చిరకాల ప్రతిధ్వని

**చందమామ వెలుగుల్లో బొమ్మల బ్రహ్మ వడ్డాది పాపయ్య**

**వడ్డాది పాపయ్య: కుంచెలో విరిసిన తెలుగుదనం**

సెప్టెంబరు 10...వడ్డాది పాపయ్య జయంతి

వడ్డాది పాపయ్య (సెప్టెంబరు 10, 1921 - డిసెంబర్ 30, 1992) తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఒక అపూర్వ చిత్ర కారుడు. "వ.పా." అనే పొడి అక్షరాల సంతకం చూసిన వెంటనే ఆ బొమ్మ ఎవరిదో చెప్పకుండానే అర్థమయ్యేది. తెలుగు పత్రికలు, పుస్తకాలు, బాలల కథలు, పురాణ చిత్రాలు, పల్లె దృశ్యాలు ఆయన కుంచె తాకిడితో జీవం పోసు కున్నాయి. కేవలం ఒక చిత్రకారుడిగా కాకుండా రచయితగా, దృశ్య కవిగా, సృజనాత్మక తపస్విగా ఆయన నిలిచారు.





శ్రీకాకుళం పట్టణంలో రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన పాపయ్య తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడం వలన చిన్ననాటి నుంచే రంగుల లోకంలో మునిగి పోయాడు. ఐదేళ్ల వయసులోనే హనుమంతుని చిత్రాన్ని గీసి తన ప్రతిభను చాటుకున్నాడు. రాజా రవివర్మ, దామెర్ల రామారావు వంటి దిగ్గజాల ప్రభావం ఆయనపై బలంగా పడింది. కానీ ఆయన వారిని అనుకరించకుండా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపు దిద్దుకున్నారు. బొమ్మలపై మక్కువ వయసు పెరిగేకొద్దీ సాధనగా మారి, సాధన తపస్సుగా పరిణమించి, ఆ తపస్సే ఆయన చిత్ర జీవితమైంది.

ఆయన శైలిలో సంప్రదాయం, ఆధునికత, జానపదం, పల్లెపాటల సౌందర్యం అంతర్లీనంగా కలిసి పోయేవి. మహిళా రూప చిత్రణలో ఆయనకున్న ప్రతిభ అసామాన్యం. స్త్రీ రూపం ఆయన చిత్రాల్లో దివ్యమైన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది. "వడ్డాది బ్యూటీ" అన్న పదం తెలుగు పాఠక లోకంలో ఒక ప్రత్యేక ముద్ర వేసింది. ఆయన గీసిన సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులు లాంటి దైవ రూపాలు పుస్తకాల్లో చూడగానే ఆ పాత్రలపై మరింత భక్తి, మమకారం కలుగుతాయి. అదే విధంగా ఆయన సృష్టించిన పల్లె ఆడపిల్లల రూపాలు, మత్స్యగంధి, ఊర్మిళ నిద్ర వంటి చిత్రాలు పల్లెటూరి అందాలను సజీవం చేస్తాయి.

వడ్డాది పాపయ్య చిత్రాలు తెలుగు పత్రికా ప్రపంచంలో ఒక విప్లవం. "చందమామ" పత్రికలో మూడు దశాబ్దాలకు పైగా ఆయన చిత్రాలు వెలువడ్డాయి. కథ చదివే ముందే పాఠకుని మనసును గెలుచు కునేది ఆయన వేసిన బొమ్మే. "భారతి", "చంద్రిక", "ఆంధ్రపత్రిక", "ఆంధ్రజ్యోతి", "స్వాతి", "అభిసారిక", "యువ" వంటి పత్రికల్లో ఆయన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణ. ఆయన చిత్రాలు కోసం పత్రికలు అమ్ముడయ్యేవి అనడం అతిశయోక్తి కాదు. గుడిపాటి వెంకట చలం, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యద్దనపూడి సులోచనా రాణి నవలలకు ఆయన వేసిన కవర్ ఆర్ట్ ఆ పుస్తకాల ప్రాచుర్యాన్ని రెట్టింపు చేసింది. ఒక చిన్న చిత్రం కూడా సాహిత్యానికి ఎంత జీవం పోసుకోగలదో ఆయన చూపించారు.

ఆయన చిత్రాల్లో రంగుల వినియోగం అపూర్వం. నీలి రంగుపై ఆయనకున్న మక్కువ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తైల వర్ణాల కంటే నీటి రంగుల్లోనే తాను కోరుకున్న సున్నితత్వం సాధ్యమవుతుందని భావించేవారు. నలుపు-తెలుపు చిత్రాల్లోనూ ఆయన ప్రతిభ తక్కువేమీ కాదు. వెలుగు-నీడల సమన్వయం ఆయన చిత్రాలకు అద్భుతమైన ఆహ్లాదాన్ని, కవితాత్మకతను తెచ్చింది. జీవంతో కూడిన రేఖలు, మృదువైన స్పర్శ, అలంకరణలోని నైపుణ్యం ఆయన చిత్రాలకు ప్రత్యేకతను ఇచ్చాయి.

చిత్రకళ మాత్రమే కాకుండా రచనలోనూ ఆయన ప్రతిభను ప్రదర్శించారు. "చందమామ"లో కొడవటిగంటి కుటుంబరావు మొదలు పెట్టిన "దేవీ భాగవతం" కథలను పూర్తి చేయడంతో పాటు "విష్ణుకథ" అనే పౌరాణిక సీరియల్‌ను రచించారు. చిన్నపిల్లల ఊహా ప్రపంచాన్ని విస్తరించేలా ఆయన చిత్రాలు, రచనలు ఒకేసారి ఆకర్షించేవి. పంచతంత్రం కథల్లోని జంతు పాత్రలకు ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ పాఠకుల మదిలో నిలిచిపోయాయి.

పాపయ్య నిరాడంబర జీవనశైలిని అవలంబించారు. ఇంటర్వ్యూలు, ప్రదర్శనలు, వ్యక్తిగత ప్రాచుర్యం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. కళను గౌరవించాలి, కళాకారుని కాదు అని ఆయన నమ్మకం. ప్రయోగాత్మకంగా జేగురు మట్టి, సున్నం, బొగ్గు వంటి సామాన్య పదార్థాలతో కూడా అద్భుతమైన చిత్రాలు సృష్టించారు. తన జీవితాన్ని కళకే అంకితం చేసి, వేలాది చిత్రాలను సృష్టించి, తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయారు.

1992 డిసెంబర్ 30న ఆయన మరణం సంభవించినా ఆయన కుంచె సృష్టించిన రూపాలు, ఆయన వేసిన పుస్తక కవర్‌లు, ఆయన అలంకరించిన పత్రికా పుటలు నేటికీ జీవంగా ఉంటూ తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళకు కేవలం ఒక పేరు కాదు, ఒక యుగం. ఆయన కుంచెలో సౌందర్యం విరిసింది, ఆయన బొమ్మల్లో తెలుగుదనం మిగిలింది, ఆయన కృషిలో ఒకసంస్కృతికి చిరస్మృతి సొంతమైంది. తెలుగు చిత్రకళకు వడ్డాది పాపయ్య ఒక దీపస్తంభం. ఆయన కళలో శిల్ప సౌందర్యం, సాహిత్యానికి జీవం, పాఠకుల హృదయాల్లో అజరామరమైన స్థానం ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆత్మ హత్యల నివారణ సామాజిక బాధ్యత



*సెప్టెంబర్ 10... ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం*

***ప్రపంచంలో జరిగే మొత్తం ఆత్మహత్య లలో 20 శాతం మన దేశంలోనే జరుగుతున్నాయి. ప్రతి ఏటా సుమారు 2 లక్షల మంది మన దేశంలో ఆత్మహత్యలతో మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒకప్పుడు మన దేశంలో మధ్య వయస్కులు, వృద్ధులు ఆత్మహత్యలు చేసుకొంటే, ఇటీవలి కాలంలో యువత, విద్యార్థులు ఈ దారుణానికి పాల్పడుతున్నారు. కారణాల విషయానికి వస్తే, కుటుంబ సమస్యలు, భార్యా భర్తల మనస్పర్థలు, బలహీన పడుతున్న కుటుంబ బంధాలు మూడింట ఒక వంతు కారణమైతే, డిప్రెషన్, మద్యానికి బానిస కావడం, స్కిజోఫ్రీనియా, దూకుడు, ఆవేశ మనస్తత్వాలు, కేన్సర్ ఎయిడ్స్ లాంటి శారీరక, మాన సిక సమస్యలు కూడా ఆత్మహత్యలకు కారణ భూత మవుతున్నాయి. స్త్రీల కంటే పురుషులే -అధికంగా (4:1) ఆత్మ హత్యలతో మరణిస్తుంటే, ఆత్మహత్యా ప్రయత్నాలు చేయడంలో మాత్రం స్త్రీలదే పైచేయిగా ఉంది.***


హిందూ ధర్మ శాస్త్రాలు ఆత్మ హత్యను మహాపాతకంగా వర్ణిస్తాయి. ఓ కష్టం, ఓ నష్టం, ఆవేదన, ఆవేశం, ఆక్రోశం.. ఏదో ఒక కారణం. అనిశ్చితి, అభద్రత...ఏదోఒక ఆందోళన ఒత్తిడిని పెంచితే చటుక్కున ఒక్క క్షణంలో విలువైన ప్రాణాలను పణంగా పెట్టేస్తున్న అవివేకి మనిషే. వివేచన, విచక్షణ శక్తి ఉన్న ఏకైక జీవి మనిషి. అయినా బలవంతంగా నిండు ప్రాణాన్ని తనకు తానుగా బలిపెట్టు కుంటున్నదీ మానవుడే. ప్రేమ అనుబంధాల వైఫల్యం, ఆత్మీయులను కోల్పోవడం, కుటుంబ కలహాలు, అవాంఛిత గర్భం, వరకట్న వేధింపులు, నయంకాని జబ్బులు, అనారోగ్యం, తీర్చలేని అప్పులు, ఆస్తి నష్టం, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, ఉన్నవారికి లేనివారికి మధ్య పెరుగుతున్న అంతరాలు, ఆర్థిక ఇబ్బందులు,రాజకీయ అస్థిరత, మతపర మైన విద్వేషాలు, సైద్ధాంతిక కారణాలు, హీరోలపై మితిమీరిన అభిమానం, ఉద్యోగాన్ని, గౌరవాన్ని, సామాజిక హోదాను కోల్పోవడం, నిరుద్యోగం, అనువంశిక, జన్యు లోపాలు కుటుంబంలో ఎవరి అండదండలు లేకపోవడం, వారిని సరిగ్గా పట్టించు కోలేక పోవడం, మోస పోవడం, మతి స్తిమితం సరిగ్గా లేకపోవటం, మద్యానికి బానిస కావడం, భార్య భర్తల మధ్య గొడవలు, ఒకరినొకరు అర్థం చేసుకోక పోవడం, ఉద్యోగం తొలి ప్రయత్నంలోనే రాలేదని, ప్రేమలో విఫల మయ్యామని, పరీక్షల్లో తప్పామని, అనుకున్న ర్యాంకు రాలేదని, వ్యాపారంలో నష్ట పోయామని , తనను దూషించారని, ఇతరులకు వచ్చిన ఉద్యోగోన్నతి తనకు రాలేదని, చేయని తప్పునకు తనపై ఆపద మోపారని, సాగు చేసిన పంటలో తనకు నష్టం వచ్చిందని... ఇలా చిన్న చిన్న కారణాలతోనే ఆత్మ హత్యలకు పాల్పడుతున్న ఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. మహిళల కన్నా పురుషులే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ముఖ్యంగా వివాహితుల్లో భార్యల కన్నా భర్తలే రెట్టింపు సంఖ్యలో బలవన్మరణాలకు సిద్ధ పడుతున్నారని తేలింది.వీరిలో నడివయసు వారే (30-44 ఏళ్లు) ఎక్కువ. పురుగు మందును తాగడం (37 శాతం), ఉరి వేసుకోవడం (26 శాతం), ఒంటికి నిప్పంటించుకోవడం (11 శాతం), నీళ్లలో మునిగిపోవడం (9 శాతం), తుపాకీతో కాల్చుకోవడం (1 శాతం) ఎత్తైన చోట్లనుండి దూకటం ద్వారా బలవన్మరణాలు అధికం అవుతున్నాయి. కాలంతో పాటు మారుతున్న జీవనశైలి ప్రభావాన్నీ కాదనలేం. పూర్వం ప్రేమ, ఆప్యాయత, అనురాగం అనే బంధాలు మనుషుల మధ్య ఎక్కువగా ఉండేవి. కానీ ప్రస్తుత ఒత్తిడి జీవితాల్లో అనేక మంది వాటికి దూర మవుతున్నారు. ఎక్కడ చూసినా చిన్న చిన్న కుటుంబాలే దర్శన మిస్తున్నాయి. హిందూ శాస్త్రాల దృష్టిలో ఆత్మహత్య మహా పాతకం.

ఒకడు ఇనుప కమ్మీతో ఆత్మహత్య చేసుకుంటే అదే ఇనుప కమ్మీతో నరకాగ్నిలో శిక్షించ బడతాడని చెపుతారు. ఒక వ్యక్తి గాయపడి, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటే... "నా దాసుడు తొందరపడి తనను తాను చంపు కున్నాడు, ఇతనికి పరలోక ప్రవేశం ఉండదు" అంటాడు అల్లాహ్ (బుఖారీ 2:445).

"ఊపిరాడకుండా చేసుకొని చనిపోయిన వాడు నరకంలో కూడా ఊపిరాడని శిక్షలోనే ఉంటాడు. కత్తితో పొడుచుకొని చనిపోయిన వాడు నరకాగ్నిలో సదా తనను తాను పొడుచు కుంటూనే ఉంటాడు. (బుఖారీ 2:446). ఒకడు ఏ వస్తువుతో ఆత్మహత్య చేసుకుంటాడో పునరుత్థాన దినాన అదే వస్తువుతో హింసించ బడతాడు. (బుఖారీ 8:73). క్రైస్తవం దృష్టిలో ఆత్మహత్య తప్పు. పౌలు ఈ లోకంనుంచి వెళ్ళిపోవలను కుంటాడు (ఫిలిప్పీ1:20). అంత్య దినాల్లో ప్రజలు చనిపోవాలని కోరుకుంటారు గాని వాళ్లకు చావు దొరకదు. మరణం వాళ్ళ దగ్గర నుండి పారిపోతుంది. (ప్రకటన 9:10). ఎక్కువ మంది క్షణికావేశంలోనే ఆత్మహత్యలు చేసుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం, ఏటా 8 లక్షల మంది ఆత్మ హత్యలు చేసు కుంటున్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారి మరణాలకు రోడ్డు ప్రమాదాల తర్వాత రెండో ప్రధాన కారణం ఆత్మహత్యలే. భారత దేశంలో గంటకు 14 ఆత్మహత్యలు జరుగుతున్నట్లు నేషనల్ క్రైమ్స్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. అన్ని వయసుల వారూ ఆత్మ హత్యలు చేసుకుంటున్నా, ప్రపంచ వ్యాప్తంగా పురుషుల్లో ఆత్మ హత్యల రేటు ఎక్కువగా ఉంది. ఆత్మహత్యలకు, మానసిక రుగ్మతలకు మధ్య సంబంధం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రజల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటోంది. ఘర్షణలు, విపత్తులు, హింస, ఒంటరి తనం లాంటివి ఆత్మ హత్యలకు ప్రేరేపిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ముఖ్యంగా జీవితం పట్ల నిరాశ, విరక్తి, మద్యపానం లాంటివి బలవన్మరణాలకు ఎక్కువగా దారి తీస్తున్నాయి. 2011లో జరిపిన అధ్యయనం ప్రకారం ఏటా ఒక మిలియన్ మంది బల వంతపు మరణాలకు పాల్పడు తున్నారు. 2020 నాటికి ఈ సంఖ్య 1.50 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రతి 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు దాపురించడంపై ఆందోళన వెలి బుచ్చింది. 2016 గణాంకాల ప్రకారం, పురుషుల్లో ఆత్మహత్య రేటు లక్ష మందికి 13.5 కాగా, మహిళల్లో లక్షకు 7.7గా ఉంది. ఒక వ్యక్తి బలన్మరణానికి పాల్పడితే, దానివల్ల 135 మంది దాకా ప్రభావితం అవుతారని, గతేడాది అమెరికాలో జరిగిన ఒక అధ్యయనంలో తేలింది. ఆత్మ హత్యలు, బాధితుల కుటుంబ సభ్యులతో పాటు, వారి సన్నిహితులపై మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతాయని కెంటకీ విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ జూలీ సెరెల్ పేర్కొన్నారు.

సార్క్‌దేశాలైన భారత్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల్లో ప్రతీ లక్ష మందిలో 8 నుండి 50 మంది దాకా ఆత్మ హత్యలకు పాల్పడు తున్నారని తేలింది. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం 45వ స్థానంలో ఉండగా, శ్రీలంక 12వ స్థానంలో ఉంది. 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మ హత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలు కొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించ బడింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని దాదాపు 40 దేశాలు అధికారికంగా చేపడు తున్నాయి. ఆత్మ హత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆత్మహత్య అనేకంటే ఇచ్ఛా మరణం అనటమే సరైనది. అది బలవన్మరణం కాదు. ఇచ్ఛా మరణం పొందిన వారిలో... భీష్మాచార్యుడు అంపశయ్యపై తనువు చాలించాడు. స్వామి వివేకానంద కపాల మోక్షం పొందారు. పోతులూరి వీర బ్రహ్మం సజీవ సమాధి అయ్యారు.

కానూ సన్యాల్ ఉరి వేసుకుని చని పోయారు. ఐ.పి.సి.309 సెక్షన్ ప్రకారం ఆత్మహత్యా ప్రయత్నం చేసి బ్రతికిన వారిపై కేసులు పెడతారు. ఇప్పుడు ఆ సెక్షన్ రద్దుకోసం భారత లా కమిషన్ సిఫారసు చేసింది. ఆత్మహత్యా యత్నం నేరం కాదు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది. 'తీవ్రమైన నిరాశ నిస్పృహలతోనే ఆత్మహత్య చేసుకోవాలని ఎవరైనా భావిస్తారు. వారికి కావలసింది సహాయం కానీ శిక్ష కాదు' అని స్పష్టం చేసింది. ఆత్మ హత్యకు ప్రయత్నించటాన్ని నేరంగా పరిగణిస్తున్న ఐపీసీ 309 సెక్షన్‌ను తొలగించాలని పార్లమెంటుకు సిఫార్సు చేయడం కూడా జరిగింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అందుబాటులోకి రానున్న మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ వాహనాలు

- నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణకు ఒప్పందం
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మరో ముందడుగు వేసింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సను ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ల ప్రారంభం ద్వారా క్యాన్సర్ వ్యాధిపై పోరాటానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి వైద్య ఆరోగ్య కళాశాల నుండి వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... క్యాన్సర్ అనేది ప్రమాదకరమైన వ్యాధి అని ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో వ్యాధి నిర్ధారణకు ఆలస్యం జరగడం చికిత్స అందించడంలో జాప్యం కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి సంఘటనలు ఇకమీదట జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో క్యాన్సర్ ఎలిమిషన్ ప్రోగ్రాం చేపట్టిందన్నారు.




ఈ కార్యక్రమానికి అడ్వైజర్‌గా రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నూరి దత్తాత్రేయులను నియమించిందని అన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం క్యాన్సర్ వ్యాధి నియంత్రణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్న నమ్మకాన్ని మంత్రి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన క్యాన్సర్ డే కేర్ సెంటర్ల లో రోగులకు సమయానుకూలమైన స్క్రీనింగ్ పరీక్షలు రేడియేషన్ పాజిటివ్ కేర్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి అన్నారు. ఉదయం డే కేర్ సెంటర్కు వచ్చిన రోగి సాయంత్రానికి ఇంటికి చేరుకునేలా అన్ని రకాల క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్సలు డే కేర్ సెంటర్లలో అందుబాటులోకి వస్తాయన్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

**అన్ని జిల్లాలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్**

టెస్ట్ వాహనాలను సైతం అందుబాటులోకి తెనున్నట్లు మంత్రి తెలిపారు. మొబైల్ స్క్రీనింగ్ వాహనాలతో వైద్య నిపుణులు గ్రామాలలోకి వెళ్లి ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి మెరుగైన చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు.

**నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణకు ఒప్పందం**

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏటా 3,000 మంది నర్సింగ్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 బిఎస్సి నర్సింగ్ కళాశాలలో 183 జీఎన్ఎం నర్సింగ్ కళాశాలలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్చోంగ్తా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ అఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర కుమార్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ ఆఫ్ ఎం.ఎన్.జే కాన్సర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసులు , జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీ జీ ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వైద్య కళాశాల అధ్యాపకులు,జి జి హెచ్ సూపరింటెండెంట్,వైద్యులు ,నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల రాస్తారోకో..



**తూప్రాన్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** వ్యవసాయ పంట పొలాలు చదును చేసి వరి నాటేసిన తర్వాత అధిక దిగుబడి కోసం కావలసిన రసాయన ఎరువులు సకాలంలో సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతో గత మూడు రోజులుగా యూరియా కోసం రైతుల రోడ్డెక్కి రాస్తా రోకో నిర్వహించారు. మంగళవారం ఉదయం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. సకాలంలో యూరియా సరఫరా కాకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. దీనితో విసిగి వేసారిన రైతన్నలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. యూరియా ఇచ్చే వరకు రోడ్డు పై నుండి లేవమని మొండికేసుకొని కూర్చున్నారు. కిలోమీటర్ల దూరం రోడ్డు కు ఇరువైపుల వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులకు ఇబ్బంది కల్గింది. విషయం తెలుసుకున్న తూప్రాన్ ఎస్.ఐ 2 యాదగిరి తన పోలీస్ సిబ్బంది తో సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన కారులకు సర్ది చెప్పి, శాంతింప చేశారు. యూరియా కోసం వ్యవసాయ అధికారి కి, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం మార్గం సుగమం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తూప్రాన్ మండల రైతులు పాల్గొన్నారు.

# ఎంఈఓ ఆఫీసులో చోరీ..

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- చోరీ స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ వేణు కుమార్



**పెద్దేముల్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ల్యాప్‌టాప్‌ను తస్కరించారు. మంగళవారం ఆధార్ సెంటర్ నిర్వాహకులు శ్రీశైలం, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండల జనగాం గ్రామానికి చెందిన శ్రీశైలం గత కొన్ని రోజులుగా ఆధార్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. విద్యార్థులకు, ఇతరత్రా పలువురికి అవసరమయ్యే పేదవారికి ఆధార్ సేవలు అందిస్తున్నాడు. అయితే సోమవారం విద్యావనరుల కేంద్రంలో ఆధార్ సేవలు అందించారు. అనంతరం పనులు ముగిశాక ల్యాప్‌టాప్‌ను కార్యాలయంలోనే భద్రపరిచి ఇంటికి వెళ్ళాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా అక్కడ ల్యాప్‌టాప్ కనిపించలేదు. దీంతో కార్యాలయంలో మొత్తం వెతికాడు. ల్యాప్ టాప్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యావనరుల కేంద్రం ముందుభాగం కిటికీ లోంచి లాప్ టాప్ తస్కరించారు. తెలిసిన వ్యక్తులే ల్యాప్‌టాప్‌ను దొంగిలించినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం, జూనియర్ కళాశాల బ్యాక్ సైడ్, జిరాక్స్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ చోరీకి పాల్పడటం గమనార్హం.

# వికారాబాద్ జిల్లాకు 175 మెట్రిక్ టన్నుల యూరియా

- జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా వానకలం 2025-26లో మొత్తం సాగు భూమి 5,46,363 ఎకరాలుగా నమోదు అయ్యింది. గత వానకలం 2024-25లో 5,51,559 ఎకరాల సాగుకు 24,440.422 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగిదనిజిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం వివరించారుఈ ఏడాది వానకలం 2025-26కు గాను 26,000 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరగగా, 2025 ఏప్రిల్ 1 నాటికి 4,487 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభ నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.2025 ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 8 వరకు జిల్లాకు 16,703.92 మెట్రిక్ టన్నుల యూరియా అందగా, ఇప్పటివరకు 21,190.92 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వివరించారు.ప్రస్తుతం మార్కెట్లో యూరియా నిల్వలు సొసైటీల్లో 78.36 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ ఔట్‌లెట్లలో 79.606 మెట్రిక్ టన్నులుగా లభ్యమవుతున్నాయి. అదనంగా జిల్లాలో 6,200 లీటర్ల నానో యూరియా కూడా అందుబాటులో ఉందన్నారు.సెప్టెంబర్ నెలలో పద్దిపంటలకు టాప్ డ్రెసింగ్, పత్తి పంటలకు రెండవ మోతాదుగా 11,200 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం ఉంటుందని అంచనా వేశామని అన్నారు.యూరియా నిల్వలను ప్రతిరోజు ఎం ఏవో ల ఇన్‌డెంట్ల ఆధారంగా సొసైటీలకు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రైతులు నానో యూరియా వాడేలా ఫీల్డ్ సిబ్బందిని అవగాహన కల్పించమని ఆదేశించామని. జిల్లా పరిధి దాటి యూరియా తరలింపును నిరోధించేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, డీలర్ ఔట్‌లెట్లలో ఏ ఈ ఓ లను నియమించి యూరియా పంపిణీ పర్యవేక్షణ చేయాలని, యూరియా అమ్మకాల సమయంలో ఇతర ఉత్పత్తులను కట్టబెట్టరాదని, ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలనే ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం వెల్లడించారు. వికారాబాద్ జిల్లాకు 175 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు తెలియజేశారు వానకాలం%-%2025లో రైతుల అవసరాల కోసం వికారాబాద్ జిల్లాకు మొత్తం 175 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రాజ రత్నం తెలిపారు.జిల్లాలోని బంట్వారం, కో ట్ పల్లి, బషీరాబాద్ బోమ్రాస్పేట్, చౌడాపూర్, దోమ, దౌల్తాబాద్, కోడంగల్, మర్పల్లి, పరిగి, పూడూర్, తాండూర్, వికారాబాద్, యాలాల్, మొమిన్ పెట్ మండలాల్లోని 18 అవుట్‌లెట్లకు ఈ సరఫరా జరగనుంది.రైతులకు ఎరువుల కొరత రాకుండా చెల్లింపుల ప్రక్రియ పూర్తయిన వెంటనే యూరియా పంపిణీ చేపడతామని ఆయన తెలిపారు.

# లింగంపల్లి గురుకుల పాఠశాలను పరిశీలించిన మంత్రి



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల హాస్టల్ గోడ కూలి ఇప్పుడు విద్యార్థులకు గాయాలైన సంఘటన స్థలాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. జరిగిన ఘటన పై అధికారులతో మంత్రి చర్చించారు. హాస్టల్‌లోని మిగిలిన భవనాల స్టాండర్డ్స్ ను పరిశీలించి ఉపయోగానికి పనికిరాని వాటిని బ్లాక్ చేసి నివేదిక సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. హాస్టల్ గోడ కూలి స్వల్పంగా గాయపడిన ముగ్గురు (3) విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ని హాస్టల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల విద్యార్థుల క్లాస్ లు యధావిధిగా కొనసాగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివసాగర్



**జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ సాగర్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వ తీరుకు నిరసనగా, స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ డిగ్రీ కళాశాల మెయిన్ గేట్ ఎదురుగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివ సాగర్ మాట్లాడుతూ గత కొన్ని నీళ్లు గా ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను ప్రభుత్వం సమయానికి విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న బకాయిలు మొత్తం 86 వేల కోట్లకు పైగా చేరిందన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యలో చేరుతున్నారని, వారి ఆశలు మాత్రం ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ లపై ఆధారపడి ఉంటాయని, కానీ ప్రభుత్వం అందించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపోయింది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్టి కన్వీనర్ సాయినాథ్, నగర కార్యదర్శి శివప్రసాద్, ఎం వి ఎస్ జోనల్ ఇన్చార్జ్ నవీన్, నరేష్ జ్యోతి ప్రణవి చరణ్ భాను శివకుమార్ కళాశాల నూతన కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు

- పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు..
- ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- రంగారెడ్డి జిల్లా ఉద్యాన అధికారి సురేష్ బాబు

**తలకొండపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని రంగారెడ్డి జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్ బాబు అన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు ఆయిల్ ఫామ్ పంట సాగు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి సురేష్ బాబు మాట్లాడుతూ..ఆయిల్ ఫామ్ పంటను మిగతా పంటలతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు.ఈ పంటకు చీడపీడ పురుగుల బెడద తక్కువగా ఉంటుందన్నారు.ఆయిల్ ఫామ్ పంటకు ఎరువులు కూడా తక్కువగా వాడుకోవచ్చని సూచించారు.మండలంలో దాదాపు 332 ఎకరాల ఆయిల్ ఫామ్ పంట సాగు అయిందని తెలిపారు.ఇంకా ఆసక్తి ఉన్న రైతులు వెంటనే అధికారులను,కంపెనీ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.మండలంలో ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులకు పరస్పర అంగీకార పత్రలను రైతులకు అందించారు.ఆయిల్ ఫామ్ పంట సాగు చేసే రైతులకు 90 శాతం డ్రిప్ సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.ఆయిల్ ఫామ్ పంటకు కావల్సిన ఎరువులకు ఒక ఎకరానికి రూ,4 వేల 200 లు చొప్పున 4 సంవత్సరాలకు 16, వేల 800 లు ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని పేర్కొన్నారు.ఎకరాకు 8 నుంచి 10 టన్నుల పైనే గెలల దిగుబడి వస్తుందని తెలిపారు.ప్రస్తుతం టన్ను పామాయిల్ గెలల మద్దతు ధర రూ,19,107 వుంటుందని చెప్పారు.మన జిల్లాకు కేటాయించిన ఆయిల్ వాల్యూ కంపెనీ వారు పొలం దగ్గరికి వచ్చి పంట కొనుగోలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో



జిల్లా ఉద్యాన ఏడి.హెచ్.కిషన్,షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు,ఆయిల్ వాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్ మోహన్ రావు,ఆయిల్ వాల్యూ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్ కుమార్,హెచ్ఈఓ సీతరామ్,ఆయిల్ వాల్యూ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ కొండల్ రెడ్డి,కంపెనీ వ్యాల్యూ తలకొండపల్లి మండల ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మీకాంత్,వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పూడూరు రైతుల పోరుబాట..

- ఆ రోడ్డు వారి పాలిట శాపం
- రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ వ్యతిరేకిస్తున్నా రైతులు
- వికారాబాద్ కలెక్టరే ట్ ముందు రైతుల ధర్నా
- అప్పుడు నేవీ ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డుతో సర్వం కోల్పోతున్నాం..
- పాత అలైన్మెంట్ ప్రకారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి
- నవాబుల భూముల రక్షణ కోసం అలైన్మెంట్లో మార్పు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** నలుగురికి అన్నం పెట్టే రైతులు అడ్డా కూలీలుగా మారే రో జో హొచ్చేస్తుంది. సారవంతమైన భూములన్ని నేవీ త్రిబుల్ ఆర్ రోడ్ లో కోల్పోవాల్సి వస్తుంది. ఊరే కనుమరుగయ్యే రోజు దగ్గరలో ఉంది. తమ బతుకులు అధోగతి పాలవుతాయని అంటూ త్రిబుల్ ఆర్ రోడ్ అలైన్మెంట్ మార్చాలని రైతులు పోరుబాట పట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా పూడూరు మండల రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన త్రిబుల్ ఆర్ రోడ్ తమ సారవంతమైన పొలాల నుంచి వెళుతుందని ఫలితంగా తాము భూముల కోల్పోవలసి వస్తుందని భూసేకరణ పనులు తక్షణమే నిలిపివేయాలని ఆందోళనకు దిగారు. నేవి రాడార్ వల్ల ఇప్పటికే తమ గ్రామ రైతులు దాదాపు 3000 ఎకరాలు కోల్పోయారని ప్రస్తుతం త్రిబుల్ ఆర్ రోడ్ కోసం అలైన్మెంట్ వల్ల 60 సర్వే నంబర్లలో రైతులు భూములు కోల్పోతున్నట్లు తెలియజేశారు. దాదాపు తమ గ్రామంలో 500 పట్టా భూములు ఉన్నాయని వాటిని పూర్తిగా కోల్పోవలసిన పరిస్థితి నెలకొందని అన్నారు. హైదరాబాద్ చుట్టూ జనాభా అధికంగా ఉందని జనాభాకు అనుగుణంగా రీజనల్ రింగ్ రోడ్లు వేస్తే నష్టం లేదని ఆదాయం సమకూర్తుందని ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేని పల్లెల్లో రీజినల్ రింగ్ రోడ్ల నిర్మాణం చేస్తే రైతులు భూములు కోల్పోయి రోడ్డున పడవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపన చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే కాకుండా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పథకాలను చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని రైతులకు నష్టం కలిగించే ఏ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు అండగా ఉండాలని పారిశ్రామిక వేతల పక్షాన నిలువ వద్దని కోరారు. కేవలం నవాబుల భూములను రక్షించడానికి రీజనల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ మారిందని రైతులు ఆరోపించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టైనా సారవంతమైన భూములను రక్షించుకుంటామని అన్నారు. తమ గ్రామంలో పెద్ద భూస్వాములు లేరని సన్న చిన్న కారు రైతులే ఉన్నారని వారి పొలాలన్నీ అభివృద్ధి పేరుతో రోడ్ల కోసం నేవీ కోసం రైళ్ల కోసం గుంచుకుంటే తాము ఎట్లా బతకాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం నిలిపివేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కు రైతులు వినతి పత్రం అందజేశారు.

# తూములు తెరవండని వినతి

- వరద నీరుతో నీట మునిగిన పంట పొలాలు
- తూములు మూసేసిన మారేపల్లి తండావాసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మారేపల్లి గ్రామ రైతులు



**పెద్దేముల్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** మూసిన తూములు తెరిపించండి మహాప్రభో అంటూ రైతులు వేడుకున్నారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ వెంకటేష్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా.. వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు 116/65, 116/137, 116/151, 116/152, 116/120 సర్వే నంబర్లలో సుమారుగా 15 నుంచి 20 ఎకరాల్లో వివిధ రకాల పంట పొలాలను సాగు చేస్తున్నారు. అయితే మండల పరిధిలోని మారేపల్లి తండా సమీపంలో గల బషీర్ కుంటలోకి వరదనీరు వెళ్తుంది. కానీ, గత నాలుగేళ్లుగా మారేపల్లి తండాకు చెందిన పలువురు రైతులు బషీర్ కుంట తూములు మూసేశారు. దీంతో వరద నీరు ముందుకు వెల్లకపోవడంతో మారేపల్లి గ్రామానికి చెందిన పలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూములు మూయడం ద్వారా వరద నీరు ముందుకు వెళ్లలేక తూము పరిసర ప్రాంతాల్లో గల పంట పొలాలకు వరద నీరు వచ్చి చేరుతుంది. తద్వారా తాము తీవ్రంగా నష్టపోతున్నామని మారేపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తూములు తెరిచి వరద నీరు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 సెప్టెంబర్ 2025

# గురుకుల విద్యార్థులకు తప్పిన ప్రమాదం

- పాత డార్మెటరీ బ్లాకుకూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- లింగంపల్లి గురుకుల పాఠశాలలో ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. గురుకుల పాఠశాల పాత డార్మెటరీ బ్లాకుకూలిన ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కావడంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హుటాహుటిన లింగంపల్లి పాఠశాలకు చేరుకొని ఎస్ డి ఆర్ హెచ్ బృందం సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మునిపల్లి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ యొక్క పాత డార్మిటరీ బ్లాక్, మంగళవారం మధ్యాహ్నం కూలిన ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎస్ డి ఆర్ హెచ్ బృందం చేపట్టినట్టు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఇంటర్ వరకు సుమారు 601 మంది విద్యార్థులు చదువుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండడంతో, పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళుతున్న ముగ్గురు విద్యార్థులు ఈ ఘటనలో స్వల్పంగా గాయాలయ్యాయని, వారికీ జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఎస్డిఆర్ఎఫ్ బృందం కూలిన మట్టి తొలగింపు మట్టి శిఖరాల కింద ఉన్న విద్యార్థుల ట్రంకు బాక్సులు వ్యక్తిగత సామాగ్రిని సురక్షితంగా బయటకు తీస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రమాదకరమైన శిథిలావస్థకు చేరిన భవనాల వద్దకు వెళ్లకుండా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులకు తాత్కాలికంగా వసతికి ఇలాంటి ఇబ్బందులు లేవని అందుబాటులో ఉన్న తరగతి గదులు మరియు హాస్టల్ గదుల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ శాఖ (ఈ ఈ డబ్ల్యు ఐ డి సి) అధికారులు సంఘటనా స్థలంలో పాడైన భవనాలను కూల్చివేయడం , వినియోగించటానికి వీలుగా వుండే గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాత్రి సమయంలో పనులు కొనసాగేందుకు తాత్కాలికంగా లైటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ .7 కోట్లతో ప్రభుత్వానికి ఆమోదం కోసం ప్రతి పనులకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల అంకితభావంతో పనిచేయాలి

- డీఈవో రమేష్ కుమార్



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ఉపాధ్యాయులు తమ విధులపట్ల అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించి ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. తాడూర్ మండలంలోని ఇంద్రకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం డిఇఓ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పాఠశాల పరిసరాలను తరగతి గదులను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం వంట సామగ్రి, వంట గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుని వ్యక్తిగ త పరిశుభ్రత పాటించి బాగా చదువుకోవాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

## యువత దేశానికే వెన్నెముక

- ప్రధానోపాధ్యాయురాలు రాజమణి




**చేర్యాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** యువత దేశానికి వెన్నెముక అని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజమణి అన్నారు. చేర్యాల మండలం కడవేర్గు ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి సందర్భంగా కాళోజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత కాళోజీ మార్గాన్ని అనుసరించి నిజాయితీగా ఉండాలని, మంచిఅలవాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమారాణి కష్టపడి ఎదగాలని విద్యార్థులను కోరారు. గ్రామంలోని విద్యార్థులు యువతనే ఆదర్శంగా తీసుకుంటారు కాబట్టి వారు మార్గదర్శకులుగా ఉండాలని, మన యాసను గౌరవించి కాపాడుకోవాలని తెలుగు ఉపాధ్యాయులు కాంతికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు ఉపాధ్యాయులను పూలమాలలతో, చేనేతవస్త్రాలతో సన్మానించారు. సీనియర్ ఉపాధ్యాయులు రమేశ్, చంద్రశేఖర్ రావు, కృష్ణమూర్తి, లింగాచారి, రామక్రిష్ణ, సజిదా రవీందర్, ప్రశాంత్,వేణుగోపాల్,బుచ్చయ్య, అజయ్ లు మాట్లాడుతూ.. గురువులను గౌరవించడం గొప్ప సంప్రదాయం అని దీనిని కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ రాజు,వినయ్, రమేశ్, హరీష్, కిషన్, వినీత్ బాబు పాల్గొన్నారు. తదనంతరం కలెక్టర్ పిలుపు మేరకు పాఠశాలలో మొక్కలను నాటారు.

## విద్యార్థులకు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** విద్యార్థుల పట్ల ఆప్యాయత, అనురాగాలతో వ్యవహరించి స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో విద్యనందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం వనపర్తి మండలం చిట్యాల గ్రామ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు విద్యార్థులతో ముచ్చటించారు. చిన్న చిన్న సమస్యలు మాత్రమే ఉన్నాయని వాటిని పరిష్కరించడంతో పాటు విహారయాత్రలకు తీసుకువెళ్ళడం, తరచుగా క్రీడలు ఆడించడం వంటివి చేయాలని విద్యార్థులు కోరారు.స్పందించిన కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని విద్యార్థులకు భరోసా కల్పించారు.పాఠశాలలో విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులో వేయాలని సూచించారు.అనంతరం గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు ప్రేమ అభిమానం చూపించాలని ఆదేశించారు. క్రీడల్లో రాణించే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టిపెట్టి వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రావడానికి సహకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, ఎమ్మార్వో రమేష్ రెడ్డి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**తూప్రాన్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి తెలిపారు మనోహరాబాద్ మండలంలోని దండుపల్లెలో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రేఖల కృష్ణ గౌడ్ నాని గౌడ్ నర్సింగ్ రావు బిక్షపతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోంది

- ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించక విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటుందని ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ అన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం వనపర్తి శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో సుమారు 2000 మంది విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ, "గత నాలుగేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో 8300 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి కళాశాల ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. చదువు పూర్తి చేసిన తర్వాత కూడా సర్టిఫికెట్లు తీసుకోవడానికి విద్యార్థులు యాజమాన్యాల వేధింపులు ఎదుర్కొంటున్నారు. స్కాలర్షిప్ నిధులు రాలేదని విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోంది" అని అన్నారు. అలాగే ఆయన "విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ నిమ్మక నీరేరత్తినట్లుగా వ్యవహరిస్తోంది. తక్షణమే స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుంది" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, కార్యదర్శి కార్తీక్, బంటి, నితిన్, మనోహర్, కుమార్, నరసింహ, నందు, అనిల్, సంతోష్, మైముద్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై తమ సమస్యలను గళం విప్పి తెలియజేశారు.

## కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి కాళోజి తెలుగు సాహిత్యాన్ని కొత్త దిశగా మలిచారని, కాళోజి రచనలు ప్రజలకు చైతన్యం నింపాయని మునిపల్లి మండలంలోని తాటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజాకవి తెలంగాణ తొలి పొద్దు శ్రీ కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి కాళోజి చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ, సాహిత్యం, సామాజిక న్యాయం కోసం కాళోజి చూపిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం లో కలంతో పోరాడి తన అక్షరాలను ఆయుధంగా మలిచి నిరంకుశ పాలనను ఎదిరించిన మహాకవి అని కొనియాడారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉపన్యాసాలు, నృత్యాలు, పాటలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కడవేర్గు గ్రామంలో సంపర్క్ అభియాన్ యోజన కార్యక్రమం



**చేర్యాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** సంపర్క్ అభియాన్ యోజన ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడవేర్గు గ్రామంలో బీజేపీ శ్రేణులు చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి రాబోయే స్థానిక ఎన్నికల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జనగామ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాయ ఎల్లయ్య పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ పథకాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా కృషి చేయడం జరిగింది, అవినీతి లేని పాలన అందించిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వమే అని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు, మన్నె సత్యవర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, నాయకులు మడికొండ శ్రీనివాసరావు,గోపాల్ రెడ్డి, కుర్రారం బాల నర్సయ్య, అప్పాల బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఫంగ సిద్ధి లింగం, మండల ఉపాధ్యక్షులు బయ్యారపు యాదగిరి,మండల కార్యదర్శులు గంధాల సత్యనారాయణ, పోలోజు రవి చారి, పట్టణ కార్యదర్శి వెలగల వినయ్ కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు యాసరేణి లక్ష్మీపతి, బూత్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి , కాసుల మల్లేశం, జాలిగామ రమేష్, మారబోయిన మహేష్, కిరణ్, గుంటి రాములు, కేతోజి సాయి కుమార్ చారి, చిన్నమల్ల రాజు, ఖాతా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా చేయాలని రైతుల రాస్తారోకో



**చేర్యాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని రైతులందరూ యూరియా కోసం పడిగాపులు భరించలేక ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. వారికి అండగా రైతు సంఘం నాయకులు ధర్నాలో పాల్గొని రాజ్యం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ తన నిరసన తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు మంగళవారం రోడ్డెక్కారు. రాస్తారోకోతో సిద్ధిపేట - జనగామ రోడ్డు పై రవాణా స్తంభించింది. స్థానిక పోలీసులు సముదాయించే ప్రయత్నం చేయగా, మీరు వ్యవసాయం చేస్తే రైతు బాధ తెలుస్తుంది అంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన కొనసాగించారు. ఎన్ని రోజులు ఇలా తిరగాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా సరఫరా చేస్తారా చేయరా అంటూ ప్రశ్నించారు. టోకెన్లు ఇచ్చి రోజులు గడుస్తున్న యూరియా ఇవ్వడం లేదని, వచ్చినా సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఏడిఓ రాధిక మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కొరత ఉన్న మాట వాస్తవమే అయినా జిల్లాలో చేర్యాల మండలంలో యూరియా కొరత కొంతవరకు ఉన్న అధికారులతో సమన్వయపరచి అందుబాటులో ఉన్న యూరియాను సకాలంలో రైతులకు అందేలా చేస్తామని, వ్యవసాయ అధికారులు కూడా విశ్రాంతి లేకుండా రైతుల కోసమే పని చేస్తున్నారనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు. సంఘటన స్థలానికి చేర్యాల సిఐ ఎల్. శ్రీను, ఎస్సై వేముల నవీన్ చేరుకొని రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు.

# ప్రజాకవి కాళోజి రచనలు స్ఫూర్తిదాయకం..



**జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ప్రజా కవి కాళోజీ నారాయణ రావు రచనలు స్ఫూర్తిదాయకమని కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా మంగళవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని మండల పరిధిలోని కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. విద్యార్థులు కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కాళోజీ రచనలు, ప్రజాసేవ, తెలంగాణ సంస్కృతికి ఆయన చేసిన కృషి గురించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప సాహితీవేత్త, ఉద్యమ కవి కాళోజీ కీర్తి చిరస్మరణయమని, ఆయన భాషా సౌందర్యం, సామాజిక స్పృహ ప్రతి తరానికి మార్గదర్శకమన్నారు. తెలుగు పండితులు మల్లికార్జున్, కృష్ణలను ఘనంగా సత్కరించారు. మల్లికార్జున్ మాట్లాడుతూ కాళోజీ పద్యం అనేది కేవలం సాహిత్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుళ్లకు ప్రతిబింబం, తెలంగాణ భాషలోని మాధుర్యం, ఆత్మీయతను ఆయన తన సాహిత్యంలో అద్భుతంగా ప్రతిబింబించారని అన్నారు. తెలుగు భాషను కాపాడటం, ప్రోత్సహించడం అందరి బాధ్యత అని, విద్యార్థులు తమ తల్లిబాషలో రాయడం, చదవడం, మాట్లాడడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు షాహినాపర్వీన్, కృష్ణయ్య, అమరేందర్ రెడ్డి, స్లీవారెడ్డి, ఉమాదేవి, శశిధర్, కరుణాకర్, గోవర్ధన్, శ్రీనివాస్ శెట్టి, ఆంజనేయులు, అంజలి దేవి, తాహెర్, రవికుమార్, బాలచంద్రుడు, స్ఫూర్తి, అశోక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## 13న జాతీయ లోక్ అదాలత్

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్09 (జనంసాక్షి) :** ఈనెల 13 న, నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా,,జానకి షర్మిల తెలియ జేశారు.లోక్ అదాలత్ లోచిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు , సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవ చ్చన్నారు. ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టు లో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# ముక్కిపోతున్న 350 కోట్ల బియ్యం

### డీలర్ల వద్ద పురుగు పడుతున్న దొడ్డు బియ్యం

- మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 5315 క్వింటాళ్ల బియ్యం
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి?
- దొడ్డు బియ్యం తీసుకెళ్లాలని సివిల్ సప్లై కమిషనర్‌కు విన్నవించిన రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు





**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** గత ఆరు నెలల నుండి సంపన్న వర్గాలు ఏ బియ్యం తింటున్నారో, పేదలకు కూడా అదే సన్న బియ్యపు అన్నం తినాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ నేతృత్వంలో రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు గత ఆరు నెలలుగా తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. సన్నబియ్యం పంపిణీకి ముందు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రేషన్ షాపులలో మిగిలిన దొడ్డు బియ్యాన్ని రేషన్ షాపుల్లోనే భద్రపరచాలని నిల్వ చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి ముందు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. సన్నబియ్యం సరఫరా చేయాలనే ఆదేశాలు రావడంతో ఆ నెలలో పంపిణీ చేయగా మిగిలిన బ్యాక్ లాగ్ బియ్యాన్ని తర్వాత వచ్చే నెలకోటలో డీలర్‌కు బ్యాక్‌లాగ్ బియ్యాన్ని మినహాయించుకొని మిగతా బియ్యం పంపిణీ చేస్తారు .కానీ సన్నబియ్యం రావడంతో దొడ్డుబియ్యం పంపిణీ కథ అక్కడితో ముగిసిపోయింది. అలా మిగిలిన దొడ్డు బియ్యం నిల్వలు ఒక మంచిర్యాల జిల్లాలోని 5315 క్వింటాళ్లు నిల్వ ఉంటే 33 ముప్పై మూడు జిల్లాల్లో దాదాపుగా 175000 క్వింటాల బియ్యం ఉండే అవకాశాలున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా కొంతమంది డీలర్లు రేషన్ షాపుల్లో ఆ దొడ్డు బియ్యం ముక్కిపోతున్నాయని పేర్కొన్నారు. చిన్నపాటి అద్దె గదుల్లో నడుపుతున్న రేషన్ షాప్ లు ఆ దొడ్డు బియ్యం మూలంగా స్థల భావంతో ప్రతినెలా రేషన్ బియ్యం స్టాక్ వచ్చినప్పుడల్లా స్థలం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు పలుమార్లు సివిల్ సప్లై కమిషనర్ కు దొడ్డు బియ్యాన్ని లిఫ్ట్ చేయాలని పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆ బియ్యాన్ని తీసుకెళ్లి భద్రత పరచి వేలం వేస్తే 175000 క్వింటాల బియ్యం విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం క్వింటాల్ కు 3000 రూపాయల చొప్పున 500 కోట్ల రూపాయల అవుతుంది. బహిరంగ మార్కెట్లో వేలం వేసిన క్వింటాల్ కు 2 వేల చొప్పున విక్రయించిన రాష్ట్ర ప్రభుత్వానికి 350 కోట్ల ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. కొంతమంది రేషన్ డీలర్ల దగ్గర సుమారుగా 15 ,నుండి 20 క్వింటాళ్ల బియ్యం నిలువ ఉన్నాయి. ఆ బియ్యాన్ని మాత్రం పౌరసరఫరాల శాఖ తీసుకొని వెళ్లకపోవడంతో రేషన్ డీలర్ల షాపు వద్ద పురుగుపట్టి అక్కరకు రాకుండా అవుతున్నాయని రేషన్ డీలర్లు చెబుతున్నారు.

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వ్యాప్తంగా 423 రేషన్ షాపులలో 5315.03 వేల క్వింటాళ్ల బియ్యం దొడ్డు బియ్యం ఓ పక్కన వేయడం పౌరసరఫరాల శాఖ అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో పురుగులు పడుతున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . మంచిర్యాల మండలంలో 528 క్వింటాళ్ల బియ్యం, బెల్లంపల్లి మండలంలో 559 క్వింటాళ్ల బియ్యం, దండేపల్లి మండలంలో 430 క్వింటాళ్ల బియ్యం, చెన్నూర్ మండలంలో 406 క్వింటాళ్ల బియ్యం, మందమర్రి మండలంలో 763 క్వింటాళ్ల బియ్యం, మంచిర్యాల మండలంలో పలు షాపులలో 229 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని అధికారులు తెలిపారు . ఇంకా కొన్ని రోజుల ఆ బియ్యాన్ని ప్రభుత్వం లిఫ్ట్ చేయకపోతే ఆ దొడ్డు అక్కరకు వచ్చే అవకాశాలు లేవని డీలర్లు చర్చించుకుంటుంన్నారు . ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు దొడ్డు బియ్యం నిల్వలపై దృష్టిసారించి రేషన్ షాపులలో ఉన్న దొడ్డు బియ్యాన్ని గోదాములకు తరలించి వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు డబ్బులు జమ చేయాలని కోరుతున్నారు.

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**చిట్యాల సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి కి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గిద్దె ముత్తారం గ్రామంలో గిద్దె ముత్తారం నుండి కాల్వ పల్లి గ్రామాల మధ్యలో రూ 100 లక్షల తో స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో రంగాపురం గ్రామంలో రంగాపురం నుండి జూకల్ వరకు రూ 30 లక్షలు, ఇస్సి పేటనుండి చింతలపల్లి వయా పాత ఇస్సిపేట వరకు రూ100 లక్షలు, ఇస్సీ పేట నుండి వాగొడ్డుపల్లి వరకు రూ 120 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని గ్రామాల సమాగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో షేక్ ఇమామ్ బాబా,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్ ,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, ఓరం సమ్మయ్య, పులి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాత


- ఎరువులు లేకపోతే పంటలు పండవ్
- 3 రోజుల్లో యూరియా పంపిణీ చేస్తాం : వ్యవసాయ అధికారి రామకృష్ణ



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** నెల రోజులుగా రైతులు యూరియా ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు చిట్టీలు రాసి ఇవ్వడం, వారు కార్యాలయాల. చుట్టూ తిరుగుతూ.. వచ్చి వెళ్లిపోవడం సాధారణమైంది. కానీ మంగళవారం రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇక లాభం లేదని వారు నిర్ణయించుకొని రోడ్డెక్కారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట రోడ్డుపై రైతులు ఆందోళనకు దిగారు. వరి, పత్తి తదితర పంటలకు సకాలంలో యూరియా ఎరువులు వేయకపోతే .. దిగుబడులు రావని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు రేపు మాపు అంటూ తెప్పించుకుంటున్నారని.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు లారీల ద్వారా యూరియా బస్తాలు వచ్చినప్పటికీ అధికారులు కొంతమంది దళాలతో కలిసి యూరే బస్తాలను బ్లాక్లో అమ్ముకుంటూ.. అసలైన రైతులకు పంపిణీ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల నుండి ఆందోళన చేశారు. రైతులు రోడ్డుపై పెద్ద ఎత్తున బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న కాగజ్నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులను శాంతింప చేసేందుకు ప్రయత్నించినప్పటికీ వారు ఆందోళన విరమించలేదు. దీంతో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి 3 రోజుల్లో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నియోజకవర్గంలోని ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పరకాల ఇందిరా మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఈసి సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని వేల మంది భవిష్యత్ డైరీ నిర్వహకులైన మీపై ఆధారపడి ఉందని, మీరు పరకాల ఇందిరా మహిళా పాల ఉత్పత్తి దారుల సంఘానికి బాధ్యులు అన్నారు. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషిచేస్తున్నారనితెలిపారు.21 మంది సభ్యుల పనితీరుపై భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.పాల సేకరణ నుండి పాల అమ్మకం వరకు మహిళలతో నడుస్తుంది అన్నారు. ముల్కనూరు మహిళా డైరీ స్ఫూర్తితో ముందుకెళ్దామని,15వ తేదీన గీసుకొండ మండల కేంద్రంలో సంగెం, గీసుగోండ,15,16,17వ డివిజన్ లు,16వ తేదీన పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నడి కూడ, పరకాల, ఆత్మకూరు,దామెర మండలాల ప్రాథమిక మహిళా సహకార సభ్యులకు మహిళా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. పశు పోషణపై ప్రత్యేక దృష్టి సాధించాలని, పశువుల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణాలు ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామన్నారు.ప్రతి పాల ఉత్పత్తి రైతును ఆదుకోవడం కోసం బ్యాంకు తో లింకేజీ చేస్తామన్నారు.మహిళల అభివృద్ధి,పాల ఉత్పత్తిదారుల బలోపేతం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.మహిళలు శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకుని సమాఖ్యను మరింత విజయవంతంగా నడిపించాలని సూచించారు. పాల ఉత్పత్తిదారుల కోసం అవసరమైన సహాయం,పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు.గ్రామీణ స్థాయిలో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగడానికి సహకార సంఘాలు ఒక గొప్ప వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డి ఏ అధికారులు, డి సి ఓ, ఏపీఎం లు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతర రెండో పంటకు నష్ట పరిహారం ఇవ్వాలి

- మంత్రి సీతక్కను కలిసిన రైతులు
- సానుకూలంగా స్పందించి రైతులకు నష్ట పరిహారం కోసం కలెక్టర్ ను ఆదేశించిన మంత్రి సీతక్క
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** తాడ్వాయి మండలం మేడారం ఐటీడీ ఏ గెస్ట్ హౌస్ లో రైతు సహకార సొసైటీ చైర్మన్ పులి సంపత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు అనంత రెడ్డి, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ మరియు గ్రామీనాబీ వృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క కి మేడారం జాతర సమయంలో మేడారం, రెడ్డి గూడెం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లపూర్, వెంగ్లాపూర్ గ్రామాలలో రెండో పంట నష్టపరిహారం ఇవ్వాలి అని వినతి పత్రం ఇచ్చి మంత్రి సీతక్క కి సమస్య వివరించడం జరిగింది. మేడారం జాతర సమయంలో భక్తుల వాహనాలు పార్కింగ్ కోసం వేయి మంది రైతుల భూములు సుమారుగా 1500 వందల ఎకరాలు నష్ట పోతున్నట్ల తెలపగ సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే నష్ట పరిహారం కోసం రైతుల సర్వే చేసి నష్ట పరిహారం ఇవ్వాలి అని ప్రక్కన ఉన్న ములుగు కలెక్టర్ టీ ఎస్ దివాకర ను, ములుగు అర్డీఓ, తాడ్వాయి తహసీల్దార్ లను ఆదేశించారు. అనంతరం రైతు సొసైటీ అధ్యక్షులు పులి సంపత్ గౌడ్, అనంత రెడ్డి లు మాట్లాడుతూ కొంతమంది బీజేపీ బిఆర్ ఎస్ నాయకులు రైతు పేరుతో రాజకీయం చేస్తూ గతం లో రాష్ట్రము అధికారం లో ఉండి ఏం చేయకుండా ఈరోజు సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయ్ కాబట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలి అని చూస్తున్నారు అని అన్నారు. గుడి అభివృద్ధి వేరు, రైతులకు నష్టపరిహారం విషయం వేరు అని రైతు పేరు తో రాజకీయం చేసేవాళ్ళు మంత్రి కి లేదా కలెక్టర్ కు దరఖాస్తు ఇవ్వకుండా స్థానిక ఎన్నికల లో ప్రచారం ల రాజకీయం చేయడం సిగ్గు చేటు అని మంత్రి సీతక్క గారిని బద్నామ్ చేయాలి అని చూస్తే ఊరుకోం అని అన్నారు.గత ప్రభుత్వం లో బాబు రెడ్డి కి సంబందించిన భూమి ప్రభుత్వం బలవంతం గా గుంజుకొని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వనప్పుడు ఏం చేసారో చెప్పాలి అని అన్నారు. రైతులకు న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అన్నారు. దసర పండుగ తర్వాత మంత్రి సీతక్క, కలెక్టర్ ఆధ్వర్యంలో జాతర కు నష్ట పోతున్న రైతులు అందరితో సమావేశం పెడుతున్నట్లు తెలిపారు సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ మాట్లాడుతూ 20 సంవత్సరం నుండి ఉన్న మా ప్రాంతం రైతుల సమస్య ను అడిగిన వెంటనే పరిష్కారం చూపిన మంత్రి సీతక్క కి ఈ ప్రాంతం రైతలందరి తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ముజాపర్, పీరీల వెంకన్న, జంగా వెంకటేష్, చెర్ప వీరమోహన్ రావు, రాజయ్య, బాపురెడ్డి పోడెం బాబు తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువుకు నెలకు రూ.2500 విరాళం

- గిరిజన గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని పాలకులు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 9 ( జనం సాక్షి) :** గిరిజన నవజాత శిశువుకు (అప్పుడు జన్మించిన బిడ్డ) స్వేరోస్ స్వచ్ఛంద సంస్థ నుంచి నెలకు రు.2500 జీవితకాలం పాటు చదువు కోసం విరాళంగా అందిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల మారుమూల గిరిజన గ్రామం మాలిని గ్రామాన్ని ఆయన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం ను గతంలో పాలించిన ఎమ్మెల్యే కోనప్ప, ప్రస్తుతం ఎమ్మెల్యే హరీష్ బాబు లు పట్టించుకోకుండా వదిలివేసారని విమర్శించారు. కనీసం గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే రోడ్ల సౌకర్యం లేదని అన్నారు. దీంతో మాలిని గ్రామానికి చెందిన కొర్రం శ్రీదేవి అనే గర్భిణ మహిళా సకాలంలో హాస్పిటల్ కు చెరుకోకపోవడంతో శిశువుకు జన్మనిచ్చి, మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేవని, వాగులు, ఒ రైలపై కల్వర్టులు, బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాకాలంలో పూర్తిగా రవాణా స్తంభించిపోయి.. గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ కోసం 6 లైన్ల రోడ్లు నిర్మిస్తామని, ఇందుకోసం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని పేర్కొంటూ.. సంబంధిత కాంట్రాక్ట్ ను ఆంధ్ర కాంట్రాక్టర్, బిజెపి నేత సీఎం రమేష్ కు కట్టబెట్టడం సరికాదని అన్నారు. గిరిజన ప్రజల పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని, చిన్నచూపు మాత్రమే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ వెంట బి.ఆర్. ఎస్ నాయకులు లెండ్ గురు శ్యాం రావు,కొంగ సత్యనారాయణ, షేక్ చాంద్ పాల్గొన్నారు.

# ఎస్టీ హోదా పరిరక్షణకు లంబాడీల భారీ ధర్నా

- లంబాడీల ఎస్టీ హొదా ను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే..
- రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీలకు పిలుపునిచ్చిన ఎల్ - జేపీసీ



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్.జేఏసి) పిలుపుమేరకు హనుమకొండ లోని ఏకశిలా పార్కు సమీపంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరుడు టాను నాయక్ విగ్రహం వద్ద లంబాడీల ఎస్టీ రిజర్వేషన్లను కాపాడాలంటూ లంబాడీలపై నిరాధార ఆరోపణలు చేస్తున్న కోయ గోండు కు చెందిన రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో లంబాడీల భారీ నిరసన ధర్నా కార్యక్రమం జరిగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న లంబాడి గిరిజన విద్యార్థులు యువకులు, ఉద్యోగులు మహిళలు ఇతర కార్యకర్తలు పెద్ద ఎత్తున హనుమకొండకు చేరుకొని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. స్వార్థపర కోయ గోండుకు చెందిన కొద్దిమంది రాజకీయ నాయకుల వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదేవిధంగా నాడు తెలంగాణలోని లంబాడీలను రాజ్యాంగబద్ధంగా ఎస్టిలో చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు కూడా రాష్ట్రంలో అధికారంలో ఉందని లంబాడీల ఎస్టీ రిజర్వేషన్ లను కాపాడవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేననీ ధర్నాలో పాల్గొన్న నాయకులు స్పష్టం చేశారు. లంబాడీలను నిర్లక్ష్యం చేసిన, సుప్రీంకోర్టులో లంబాడీల పక్షాన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పోరాడకపోయిన రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలోను లంబాడీల వ్యతిరేకమైన పార్టీలను బొంద పెడతామని వక్తలు హెచ్చరించారు. వెంటనే కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి, కమ్యూనిస్టు పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని అందుకు ఆయా పార్టీలో ఉన్న లంబాడి రాజకీయ నాయకులు బాధ్యత తీసుకోవాలని లేనియెడల ఆయా పార్టీల నుండి లంబాడీలు బయటికి వచ్చి ఉద్యమంలో పాల్గొనాలని వక్తులు పిలుపునిచ్చారు. లంబాడీల ఎస్టీ హొదా పరిరక్షణకై

### 32 జిల్లాలలో లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీలు

సభలను నిర్వహించి నిరసనను తెలుపాలని అందుకు వారం రోజుల్లో కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. లంబాడీల శాంతి ర్యాలీకి జిల్లా యంత్రాంగం పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ ధర్నా ను ఉద్దేశించి లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్ – జేఏసీ) కన్వీనర్ జైసింగ్ రాథోడ్, కన్వీనర్ జాటోత్ కిషన్ నాయక్, సమన్వయకర్త వి.ఎన్ నాయక్, ఎల్ఆర్పి జాక్ నేత రాజు నాయక్, అముగోత్ వినోద్, ఎల్ జాక్, లంబాడి జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు వాంకుడోత్ వీరన్న నాయక్, పోరిక గోవింద నాయక్, వీరమ్మ గోపి సింగ్ నాయక్, కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, బానోత్ వసంత్ నాయక్, బానోత్ వెంకన్న నాయక్, డాక్టర్ ఉదయ్ సింగ్ నాయక్, రమేష్ రాథోడ్,రామన్న నాయక్, సమ్మయ్య రాథోడ్, లకావత్ కరుణాకర్ నాయక్, పాడియా గాంగు నాయక్, బానోత్ బిక్షపతి నాయక్, లావుడియా రాజు నాయక్, మూడు రమేష్ నాయక్, అజ్మీర వెంకట్ నాయక్, నునావత్ జవహర్ లాల్, భీమా నాయక్, బానోత్ భాస్కర్ నాయక్, భూక్య శ్రావణ్ నాయక్, ధరావత్ రామచంద్రనాయక్, రామెల్ నాయక్, నరేందర్ పవార్, ధరంసోత్ అనసూయ, బానోత్ నెహ్రూచంద్ నాయక్ ,సంతోష్ నాయక్, సిద్దు నాయక్, తిరుపతి నాయక్, సునీల్, గులాబ్ సింగ్, నరేందర్, రవినాథ్ , గోవర్ధన్ నాయక్, రవీందర్, బాలు నాయక్ తేజా నాయక్ , మరియు 5 వేల మంది లంబాడీలు పాల్గొన్నారు.



# జవాన్ రమేష్‌కు కన్నీటి వీడ్కోలు

### హాజరైన సిఐఎస్ఎఫ్ జవానులు

**చిట్యాల సెప్టెంబర్ 9(జనంసాక్షి) :** మండల కేంద్రం శివారు మహారాజుల కాలనీకి చెందిన సిఐఎస్ఎఫ్ జవాను ఆరేపల్లి రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతి చెందిన జవాన్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన చిట్యాలలో ఘనంగా జరిగాయి. సిఐఎస్ఎఫ్ జవానులు ప్రభుత్వం, పై అధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకుని రమేష్ భౌతిక కాయానికి జాతీయ జెండా కప్పి, పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్థించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై రమేష్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. బంధుమిత్రులు, తోటీ స్నేహితుల, తల్లిదం డ్రుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు కొనసా గాయి. మహారాజుల కాలనీ నుండి, చింతలపల్లి వైకుంతధామానికి అంతిమయాత్ర కొనసాగింది. వైకుంత ధామంలో సీఐఎఫ్ఎస్ సిబ్బంది , ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంతిమయాత్ర అనంతరం జాతీయ జెండాను జవాన్ రమేష్ భార్య సుమలత కు అప్పగించి సన్మానించారు. రమేష్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన పూనారు.

# ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

- మంత్రి పొంగులేటి

**కూసుమంచి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళులా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పాలేరు నియోజకవర్గంలో మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో కిష్టాపురం నుండి నర్సింహులగూడెం వరకు రూ. 1.33 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు, కిష్టాపురం నుండి పోచారం వరకు రూ. 1.61 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, కిష్టాపురం నుంచి ముత్యాలగూడెం వరకు రూ. 2.40 కోట్ల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. జుజ్జులరావుపేట గ్రామంలో రూ. 88 లక్షలతో జుజ్జులరావుపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి మల్లాయిగూడెం పిఆర్ రోడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కిష్టాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మామిడి నాగమ్మ ఇందిరమ్మ ఇంటిని మంత్రి పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఇసుక ఇస్తున్నారా, మొదటి విడత లక్ష రూపాయలు జమ అయ్యాయా అని లబ్దిదారుని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయి క్రమంలో విడతల వారిగా 5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు.

కూసుమంచి జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

కూసుమంచి తహసిల్దార్ కార్యాలయంలో శాండ్ బజార్‌ను



ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించాలని సదుద్దేశంతో ఒక టన్ను గోదావరి ఇసుకను రూ. 1100 కే అందించనున్నట్లు మంత్రి తెలిపారు. స్థానికులకు ఇతర అవసరాలకు టన్ను ఇసుక రూ. 1300కి విక్రయించడం జరుగుతుందని అన్నారు. ఎక్కడా తప్పులు జరగకుండా అధికారులు పనిచేయాలని, చిన్న తప్పు జరిగిన ఉపేక్షించేది లేదని మంత్రి అన్నారు.

కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేలకొండపల్లి మండలంలో 42, ఖమ్మం రూరల్ మండలంలో 82 మొత్తం 124 మంది లబ్ధిదారులకు కాటమయ్య రక్ష కిట్లు పంపిణీ, కూసుమంచి మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 20 మంది క్రైస్తవ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్ అండ్ బి ఇఇ పవార్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


## ఊరగుట్ట నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ఊరగుట్ట నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఇల్లందు మండలం సుభాష్ నగర్ లోని ఊరగుట్ట నేచర్ పార్క్‌ను సందర్శించి, అక్కడ పర్యాటకులను ఆకర్షించడానికి ,నేచర్ పార్క్ అభివృద్ధికి అవకాశాలు, భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలను సంభంధితశాఖల అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఊరగుట్ట నేచర్ పార్క్ జిల్లాలో సహజసిద్ధమైన అద్భుత సౌందర్యాన్ని కలిగిన ప్రదేశమని,దీనిని సక్రమంగా అభివృద్ధి పరచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని పేర్కొన్నారు. పార్క్ అభివృద్ధి ద్వారా పర్యాటక రంగంలో పురోగతితో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయాన్నారు.ఊరగుట్ట నేచర్ పార్క్ లో ట్రెక్కింగ్ మార్గాలు,జిప్ లైన్, ప్లే ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి వినోదాత్మక వసతులు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువత, కుటుంబాలు, విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులయ్యేలా వినోదం, భద్రత, విశ్రాంతి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్క్ లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక వసతులు తప్పని సరిగా కల్పించబడాలని తెలిపారు. పార్క్ లో ఏర్పాటయ్యే స్టాల్స్, ఫుడ్ కార్నర్స్, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు వంటి వాటిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థికాభివృద్ధి కలుగుతుందని, స్థానిక మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో ఊరగుట్ట నేచర్ పార్క్ ను జిల్లాలో పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడం లక్ష్యమని, దీనిద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి కొత్త దారులు తెరవబడతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ రవి, ఎఫ్ డి ఓ కరుణాకర చారి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, ఏం పి డి ఓ ధన్సిగ్, సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. మంగళవారం ప్రజాకవి కాళోజీ జయంతినీ పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ ఆర్ వి కర్ణన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలన కమిషనర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ యాస, భాష కోసం వారు చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ జయంతినీ తెలంగాణ భాషా దినోత్సవ జరుపుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అని కొనియాడారు. కాళోజి స్ఫూర్తి, తెలంగాణ సాధనలో, ప్రగతిలో ఇమిడి ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతా రాధిక, సహదేవ్ రత్నాకర్, విజిలెన్స్ అదనపు ఎస్పీ సుదర్శన్, డీఎస్పీ నరసింహా రెడ్డి, పిఆర్ఓ మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో నార్సింగ్ టౌన్ ప్లానింగ్ అధికారిణి మణిహారిక

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** బాధ్యతగా నిర్వర్తించాల్సిన పనుల్లోనూ అధికారం అడ్డుపెట్టుకొని చేతి వాటం ప్రదర్శించేందుకు యత్నించిన ఓ అధికారిణిని అవినీతి నిరోధక శాఖ రెడ్ అండ్ హ్యాండ్ గా పట్టుకుంది. డిఎస్పి ఏసీబీ, సిటీ రేంజ్ అధికారి ఆర్. శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ మంచిరేవుల గ్రామానికి చెందిన వినోద్ తన ప్లాట్ ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను ప్రాసెస్ చేయడానికి నార్సింగ్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిణి, చేవెళ్ల టిపిఓ ఇంచార్జ్ మణిహారిక జారీ చేయడానికి రూ. 10 లక్షలు డిమాండ్ చేసింది. ఫ్లాట్ యజమాని అంత ఇచ్చుకొననడంతో పలుమార్లు నార్సింగ్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చేలా తిప్పింది.చివరిగా రూ.4.50 లక్షలకు అంగీకార ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంతకుముందే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన సదరు యజమాని ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. మాటు వేసిన అధికారులు మంగళవారం మధ్యాహ్నం నార్సింగ్ కార్యాలయంలో రూ.4 లక్షలు లంచం తీసుకుని తన కబోర్డ్‌లో పెట్టుకుంది. దీంతో అక్కడే ఉన్న ఎసిబి, సిటీ రేంజ్-2 యూనిట్ అధికారి శ్రీధర్ టౌన్ ప్లానింగ్ అధికారినికి నిర్వహించిన



రసాయన పరీక్షలో టిపిఓ రెండు చేతుల వేళ్లు పాజిటివ్ రావడంతో నార్సింగ్ టిపిఓ అధికారిణి మణిహారికను అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించారు. ఈ అవినీతి అధికారిణి మరింత విచారణ కోసం అల్కాపూర్ లోని తన నివాసంలో సోదాలు జరుగుతున్నాయని, మున్సిపాలిటీలో పలు అక్రమ నిర్మాణాల ఫైళ్ళ లావాదేవీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి విచారణ కొనసాగిస్తున్నారు.

### అవినీతి అధికారులపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ను అంటే 1064ను సంప్రదించి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారి ఆర్. శ్రీధర్ కోరారు.

నార్సింగ్ మున్సిపాలిటీలో అధికారిని మణిహారిక పై అనుమతులకు విరుద్ధంగా పర్మిషన్ లేని అక్రమ నిర్మాణాలు, ట్రిబుల్ వన్ జీవోలో గౌలిదొడ్డి వట్టినాగులపల్లి, జన్వాడ గ్రామాల్లో ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలలో పెద్ద మొత్తంలో ముడుపులు స్వీకరించారని మున్సిపాలిటీలో విమర్శలు ఉన్నాయి. మరోవైపు డబ్బులు మూటలు చెబితే చాలు ఆ దారి మర్చిపోతుందని, నార్సింగ్ మున్సిపాలిటీ తో పాటు, చేవెళ్ల లో కూడా ఎల్ఆర్ఎస్, అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టి తన సొంత జేబు నింపుకుంటుందని స్థానిక గ్రామస్తులు బహిరంగ విమర్శలు చేశారు.

## పంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేసిన మంత్రి పొంగులేటి



**కూసుమంచి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో ఇటీవల నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాలంటే దానికనుగుణంగానే వాటి యొక్క కార్యాలయాలు అనువుగా ఉండాలనే ఆలోచనతో గ్రామపంచాయతీ పెద్దలను నిర్ణయం చేసిన స్థలంలోనే గ్రామపంచాయతీ భవనాన్ని త్వరితగతిన నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందని గ్రామపంచాయతీ పెద్దలు కోరిన విధంగా పంచాయతీ భవనానికి ప్రహరీ నిర్మాణము మరియు పశువుల వైద్యశాలను త్వరితగత నిర్మాణం చేయడం కొరకు అధికారులు త్వరితగతిన అంచనాలు సిద్ధం చేసి నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డిపిఓ రాంబాబు, ఆర్డిఓ నరసింహారావు, మండల తాసిల్దార్ రవికుమార్, మండల అభివృద్ధి అధికారి రామచంద్రరావు, సీడీసీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంచర్ల సుధీర్ రెడ్డి, మాజీ మండల పరిషత్ సభ్యులు కొమురెల్లి ఆలింగా గోవిందరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు మారోజు భీష్మ చారి, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మండల పరిషత్ సభ్యులు మహమ్మద్ జహంగీర్ షరీఫ్, గొల్లపూడి వీరన్న, కొవ్వూరి శ్యాంసుందర్ రెడ్డి, కంచర్ల పవన్ రెడ్డి, ఎస్.కె మల్సూర్, మారోజు విష్ణు, మామిళ్లగూడెం మాజీ సర్పంచ్ యల్లయ్య మండల నాయకులు ఎండి హాఫీజ్ ఉద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు జూకూరి గోపాలరావు, బానోతు శ్రీనివాసు నాయక్, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, మాదాసు ఉపేందర్, మరియు గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోళ్ళపాడు ప్రాథమిక పాఠశాలపై ఆకస్మిక తనిఖీ

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** టేకులపల్లి మండలం రోళ్ళపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల భవనం, ఆవరణ, తరగతి గదులు, పరిశుభ్రతా స్థితిని పరిశీలించారు. విద్యార్థులతో సూటిగా మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, పాఠశాలలో అందిస్తున్న మిడ్-డే మీల్ నాణ్యత, వసతుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల పఠన, రచన నైపుణ్యాలను అంచనా వేసే క్రమంలో ఒకటవ తరగతి, రెండవ తరగతి విద్యార్థులను బోర్డుపై వారి పేర్లు రాయమని సూచించి పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఆరోగ్యం, చదువు, అభివృద్ధి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాలని పేర్కొన్నారు. విద్యార్థులకు తగిన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి లోపం చోటు చేసుకోరాదని స్పష్టంచేశారు. ప్రతిరోజూ నిర్ణీత మెనూ అమలు అవుతున్నదో లేదో తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానాలను పరిశీలించిన కలెక్టర్,అధికారులు తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, నిర్లక్ష్యం లేదా లోపం తలెత్తితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఉపాధ్యాయులు చిట్టిబాబు, పంచాయతీ సెక్రటరీ రాజు, గ్రామస్తులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 62 పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ



**కూసుమంచి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా షూస్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. మంగళవారం కూసుమంచి మండలం నరసింహులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా 1 నుంచి 5వ తరగతి చదువుతున్న బాలబాలికలకు షూస్ అందజేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ నిర్వహించారు. కూసుమంచి మండలంలోని 62 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ చేశారు. కొత్త షూస్ అందుకున్న చిన్నారులు ఆనందంతో కళకళలాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎల్లప్పుడూ పేదల అంటే మక్కువ చూపే నాయకుడు. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ తీసుకుంటున్న ఈ తరహా చర్యలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయి. ఒక చిన్న అవసరాన్ని తీర్చడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం మంత్రి ప్రత్యేకత". తల్లిదండ్రులకు వ్యయ భారాన్ని తగ్గించడంలో, చిన్నారులకు సౌకర్యం కల్పించడంలో పెద్ద సహాయం. ఇలాంటి సేవా చర్యలు మరిన్ని జరగాలని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడిసి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాలరావు, బానోతు శ్రీనివాస నాయక్, రామ సహాయం బాలకృష్ణారెడ్డి, కొమురెల్లి ఆ లింగ గోవిందరెడ్డి, బజ్జూరు వెంకటరెడ్డి, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, ఎండి హాఫీజ్ ఉద్దీన్, మాదాసు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మధిర
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**మధిర, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** గ్రామీణ మౌలిక వసతులు అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోనీ ఎరుపాలెం మండలంలో పలు గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు, అంగన్వాడి భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకునే దిశగా నియోజకవర్గంలో ప్రణాళికా ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. శాశ్వత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామానికి ఆధునిక మౌలిక వస్తువులను పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగానే ప్రజల జీవన ప్రమాణాలు



మెరుగుపడేలా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలు, కోరికలను దృష్టిలో పెట్టుకొని వివిధ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఒక కొత్త దిశలో పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి నరసింహారావు,విద్యుత్ యస్ఈ శ్రీనివాసచారి, భద్రాద్రి జిల్లా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్,పిఆర్ ఈ వెంకటరెడ్డి,తాసిల్దార్ మన్నె ఉషా శారద, ఎంపీడీవో బి సురేందర్, వివిధ శాఖల అధికారులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొండబాల కోటేశ్వరరావు,మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, నాయుడు సత్య నారాయణ, మరి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,మండల పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,చావా రామకృష్ణ,శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు,యరమల పూర్ణచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,క్లస్టర్ ఇంచార్జ లు,వివిధ అనుబంధ సంఘ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### గ్రామ గ్రామాన ఘన స్వాగతం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు, వందలకోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో భారీగా జనం తరలివచ్చారు. డబ్బు చప్పుళ్ళు, మంగళ హారతులతో డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో డిప్యూటీ సీఎం పై ప్రేమతో పూల వర్షం కురిపించారు.

## నియోజకవర్గం అభివృద్ధి పనులపై డిప్యూటీ సీఎం సమీక్ష



**మధిర, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మధ్యాహ్నం బనిగండ్ల పాడులో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రెవిన్యూ,ఫారెస్ట్, పంచాయతీరాజ్, విద్యాశాఖ,ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ అధికారు లతో విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,వాటిని త్వరగతిన పూర్తి చేసేందుకు అధికారులు చేపట్టాల్సిన చర్యలు,రాబోయే రోజుల్లో చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.




# 9 ఏళ్లలో రూ.9 లక్షల కోట్లు

- 2030 నాటికి రూ.25 లక్షల కోట్లకు
- రీట్స్, ఇన్విట్‌లకు చక్కని ఆదరణ
- ఇన్వెస్టర్లలో పెరుగుతున్న విశ్వాసం
- ఐఆర్‌ఏ, బీఐఏ అంచనా

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్) సాధనాల్లో పెట్టుబడులకు ఆదరణ క్రమంగా పెరుగుతోంది.వీటి నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రూ.9 లక్షల కోట్లకు చేరినట్టు ఇండియన్ రీట్స్ అసోసియేషన్ (ఐఆర్‌ఏ), భారత్ ఇన్విట్స్ అసోసియేషన్ (బీఐఏ) ప్రకటించాయి. రీట్‌లు, ఇన్విట్‌ల నిర్వహణలోని ఉమ్మడి ఆస్తుల విలువ 2030 నాటికి రూ.25 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ప్రకటించాయి.ప్రస్తుతం ఐదు రీట్‌లు.. బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్, నాలెడ్జీ రియల్టీ ట్రస్ట్‌లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయి ఉన్నాయి. ఇక సెబీ నమోదిత 27 ఇన్విట్‌లు ఉండగా, వీటిల్లో ఐదు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయ్యాయి. రీట్‌లు, ఇన్విట్‌లపై మొదటిసారి అవగాహన కార్యక్రమాన్ని ఐఆర్‌ఏ, బీఐఏ ఢిల్లీలో నిర్వహించాయి. ఇన్విట్స్ నిర్వహణలోని ఏయూఎం విలువ రూ.7 లక్షల కోట్లుగా ఉంటే, రీట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ రూ.2.25 లక్షల కోట్లుగా ఉన్నట్టు



ప్రకటించాయి.''నేడు క్యాపిటల్ మార్కెట్స్ పరిధిలో రీట్‌లు ప్రధాన పెట్టుబడి సాధనంగా అవతరించాయి. ఆర్థిక మార్కెట్ల పరిధిలో భౌతిక ఆస్తులను పారదర్శకంగా, నియంత్రణల మధ్య అంతర్జాతీయంగా పోటీతత్వంతో నిర్వహిస్తున్నట్టు'' ఐఆర్‌ఏ చైర్మన్ అలోక్ అగర్వాల్ ప్రకటించారు. ఐదు లిస్టెడ్ రీట్‌ల మార్కెట్ విలువ రూ.1.5 లక్షల కోట్లుగా ఉంటుందని బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ ఎండీ, సీఈవో అయిన అగర్వాల్ తెలిపారు. ఈ సాధనాల పట్ల ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరుగుతున్నట్టు చెప్పారు. ఇన్వెస్టర్లకు స్థిరమైన ఆదాయానికి (నగదు ప్రవాహం) వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ''ఇన్విట్‌లు పారదర్శకమైన ప్లాట్‌ఫామ్‌లుగా మారాయి.పెరుగుతున్న భారత మౌలిక రంగ నిధుల అవసరాలకు ఇవి సరిగ్గా సరిపోతాయి''అని బీఏఐ సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ పేర్కొన్నారు. మౌలిక రంగంలో పెద్ద ఎత్తున వృద్ధి, పెట్టుబడుల దృష్ట్యా 2030 నాటికి ఇన్విట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ రూ.21 లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు. రీట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ 2030 నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఐఆర్‌ఏ అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1 నాటికి నాలుగు రీట్‌లు మొత్తం మీద రూ.24,300 కోట్లను వాటాదారులకు పంపిణీ చేశాయి. ఇక ఇన్విట్‌లు 2025 మార్చి నాటికి తమ వాటాదారులకు పంపిణీ చేసిన మొత్తం రూ.68,000 కోట్లుగా ఉంది.


### స్థిరమైన ఆదాయానికి మార్గం..

రీట్‌లు అన్నవి ఆదాయాన్నిచ్చే వాణిజ్య, రిటైల్ ఆస్తులను నిర్వహిస్తుంటాయి. వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వాటాదారులు ప్రతీ త్రైమాసికానికి స్థిరమైన ఆదాయాన్ని డివిడెండ్, అసలు, వడ్డీ రూపంలో పంపిణీ చేస్తుంటాయి. నికర మిగులు నుంచి 90 శాతాన్ని వాటాదారులకు పంచాల్సి ఉంటుంది. ఇన్విట్‌లు ఆదాయాన్నిచ్చే మౌలిక రంగ ప్రాజెక్టులను (రహదారులు, విద్యుత్ ప్రసార, పంపిణీ ప్రాజెక్టులు, పైప్‌లైన్లు, గోదాములు తదితర) నిర్వహిస్తుంటాయి.

## సెబీకి ఫిజిక్స్‌వాలా అప్‌డేట్

**రూ. 3,820 కోట్ల ఐపీవో..**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎడ్‌టెక్ యూనికార్న్ సంస్థ ఫిజిక్స్‌వాలా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవో చేపట్టేందుకు వీలుగా సెబీకి తాజా ముసాయిదా పత్రాలను అందించింది.రూ. 3,820 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసిన కంపెనీ తొలుత 2025 మార్చిలో గోప్యతా విధానంలో సెబీకి దరఖాస్తు చేసింది.దీనిలో భాగంగా మరోసారి అప్‌డేటెడ్ పత్రాలను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికితోడు మరో రూ. 720 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రమోటర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ విడిగా రూ. 360 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నారు.ప్రస్తుతం కంపెనీలో ఇరువురుకీ విడిగా 40.35 శాతం చొప్పున వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 461 కోట్లు ఆఫ్‌లైన్, హైబ్రిడ్ సెంటర్ల ఏర్పాటుకు వెచ్చించనుంది. మరో రూ. 548 కోట్లు ప్రస్తుత కేంద్రాల లీజ్ చెల్లింపులకు వినియోగించనుంది.






## లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లో మంగళవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:20 గంటలకు సెన్సెక్స్ 281.70 పాయింట్లు లేదా 0.35 శాతం లాభంతో 81,068.99 వద్ద, నిఫ్టీ 76.40 పాయింట్లు లేదా 0.31 శాతం లాభంతో 24,849.55 వద్ద ముందుకు సాగుతున్నాయి. సెంచరీ ఎక్స్‌ట్రూషన్స్, %వారూ% స్టీల్, షా అల్లాయ్స్, ప్రెసిషన్ కామ్‌షాఫ్ట్స్, మహాలక్ష్మి ఫాబ్రిక్ మిల్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలిచాయి. %వీ×జ% ఎలక్ట్రానిక్స్, సురానా టెలికాం అండ్ పవర్, డీపీ వైర్స్, మోస్చిప్ టెక్నాలజీస్, స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ వంటివి నష్టాల జాబితాలో చేరాయి.

## ప్రపంచంలో అత్యంత విలువైన బ్రాండ్స్.. లిస్ట్‌లోని ఇండియన్ కంపెనీస్

2025 సంవత్సరానికి గాను.. ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్‌లను కాంటార్ బ్రాండ్‌జెడ్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది.. టాప్ 100 గ్లోబల్ బ్రాండ్‌ల మొత్తం విలువ ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో వీటి మొత్తం మొత్తం విలువ 10.7 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఈ కథనంలో అత్యంత విలువైన గ్లోబల్ బ్రాండ్స్, ఇండియన్ బ్రాండ్స్ ఏవి?, వాటి విలువ ఎంత అనే వివరాలు చూసేద్దాం.2025 లో టాప్ 10 అత్యంత విలువైన గ్లోబల్ బ్రాండ్స్:యాపిల్: 12,99,655 మిలియన్ డాలర్స్,గూగుల్: 9,44,137 మిలియన్ డాలర్స్,మైక్రోసాఫ్ట్: 8,84,816 మిలియన్ డాలర్స్,అమెజాన్: 8,66,118 మిలియన్ డాలర్స్,ఎన్విడియా: 509,442 మిలియన్ డాలర్స్,ఫేస్‌బుక్: 3,00,662 మిలియన్ డాలర్స్,ఇన్‌స్టాగ్రామ్: 2,28,947 మిలియన్ డాలర్స్,మెక్‌డొనాల్డ్స్: 2,21,079 మిలియన్ డాలర్స్,ఒరాకిల్: 2,15,354 మిలియన్ డాలర్స్,వీసా: 2,13,348 మిలియన్ డాలర్స్,2025లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన భారతీయ బ్రాండ్స్,టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్): 57,333 మిలియన్ డాలర్స్,హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: 44,959 మిలియన్ డాలర్స్,ఎయిర్‌టెల్: 37,094 మిలియన్ డాలర్స్,ఇన్ఫోసిస్: 33,096 మిలియన్ డాలర్స్




## ఆగస్టులో 3% పెరిగిన వాహన విక్రయాలు

**ఆటో డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడి**

న్యూఢిల్లీ: దేశీయ వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో స్వల్పంగా 3% పెరిగాయని వాహన డీలర్ల సమాఖ్య ( ఫాడా) గణాంకాలు వెల్లడించింది. మొత్తం ఆగస్టులో 19,64,547 వాహన రిజిస్ట్రేషన్లు కాగా, 2024 ఆగస్టులో ఇవి 19,10,312గా ఉన్నాయని ఫాడా తెలిపింది.జీఎస్టీ అమల్లోకి వస్తే ధరలు దిగి వస్తాయని కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేసుకోవడంతో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని పేర్కొంది. ''వేచి చూసే ధోరణి కారణంగా సెప్టెంబర్ ప్రథమార్ధమంతా అమ్మకాలు అంతంత మాత్రమే ఉండొచ్చు. జీఎస్టీ విధానంపై స్పష్టత, పండుగ సెంటిమెంట్‌తో ఈ నెల అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి ఉండొచ్చు'' అని ఫాడా అంచనా వేసింది.ప్యాసింజర్ విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 3,20,291 యూనిట్ల నుంచి స్వల్పంగా 0.93% పెరిగి 3,23,256 కు చేరాయి. మెరుగైన ఎంక్వైరీలు, పండుగ బుకింగ్స్‌తో ఆగస్టు ప్రథమార్ధమంతా సానుకూల ధోరణి కన్పించింది. అయితే ఆగస్టు 15న ప్రధాని జీఎస్టీ సంస్కరణ ప్రకటనతో కస్టమర్లు కొనుగోళ్లు వాయిదా వేసుకున్నారని ఫాడా తెలిపింది. ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు 2.17% పెరిగాయి. ఈ ఆగస్టులో మొత్తం 13,73,675 అమ్మకాలు జరిగాయి. గతడాది ఇదే నెలలో విక్రయాలు 13,44,380 యూనిట్లుగా ఉన్నాయి. ఈ విభాగపు ఎంక్వైరీలు ఇప్పట్టికీ బలంగా ఉన్నాయి. ఓనమ్, గణేశ్ చతుర్థి పండుగ ప్రారంభంతో చాలా మంది కస్టమర్లు డెలివరీల కోసం ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఉత్తర భారతదేశంలో అధిక వర్షాలు, వరదలు గ్రామీణ రాకపోకలకు అంతరాయంతో అమ్మకాలపై ప్రభావాన్ని చూపాయి.వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో 69,635 యూనిట్ల నుంచి 8.55% పెరిగి 75,592 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీవీలర్ రిటైల్ అమ్మకాలు 1,05,493 యూనిట్ల నుంచి 2% తగ్గి 1,03,105కు దిగివచ్చాయి.



# అమెరికా టూరిజం పతనం దిశగా...

### క్షీణిస్తున్న అసలైన కారణాలు ఇవే..

**వాషింగ్టన్,జనంసాక్షి:**

ప్రపంచ పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. యునైటెడ్ స్టేట్స్ ఊహించని తిరోగమనాన్ని ఎదుర్కొంటోంది. అమెరికాకు వివిధ దేశాల నుంచి వచ్చేవారి సంఖ్య 8.2 శాతం తగ్గింది.ఫలితంగా పర్యటక ఆదాయం గణనీయంగా తగ్గింది. టూరిస్ట్‌లు ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, చౌకైన గమ్యస్థానాలను ఎంచుకుంటున్నారు. అమెరికాకు పర్యాటకుల సంఖ్య తగ్గడానికి కారణాలను పరిశీలిస్తే.. వీసా ఆలస్యం, పెరిగిన ఖర్చులు, రాజకీయ ప్రభావం, భద్రతకు సంబంధించిన ఆందోళనలు ప్రధానంగా పర్యాటకుల సంఖ్య తగ్గడానికి కారణమని కొంతమంది విశ్లేషకులు చెబుతున్నారు.యూఎస్‌కు వెళ్లే జర్మన్‌ల సంఖ్య 12 శాతం తగ్గింది. వీరంతా పోర్చుగల్, కెనడా, వియత్నాం దేశాలను సందర్శిస్తున్నారు. జపనీస్ సందర్శకుల సంఖ్య.. కోవిడ్ మహమ్మారి సమయం నుంచే 35 శాతం తగ్గిపోయింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో వీరందరూ.. దక్షిణ కొరియా, థాయిలాండ్, ఆస్ట్రేలియాలను సందర్శిస్తున్నారు. అంతే కాకుండా అమెరికాకు వెళ్లే కెనడా పర్యాటకుల సంఖ్య 20.2 శాతం పడిపోయింది.వీసా ఆలస్యం కారణంగా.. బ్రెజిల్ ప్రజలు అమెరికాకు ప్రత్యామ్నాయం వెతుక్కుని, యూరప్, సౌత్ అమెరికా దేశాలకు వెళ్తున్నారు. ఈ దేశీయులు అమెరికా వీసా కోసం 300 రోజులు నిరీక్షించాల్సి ఉంది. ఇది బ్రెజిలియన్ ప్రయాణికులను వేరే మార్గం వెతుక్కునేలా చేసింది.ఇక భారత్ విషయానికి వస్తే.. అమెరికా అధ్యక్షుడు ప్రతీకార సుంకాలను విధించడమే కాకుండా, వీసా ఆంక్షలను కూడా మరింత కఠినం చేశారు. ఇప్పుడు వీసా కోసం భారతీయులు ఏకంగా 400 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. రూపాయి కూడా బలహీనపడటం.. అమెరికాలో ఖర్చులు పెరగడం వల్ల, ఇండియన్స్.. ఆగ్నేయాసియా, యూరప్ దేశాలను ఎంచుకుంటున్నారు.పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో.. అమెరికాలోని ప్రధాన నగరాలు ఇబ్బంది పడుతున్నాయి. పర్యాటకుల సంఖ్య 17 శాతం తగ్గడంతో న్యూయార్క్ నగరం 4 బిలియన్ డాలర్ల నష్టం చొసింది. శాన్ ఫ్రాన్సిస్కో లాస్ ఏంజిల్స్ కూడా ఇలాంటి నష్టాలనే చవిచూస్తున్నాయి. వీసా విధానాలు సడలించకపోతే.. పర్యాటక రంగంలో అమెరికా కోలుకోవడానికి మరో రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## అమెరికా, పాకిస్తాన్ మధ్య కొత్త ఒప్పందం

పాకిస్తాన్‌లోని కీలకమైన ఖనిజాలకు సంబంధించి.. పాకిస్తాన్ ఫ్రాంటియర్ వర్క్స్ ఆర్గనైజేషన్, యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని పాకిస్తాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోమవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.''ఈరోజు ప్రధాన మంత్రి నివాసంలో పాకిస్తాన్ ఫ్రాంటియర్ వర్క్స్ ఆర్గనైజేషన్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ఇస్లామాబాద్ రాయబార కార్యాలయం యాక్టింగ్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జాచ్ హార్కెన్‌రైడర్ వచ్చారు'' అని ప్రకటన పేర్కొంది.''అమెరికా భద్రత, శ్రేయస్సుకు కీలకమైన ఖనిజ వనరుల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ పరిపాలనలో ఇటువంటి ఒప్పందాలను రూపొందించడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పాకిస్తాన్‌లోని కీలకమైన ఖనిజాలు.. మైనింగ్ రంగంలో యూఎస్ కంపెనీలు, వాటి సహచరుల మధ్య భవిష్యత్తులో ఒప్పందాలను కుదుర్చుకోవడానికి కూడా మేము ఎదురుచూస్తున్నాము'' అని ఛార్జ్ డీ అఫైర్స్ నటాలీ బేకర్ అన్నారు.యూఎస్ఎస్ఎమ్ అనేది మిస్సోరిలో ఉన్న ఒక సంస్థ. ఇది కోబాల్ట్, నికెల్, రాగి, లిథియం వంటి కీలకమైన ఖనిజాలను ఉత్పత్తి చేయడం, రీసైక్లింగ్ చేయడం వంటివి చేస్తుంది. ఈ ఖనిజాలను యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎనర్జీ.. వివిధ సాంకేతిక పరిజ్ఞానాలలో తమకు అవసరమైనవిగా లేబుల్ చేసుకుంటుంది.

## హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం రూ.1500 కోట్లు

చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే అనంతరం ప్రధాని మోదీ కాంగ్రాలో ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా తదితరులతో సమావేశమయ్యారు. సహాయక, పునరావాస చర్యలను సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం వెన్నంటే ఉంటామని.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అన్ని విధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, రాష్ట్ర యంత్రాంగం సేవలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇదిలా ఉండగా.. వరద నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ లో పర్యటించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బృందాల నివేదికలతో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన విజ్ఞప్తుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మోదీ తెలిపారు.

## జీన్ కరోల్ పరువు నష్టం కేసు.. ట్రంప్‌కు ఎదురు దెబ్బ

కాలమిస్ట్ ఈ. జీన్ కరోల్ వేసిన పరువు నష్టం కేసులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ 8.33 కోట్ల డాలర్లు(సుమారు రూ.733 కోట్లు) చెల్లించాలంటూ సివిల్ జ్యూరీ ఇచ్చిన తీర్పును న్యూయార్క్‌లోని ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ట్రంప్ చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చింది. జ్యూరీ పేర్కొన్న పరిహారం సహేతుకంగానే ఉందని సోమవారం రూలింగ్ వెలువరించింది.అధ్యక్షుడిగా తనకు మినహాయింపు ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపిందని, పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదంటూ ట్రంప్ చేసిన వాదనను తిరస్కరించింది. 1996లో మన్‌హట్టన్ డిపార్టుమెంట్ స్టోర్‌లో జీన్ కరోల్‌పై ట్రంప్ లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనిపై కోర్టు ఆయనకు 5 మిలియన్ డాలర్ల(రూ.400 కోట్ల) జరిమానా విధించింది. గత డిసెంబర్‌లో అప్పీల్స్ కోర్టు ఈ తీర్పును సమర్థించింది కూడా.అయితే, సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పదేపదే జీన్ కరోల్ లక్ష్యంగా ఆరోపణలు, వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీనిపై ఆమె పరువు నష్టం కేసు వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం రూ.733 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది.



# ఎవరీ బాలెన్ షా?

**జనరేషన్ జెడ్ హీరో.. నేపాల్‌కి కొత్త ప్రధాని!**

**కాఠ్మాండు:** నేపాల్‌లో జనరేషన్ జెడ్ నిరసనలు ఆ దేశ రాజకీయాలను కుదిపేశాయి. సోషల్‌మీడియాపై ప్రభుత్వ ఆంక్షల్ని విధించడాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్ రాజధాని కాఠ్మాండులో జనరేషన్ జెడ్ యువత రోడ్డెక్కింది. ఆందోళన చేపట్టింది. వీరి ఆందోళనలతో ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేశారు. దీంతో ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా తర్వాత తదుపరి ప్రధాని ఎవరు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ దేశంలో సైనిక పాలన అమల్లోకి వచ్చే అవకాశం ఉందంటూ పలు అంతర్జాతీయ కథనాలు వెలుగులోకి వచ్చాయి.ఈ క్రమంలో నేపాల్ తదుపరి నూతన ప్రధాని బాలేంద్ర షా (బాలెన్) పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సోషల్‌మీడియాపై బ్యాన్, అవినీతిపై ఆందోళన చేస్తున్న యువతే బాలేంద్ర షాకు మద్దతు పలుకుతున్నాయి. అతనే నేపాల్ నూతన ప్రధాని అంటూ సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ నిర్వయిస్తున్నాయి. బాలెన్ షా ఒకప్పుడు అండర్‌గ్రౌండ్ హిప్-హాప్ రాపర్. తన పాటల ద్వారా రాజకీయ అవినీతి, సామాజిక అసమానతలపై విమర్శలు చేశారు. బలిదాన్ అనే పాటకు యూట్యూబ్‌లో ఏడు మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందిన బాలెన్, 2022లో స్వతంత్ర అభ్యర్థిగా కాఠ్మాండు మేయర్‌గా ఎన్నికయ్యారు. నేపాల్‌లో దేశవ్యాప్తంగా సోషల్ మీడియా నిషేధం విధించడంపై ఆందోళన చేపట్టిన జనరేషన్ జెడ్‌కు మద్దతుగా బాలెన్ షా సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ఈ ఉద్యమం పూర్తిగా జనరేషన్ జెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. వయస్సు పరిమితి కారణంగా వారి ఆందోళనలో



నేను పాల్గొనలేను.కానీ వారి ఆవేశాలను అర్థం చేసుకోవాలనుకుంటున్నాను'అని పేర్కొన్నారు.నేపాల్‌లో దేశవ్యాప్తంగా సోషల్ మీడియా నిషేధం విధించిన తర్వాత ప్రారంభమైన నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. జనరేషన్ జెడ్ యువత ఆధ్వర్యంలో సాగిన ఈ ఉద్యమంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. 300 మందికి పైగా గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సైన్యం ఆదేశాలతో ప్రధాని కేపీ శర్మ ఓలి మంగళవారం రాజీనామా చేశారు. ఓలీ తన రాజీనామా లేఖలో.. సమస్యకు రాజకీయ పరిష్కారం అవసరం. అందుకు నేను రాజీనామా చేస్తున్నాను' అని పేర్కొన్నారు. ఓలీ రాజీనామా అనంతరం ఎయిర్‌పోర్టులను మూసివేశారు. మంత్రులను హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో జనరేషన్ జెడ్ కేపీ ఓలీ తర్వాత తదుపరి ప్రధానిగా బాలెన్ షాయేనంటూ సోషల్ మీడియా క్యాంపెయిన్ చేపట్టింది. పార్టీల కోసం పని చేసే నాయకులు కాదు. ప్రజల కోసం పనిచేసే నాయకుడు కావాలి' అనే నినాదంతో బాలెన్ పేరుతో సోషల్ మీడియాలో క్యాంపెయిన్ చేస్తున్నారు.'బాలెన్ దాయ్.. టేక్ ద లీడ్' అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.ప్రధాని ఓలి రాజీనామాతో రాష్ట్రపతి రామ్ చంద్ర పౌడెల్ కొత్త నూతన ప్రధాని అభ్యర్థి పేర్లను పరిశీలిస్తున్నారు. జనరేషన్ జెడ్ సైతం రాష్ట్రపతి రామ్ చంద్ర పౌడెల్ వద్దకు బాలెన్ షా పేరును ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

## పుడుతూనే స్మార్ట్ ఫోన్.. ఎదుగుతూ హై స్పీడ్ ఇంటర్నెట్

నేపాల్‌లో సోషల్ మీడియా యాప్‌లపై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించిన దరిమిలా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. ఈ ఆందోళనల్లో 'జెన్ జెడ్' కీలక భాగస్వామ్యం కనిపించింది.ఇంతకీ జెన్ జెడ్ అంటే ఏమిటి? 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలను 'జనరేషన్ జెడ్' (జెన్ జెడ్) అని పిలుస్తారు. అధునాతన స్మార్ట్‌ఫోన్‌లు విరివిగా వినియోగించే ఇంటర్నెట్ యుగంలో జన్మించినవారే జెన్ జెడ్ కేటగిరీకి చెందినవారు. వీరు ప్రపంచాన్ని భిన్నంగా చూస్తారు ఆన్‌లైన్‌లో స్నేహితులను కలుసుకోవడానికి, భౌతికంగా స్నేహితులను కలుసుకోవడానికి తేడా లేదని చెబుతుంటారు. ఒక అమెరికన్ ఇన్స్టిట్యూట్ తెలిపిన వివరాల ప్రకారం, 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలను 'జనరేషన్ జెడ్' అని అంటారు. వీరు అధునాతన స్మార్ట్‌ఫోన్‌లు విరివిగా వినియోగించే ఇంటర్నెట్ యుగంలో జన్మించారు. ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధిని పరిశీలిస్తే, అది 1995 సంవత్సరం తర్వాత అత్యంత వేగంగా పెరిగింది. స్మార్ట్‌ఫోన్‌లు, హై స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్‌లు విరివిగా అందుబాటులోకి వచ్చిన తరుణంలో పుట్టిన చిన్నారులు సాంకేతికంగా మరింత ముందడుగు వేస్తారని నిపుణులు అంటున్నారు. ఇంతేకాదు మునుపటి తరంతో పోలిస్తే, జెన్ జెడ్ కేటగిరీకి చెందినవారు మరింత స్నేహశీలురుగా మెలుగుతూ, ప్రపంచాన్ని భిన్నంగా చూస్తారని చెబుతున్నారు. మాట తీరు ఇంతకుముందు తరాలకు భిన్నంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు.జనరేషన్ జెడ్.. సంక్షిప్తంగా జెన్ జెడ్.. వ్యవహా రికంగా జూమర్స్ అని ప్రస్తుత తరం యువతను పిలుస్తున్నారు. ఈ తరంలో జన్మించినవారు అంతకుముందు తరాలవారి వ్యవహారశైలికి భిన్నంగా ఉంటున్నారు. వీరి విద్యాభ్యాసం విషయానికొస్తే తమ ముందు తరాల కంటే కొంత భిన్నమైన విద్యావిధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రస్తుతం జెన్ జెడ్ తరం వారు హైస్కూలు మొదలుకొని ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వారిగా ఉన్నారు.

# ఆర్జీ-2 డివిజన్‌లో 54వ జోనల్ రెస్క్యూ పోటీలకు సర్వసిద్ధం






- నేటి నుండి 10,11 తేదిల్లో సింగరేణి వ్యాప్తంగా పోటీల నిర్వహణ
- పోటీల్లో ప్రతిభ కనబరిచిన సభ్యులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**యైటింక్లయిన్ కాలనీ (జనంసాక్షి) :** సింగరేణి బొగ్గు గనుల్లో ప్రమాదాలు సంభవించే సమయంలో వెంటనే స్పందించే రెస్క్యూ సభ్యుల్లో మరింత ప్రతిభను, పోటీతత్వం పెంచేందుకు సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 10, 11 తేదిల్లో ఆర్జీ-2 ఏరియాలో రెండు రోజులపాటు జరిగే రెస్క్యూ పోటీలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఆపద సమయంలో మేము ఉన్నామంటూ కార్మికులకు భరోసా, ధైర్యాన్ని కల్పిస్తారు. రెస్క్యూ టీం సభ్యులకు నిరంతరం నైపుణ్యం, చురుకు తనం, ప్రతిభను పెంచేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడుతాయి. దీంతో ప్రతి సంవత్సరం రెస్క్యూ పోటీలను నిర్వహిస్తుంటారు. సింగరేణిలోని ప్రతి వంద మందికి ఒక రెస్క్యూ సభ్యుడిని నియమించాలని, జాతీయ స్థాయిలో సింగరేణి రెస్క్యూకు ప్రత్యేకత ఉంది. గతంలో జరిగిన కోలిండియా స్థాయి పోటీల్లో డబుల్ హ్యాట్రిక్ సాధించి సింగరేణి రెస్క్యూ అగ్రభాగంలో నిలిచింది. ఇటీవల కాలంలో నూతన ఉద్యోగుల సంఖ్య పెరుగడంతోపాటు వీరు కూడా రెస్క్యూలో కొత్త సభ్యుల ఎంపికకు యాజమాన్యం ప్రాధాన్యం కల్పించింది.

**రెస్క్యూ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం :**

**-జీఎం బండి వెంకటయ్య**

రెండు రోజులపాటు జరిగే సింగరేణి రెస్క్యూ పోటీలకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తెలిపారు. జట్టు సభ్యులతో పాటు టీం మేనేజర్లు, కోచ్‌లకు వసతి సౌకర్యాలు కల్పించామని, ఒక రోజు ముందే జట్లు చేరుకుంటాయని, సంస్థ సీఅండ్ఎండీ డీడీఎంఎస్, డీఎంఎస్ అధికారులు, సింగరేణి డైరెక్టర్లు, అన్ని యూనియన్ నాయకులను ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డీడీఎంఎస్ అధికారులు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

**పలు విభాగాల్లో పోటీల నిర్వహణ :**

**రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి**

రెస్క్యూ పోటీలు పలు విభాగాల్లో నిర్వహించేందుకు రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో థీయరి, స్టాట్యూటరీ, ఫస్ట్‌ఎయిడ్, డ్రిల్ పరేడ్, రెస్క్యూ రిలే రేస్ పోటీలను నిర్వహించనున్నారు. జీడీకే. 7ఎల్ఈపీ గనిలో ఫ్రెస్ ఎయిర్‌బేస్, రెస్క్యూ రికవరి వర్క్, క్యాప్టెన్స్ రిపోర్టు పోటీలు నిర్వహిస్తారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఆరు జట్ల మధ్య పోటీలు ఉంటాయి. అత్యంత ప్రతిభ కనబరిచిన జట్ల నుండి సభ్యులను రెండు జట్లుగా ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. అలాగే ఆరు జట్లు పోటీల్లో పాల్గొంటే అందులో అత్యంత ప్రతిభ కనబరిచిన మూడు జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

## హరితహారం మొక్కలను పరిశీలించిన అధికారులు

**ముత్తారం (జనంసాక్షి) :** ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజిఎస్ పథకం ద్వారా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల నాటిన మొక్కల పైన అవకతవకలు జరిగిందని జిల్లా ఉన్నత అధికారులకు పిర్యాదు మంగళవారం రోజున డిఆర్‌డిఏ అధికారి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పరిశీలించడం జరిగిందని పరిశీలనలో జరిగిన అవకతవకలు గుర్తించి ఉన్నత అధికారులకు నివేదికను సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ దయమని పాల్గొన్నారు

# ఆన్లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలి

- మోడల్ స్కూల్లో ఆన్‌లైన్ తరగతులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బోయిన్ పల్లి, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బోయిన్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్‌లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలు పోటీ పరీక్షలు రాసేందుకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఉచితంగా శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్విని యోగం చేసుకుంటే జీవితం బాగుంటుందన్నారు. మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఫ్యాన్లు లేవని తెలుపగ వెంటనే 50 ఫ్యాన్లు మంజూరు చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్, ఎంపీడీవో, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో అత్యాచారం కేసులో.. నిందితుడి అరెస్ట్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** కరీంనగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సెప్టెంబర్ 6న జరిగింది. జ్వరంతో బాధపడుతున్న యువతిని ఆమె తల్లిదండ్రులు సెప్టెంబర్ 6వ తేదీన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అదే ఆసుపత్రిలో కాంపౌండర్/ఓటీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన పెద్ది దక్షన్ మూర్తి ఏ దక్షిణామూర్తి (23) అనే వ్యక్తి రాత్రి విధుల్లో ఉండగా బాధితురాలికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడని ఈ విషయాన్ని బాధితురాలు తన తండ్రికి చెప్పడంతో, అతను వెంటనే కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు క్రైమ్ నెంబర్ 343/2025, సెక్షన్ 64(2)(ఈ) బిఎన్ఎస్, 2023 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు వెంటనే ఆసుపత్రికి వెళ్లి సాక్షులను విచారించి టెక్నికల్ ఆధారాలను సేకరించారు. ఆధారాలన్నీ పరిశీలించిన తరువాత, సెప్టెంబర్ 8న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు పెద్ది దక్షన్ మూర్తి (23) ఏ దక్షిణామూర్తి, తండ్రి పోచన్న, వయసు 23 సంవత్సరాలు. అతను మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లా, సిరోంచ తాలూకా, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందినవాడు. అతను ఇంటర్మీడియట్ (బైపిసి) వరకు చదువుకుని, నాలుగు సంవత్సరాల క్రితం కరీంనగర్ వచ్చాడు. మొదట ఆర్కిడ్ ఆసుపత్రిలో వార్డ్ బాయ్‌గా పని చేసి, ఆ తర్వాత హరిణి ఆసుపత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా చేరాడు. అయితే, తరచుగా మద్యం సేవించి డ్యూటీకి రావడం వల్ల అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. అనంతరం స్వగ్రామానికి వెళ్లి తిరిగి కరీంనగర్ వచ్చి ఈ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా చేరాడు. నిందితుడు తరచుగా అశ్లీల వెబ్‌సైట్లు చూస్తూ, మద్యం సేవించి విధులకు హాజరయ్యేవాడని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా, ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత అధికారులకు నివేదిక పంపి తగుచర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలు కావద్దని పోలీసులు సూచించారు. ఈ కేసులో నిందితుడు చెడు అలవాట్లకు బానిసై తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డాడని కరీంనగర్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలకు అంగన్వాడీ సెంటర్లకు మహర్దశ

### మంథని డివిజన్‌లో మరమ్మత్తులకు 10.60 కోట్ల నిధులు మంజూరు



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్ పాలకుర్తి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు అంగన్వాడి సెంటర్లకు మహర్దశ రానున్నది. ఈ మండలాల్లో ప్రభుత్వ పాఠశాల రిపేర్లకు అంగన్వాడీ స్పెషల్ రిపేర్లకు 10 కోట్ల 60 లక్షల నిధులను రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, కమాన్ పూర్, పాలకుర్తి మండల్లాల్లోని 79 ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు గాను 9 కోట్ల 64 లక్షలు, 48 అంగన్వాడి కేంద్రాల రిపేర్లకు 96 లక్షల డిఎంఎస్టి నిధుల నుంచి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ మంజూరు చేయించడం జరిగింది. మంథని నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం, మంచి వసతులు,కంప్యూటర్ ల్యాబ్స్, నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నిధులు మంజూరు అయినటువంటి ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీధర్ బాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## జమ్మికుంట పట్టణంలో చేనేత కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం




**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల జమ్మికుంట పట్టణంలోని షత్రంజి చేనేత సంఘంలో గల చేనేత కార్మికుల కొరకు వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం, ఎన్‌సిడి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో షత్రంజి చేనేత సంఘంలో గల 115మంది చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు, ఎన్ సి డి పరీక్షలు నిర్వహించారు.ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న కార్మికులకు ఎన్సీడీ పరీక్షలు నిర్వహించి ,చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న చేనేత కార్మికులకు మందులు ఇచ్చారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ చందు సందర్శించి చేనేత కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత సీజనల్ డిసీజెస్ (వర్షాకాలంలో సంభవించే వ్యాధుల) మీద, డ్రై డే మీద అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ మందులు ప్రభుత్వం అందించే మందులనే వాడాలని తద్వారా ఆర్థికంగా భారం తగ్గించుకోవచ్చు అని ప్రభుత్వ మందులు సమర్థవం తంగా పనిచేస్తాయని అన్నారు. అలాగే ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతి మంగళవారం,శుక్రవారం ఆరోగ్య ఉప కేంద్రాలలో జరుగుతుందని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వరుణ,డాక్టర్ మహెూన్నత పటేల్,హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహన్ రెడ్డి,పంజాల ప్రతాప్ గౌడ్ షత్రంజి చేనేత సంఘం అధ్యక్షుడు ఉడుత రమేష్,సూపర్వైజర్ అరుణ,ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, నరేందర్ హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు మంజుల,రజిత,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణిలో దసరా పండుగ తేదీని మార్చాలి

### హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్




**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో దసరా పండుగ తేదీని మార్చాలని మంగళవారం హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో గనుల వద్ద వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్జీ వన్, టూ, త్రీ, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో కమిటీ నాయకులు అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండుగ ఒకేరోజు రావడం వల్ల సింగరేణి కార్మికులు ఒక పిహెచ్డిని నష్టపోవడం జరుగుతుందని రియాజ్ అహ్మద్ అన్నారు. కుటుంబ సభ్యులతో స్నేహితులతో ఆత్మీయులతో విందు వినోద్‌లకు సాంప్రదాయాలకు ఆటంకం ఏర్పడుతుందని, వెస్ట్ టర్న్ టోల్ ఫీల్డ్ (డబ్ల్యూ సిఎల్) లో మార్పు చేసిన విధంగా సింగరేణి యాజమాన్యం కూడా దసరా పండుగను గాంధీ జయంతి నాడు కాకుండా మరొకరోజు జరపడానికి వెంటనే జారీ చేయాలని కోరారు. ఈ విషయంపై సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గనుల్లో డిపార్ట్మెంట్లో హెచ్ఎంఎస్ యూనియన్ పక్షాన కార్మికులతో కలిసి గని మేనేజర్లకు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురయ్య కోశాధికారి దుర్గం శ్రీనివాస్, శ్రీధర్ రాకేష్ కుమార్ కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో ఘనంగా తెలంగాణ భాష దినోత్సవ వేడుకలు





- కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు
- ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులకు సత్కారం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** కాళోజీ నారాయణరావు తెలంగాణ ఉద్యమానికి గొప్ప ప్రతీకని, వారు ఇచ్చిన స్ఫూర్తి నేటికి కొనసాగుతున్నదని డా. అశ్విని తానాజీ వకాడే, అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు), అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రముఖ కవి డాక్టర్. కెప్టెన్ మధుసూదన్ రెడ్డి లతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో ఏసీ కళాశాలలో వేడుకగా నిర్వహించినటువంటి తెలంగాణ భాష దినోత్సవ వేడుకలకు కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. కాళోజి నారాయణరావు గొప్ప ఉద్యమకారుడని, వారి రచనల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని మనం సాధించగలిగామని గర్వంగా తెలియపరుస్తూ ప్రతి ఒక్కరు కాళోజిని స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి పాటుపడాలని వారు చెప్పారు. వారి పోరాట పటిమ యువతలో స్ఫూర్తి నింపడమే కాకుండా నిజాంలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేయడంలో కీలక పాత్ర పోషించారని అనడంలో ఎటు వంటి సందేహం లేదు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాళోజి నారాయణరావు ప్రజా కవిగా ఖ్యాతి గడించా రని, ప్రజల సమస్యకు తక్షణమే పరిష్కారం తెలపడానికి పొందడానికి పలు ఉద్యమాలు చేపట్టారని వారి ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ రాష్ట్రానికి మూలమైనదని వారు కొనియాడారు.అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వారి జయంతోత్సవాలను గొప్ప వేడుకగా నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్నదని ఈ సంవత్సరం సైతం వారు అందించిన స్ఫూర్తితో తెలంగాణ భాష అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులకు సన్మానాన్ని నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లోని తెలుగు ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. వేడుకల సందర్భంగా ఉపాధ్యాయులు ఆలపించినటువంటి పలు తెలంగాణ జానపద గేయాలు, పల్లె వాతావరణాన్ని తలపించే కవితలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం (న్యూ కలెక్టరేట్) లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ నారాయణ రావు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. అంతకుముందు వర్ని చౌరస్తా లో గల కాళోజీ విగ్రహానికి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి
- నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం పని తీరుపై సమీక్ష




**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రెవెన్యూ విభాగం అధికారులతో కలెక్టర్ సమావేశమై పన్ను వసూళ్లలో ప్రగతి, న్యూ అసెస్ మెంట్, మ్యుటేషన్ దరఖాస్తుల ఫైళ్లను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుదీర్ఘ కాలం నుంచి పలు మ్యుటేషన్ ఫైళ్లు పెండింగ్ లో ఉండడాన్ని గమనించారు. వాటి విషయమై సంబంధిత జోన్ల రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ప్రశ్నించారు. సత్వరమే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని, తద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం కూడా సమకూరుతుందని కలెక్టర్ సూచించారు. పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వంద శాతం పన్ను వసూళ్లు జరగాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు అనుమతులు, క్రమబద్ధీకరణ, ఎల్.ఆర్.ఎస్, ఇంజనీరింగ్ పనుల పురోగతి తదితర అంశాలకు సంబంధించిన పనితీరును సమీక్షించి, అధికారులకు సూచనలు చేశారు. 100 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో 600 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా




**హైదరాబాద్, సెప్టెంబరు 09 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 600 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు రూ. 11 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. తెలంగాణ సెక్రటేరియట్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీకి చెందిన 24 ఎకరాల లే ఔట్‌లో రెండు పార్కులను హైడ్రా మంగళవారం కాపాడి, చుట్టూ ఫెన్సింగ్ వేసింది. హెచ్ ఎండీఏ అనుమతి పొందిన ఈ లే ఔట్‌లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను సొసైటీ నిర్వాహకులు అమ్మినట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పార్కుల స్థలాలుగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ మేరకు హైడ్రా పరిరక్షించిన పార్కు స్థలంగా పేర్కొంటూ హెచ్చరికల బోర్డులు కూడా పెట్టింది. ఇల్లీగల్‌గా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన తీరుపై పూర్తి స్థాయిలో విచారిస్తోంది. ఎవరు అమ్మారు.. ఎలా అమ్మారు.. ఎలా కొన్నారు అనే విషయాలతో పాటు.. వీటి వెనుక ఎవరెవరు ఉన్నారనేదానిపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని హైడ్రా ప్రకటించింది. ఇలా ఇంకా ఎన్ని స్థలాలు అమ్మారు అనేది పరిశీలించి అక్రమ లావాదేవీలు నిర్వహించిన వారిపై కేసులు కూడా పెడుతున్నట్టు హైడ్రా ప్రకటించింది.





# ఎల్ఎండి 2 గేట్ల ఎత్తివేత 4000 క్యూసెక్కులు విడుదల

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** లోయర్ మానేరు జలాశయానికి సుమారు 8 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడం, ఇప్పటికే 24.034 టీఎంసీల కెపాసిటీ గల డ్యామ్ నీటిమట్టం 23.516కు చేరుకోవడంతో మంగళవారం సాయంత్రం రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 4000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి విడుదల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సిపి గౌస్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ముందుగా పూజ కార్యక్రమం ప్రారంభించి స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది సాగు, తాగునీటి కొరత లేదని మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎగువ నుంచి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రెండు గేట్లు తెరిచి నాలుగు వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండి రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎల్ఎండి 920 అడుగుల నీటిమట్టానికి గాను 919.40 అడుగులకు చేరింది. మొత్తం 7642 ఇన్ఫ్లో వస్తుండగా స్పిల్ వే ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కెనాల్ కు ఐదువేల క్యూసెక్కులు నీటి విడుదల చేస్తున్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మరింగంటి ఉదయశ్రీ

**ఉత్తమ బోధన, చక్కటి ప్రతిభకు గుర్తింపు**

**ఎల్లారెడ్డిపేట (జనంసాక్షి) :** సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ టీచర్ మరింగంటి ఉదయశ్రీ.. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఉదయశ్రీ ప్రస్తుతం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ లో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) టీచర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయశ్రీ గత 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా సేవలు అందిస్తున్నారు. ఉత్తమ బోధన అందిస్తూ, చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా పాఠశాల విద్యా శాఖ అధికారులు, ఉదయశ్రీని మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రం, మెమెంటోతో సత్కరించారు. ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల విద్యాధికారి కృష్ణహరి, ఎల్లారెడ్డిపేట మండల ఉపాధ్యాయ సంఘాల ప్రధాన బాధ్యులు, స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలు, టీచర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మరికొందరు ఉత్తమ టీచర్లు ఈ సందర్భంగా పురస్కారాలు అందుకున్నారు.

## బీఎన్ఐ అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో



- 13, 14 తేదీలలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో..
- 200 పైగా ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులు, సేవలు ప్రదర్శన

**హైదరాబాద్,సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** ప్రపంచంలో అతిపెద్ద వ్యాపార నెట్వర్కింగ్, వ్యాపార రిఫరల్ సంస్థ అయిన బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 13, 14వ తేదీలలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో 'బీఎన్ఐ గోనాట్ 2025' పేరుతో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో నిర్వహించనున్నామని బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా తెలిపారు. ఈ వివరాలు తెలిపేందుకు బంజారా హిల్స్ లోని తాజ్ డెక్కన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల ఈ ఉత్సవాన్ని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారని చెప్పారు. ఎంఎస్ఎంఈ భవిష్యత్తు, దేశ నిర్మాణంలో వాటి పాత్ర, తెలంగాణ ప్రభుత్వం ఈ రంగాన్ని బలపరచడానికి తీసుకుంటున్న ప్రయత్నాలపై ఫైర్‌సైడ్ చాట్లో పాల్గొననున్నారని తెలిపారు. సరైన అవకాశాలతో, పెద్ద కలలతో గ్లోబల్ స్టేజ్‌లో నిలబడే అవకాశాన్ని అందించడం మా లక్ష్యమన్నారు. రాజీవ్ తల్రేజా, అంకుర్ వారికూ, కనికా టెక్రివాల్ వంటి ప్రఖ్యాత వ్యవస్థాపకుల శక్తివంతమైన సెషన్‌లు కలవన్నారు. ఈ ఈవెంట్ ప్రధాన ఆకర్షణ అయిన ఎక్స్‌పోలో 200 పైగా ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నారని తెలిపారు. బీఎన్ఐ వంటేజ్ గోనాట్ 2025కి ఆదిత్య వాంటేజ్ రీగల్ రెసిడెన్సెస్ టైటిల్ స్పాన్సర్గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి కో-స్పాన్సర్లు ఓపీపీఈఐఎన్, పోకర్ణా లిమిటెడ్, లియో పాకర్స్, మూవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ స్పాన్సర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ హైదరాబాద్ ఏరియా డైరెక్టర్ టీ సతీష్ కుమార్, ఆదిత్య కెడియా రియల్టర్స్ ఎల్ఎల్పీ విష్ణు కుమార్ కెడియా, ఓపీపీఈఐఎన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అల్లూరి శ్రీనివాస్ రాజు, పోకర్ణా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ జైన్, లియో పాకర్స్, మూవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రద్ధా షా తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలి

**బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**మేడిపెల్లి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మోసాలను మానుకొని సుపరిపాలన అందించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. మంగళవారం మేడిపల్లి-భీమారం మండల కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గెలిచి 21 నెలలు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. మూడు నెలల్లో మోత్కురావుపేట-చందుర్తి రోడ్డును పూర్తి చేసి బస్సులు నడిపిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వ విప్, ఇప్పుడు కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కొనరావుపేట మండలం వెంకట్రావుపేట వద్ద భూసేకరణ చేసి అధికారులకు అప్పగించినా, కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. యూరియా సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, జగిత్యాల జిల్లాకు 30,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైనా, కేవలం 24,070 టన్నులు మాత్రమే సరఫరా అయ్యాయని, 5,930 టన్నుల కొరత ఉందని విమర్శించారు. కలికోట-సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినప్పటికీ, భూసేకరణలో చిత్తశుద్ధి లేక కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హైమద్, దాసు, ప్రభాకర్, అజిత్‌రావు, సత్తి రెడ్డి పాల్గొన్నారు.



## తేజాస్ అకాడమీ విద్యార్థి ఎన్. తేజస్‌కి రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలో ప్రథమ స్థానం

**తేజాస్ అకాడమీ డైరెక్టర్ సి.హెచ్. సతీష్ రావు.**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ లో మా తేజాస్ అకాడమీ విద్యార్థి ఎన్. తేజస్‌కి రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలో ప్రథమ స్థానం సాధించారని డైరెక్టర్ సతీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా తేజాస్ అకాడమీ డైరెక్టర్ సి.హెచ్. సతీష్ రావు మాట్లాడుతూ...2025 సంవత్సరంలో సబ్ జూనియర్, జూనియర్ – బాలురు, బాలికల విభాగాల పోటీల్లో మా తేజాస్ డిఫెన్స్ అకాడమీకి చెందిన నిజామాబాద్ జిల్లా విద్యార్థి ఎన్. తేజస్, లెగ్ బ్యాలెన్స్ ఇండివిజువల్ విభాగంలో మొదటి స్థానం సాధించి గర్వకారణంగా నిలిచాడని తెలిపారు. ఈ సందర్భంగా తేజాస్ అకాడమీ డైరెక్టర్ సి. హెచ్. సతీష్ రావు విద్యార్థిని అభినందిస్తూ, యోగాసన క్రీడల్లో ఈ విజయాన్ని ప్రోత్సహంగా తీసుకొని మరిన్ని అత్యున్నత స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. తేజాస్ విజయం అకాడమీ శిక్షణా ప్రమాణాలకు, విద్యార్థుల కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## కాగితం విలాస వస్తువు కాదు.. అధిక పన్ను తగ్గించాలి

- 18 నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించాలి
- తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్



**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** కాగితం విలాస వస్తువు కాదని, ఇది అత్యవసర వస్తువని తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్ విజయవార్జీ తెలిపారు. కాగితంపై విధిస్తున్న అత్యధిక జీఎస్టీ తగ్గించాలని కోరారు. ఈ మేరకు బేగంపేటలో ఉన్న ది ప్లాజా హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వృత్తిదారులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ, ఇంకా సమాజంలో ఎంతో మంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. ఇటీవల జీఎస్టీని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం కేజీ రూ.70, జీఎస్టీ ఐదు శాతం కలిపితే రూ.73.50 అవుతుందన్నారు. అదే 18 శాతం జీఎస్టీ అయితే, రూ.82.60 అవుతుందని పేర్కొన్నారు. అంటే కేజీపై అదనంగా రూ.9 అంటే దాదాపు 12 శాతం భారం పడుతుందని వాపోయారు. నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పరీక్ష పత్రాలు, ప్యాకేజింగ్, రోజువారీ ఉత్పత్తులపై అనేక రెట్లు పెరుగుతుందని చెప్పారు. ప్లాస్టిక్‌కు బదులు షాపింగ్, ఈ-కామర్స్, కిరాణా, డెలివరీలలో కాగితం సంచులు విస్తృతంగా వాడుతున్నారని తెలిపారు. అధిక శాతం కాగితం సంచులు రీసైకిల్ చేసిన వ్యర్థ కాగితం నుంచే తయారవుతున్నాయని చెప్పారు. అయితే, 18 శాతం జీఎస్టీ కారణంగా కాగితం సంచులు ఖరీదవుతున్నాయని తెలిపారు. హానికరమైన ప్లాస్టిక్ కంటే ఖరీదుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్యాకేజింగ్ కాగితంపై అధిక పన్ను తగదన్నారు. ఎఫ్ఎంసీజీ (సబ్బులు, దినసరి వస్తువులు), ఆహార ప్యాకేజింగ్ (ఇడ్లీ, దోసె, బేకరీ ఉత్పత్తులు), ఔషధ ప్యాకేజింగ్ (మందుల పెట్టెలు, లిఫ్‌లెట్లు) వీటిపై అధిక జీఎస్టీతో ధరలు పెరుగుతాయన్నారు. మందులు తగ్గించిన జీఎస్టీ ధరతో వస్తున్నాయన్నారు. కానీ వాటి ప్యాకేజింగ్ కాగితం మాత్రం 18 శాతం పన్నుతో రావడం ఖర్చును పెంచడమేనన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య, రీసైక్లింగ్, ప్యాకేజింగ్‌కు ఉపయోగించే కాగితంపై ఐదు శాతం, అంతకన్నా తక్కువ, సున్నా పన్ను ఉందన్నారు. 18 శాతం పన్ను విధించడం వల్ల ఖరీదైన దేశంగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కాగితం, బోర్డులపై జీఎస్టీ 18 నుంచి ఐదు శాతానికి తగ్గించడం సడలింపు కాదని, ఇది సరి చేసుకోవాల్సిన విషయం అన్నారు. దీంతో విద్యార్థుల విద్యా ఖర్చులు తగ్గుతాయన్నారు. రీసైక్లింగ్, పర్యావరణహిత కాగితం సంచులు ప్రోత్సహించబడతాయని తెలిపారు. ఎఫ్ఎంసీజీ, ఔషధం, ఆహార పరిశ్రమలకు చవకైన ప్యాకేజింగ్ లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆశిష్ జైన్ బన్సాలి, మాజీ అధ్యక్షులు టీ కృష్ణ సింగ్, ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు నిర్మల్ కుహద్ తదితరులు పాల్గొన్నారు.



## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా హైదరాబాద్ లో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ నరేందర్ రెడ్డితో మాట్లాడుతూ... ఈ నెల 15 వ తేదీన కామారెడ్డిలో జరిగే బహిరంగ సభకు కరీంనగర్ నుండి భారీగా తరలి రావాలని చెప్పారని అన్నారు. కరీంనగర్‌లో నాయకులంతా ఒక్క తాటిపై పనిచేయాలని కార్యకర్తలలో కన్ఫ్యూజ్ క్రియేట్ చేయవద్దని ఎవ్వరికి వారు టికెట్లు మీకే ఇస్తాం అని ఇష్టానుసారంగా ప్రకటించవద్దని ఆ వ్యవహారమంతా అధిష్టానం చూసుకుంటుందని చెప్పారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



## యువత ఉన్నత స్థాయికి ఎదగాలి

**చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడికి ఘన సన్మానం**

**మొయినాబాద్ జనం సాక్షి :** బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షునిగా మొయినాబాద్ మండలానికి చెందిన గణేష్ కుండే నియమితులు కావడం ఈ మండలానికి ఆదర్శం అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అన్నారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల, మున్సిపల్ బీజేపీ పార్టీ అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాదాపురం శ్రీకాంత్, బీజేపీ చేవెళ్ల ఓబిసీ కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన గణేష్ కుండేను అందరు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ కుండేను నియమించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్రావును చేవెళ్ల నియోజకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కె.ఎస్. రత్నం మాట్లాడుతూ.. గణేష్ కుండే గతంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆర్గనైజర్ విద్యాపరంగా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి విద్యార్థి నాయకుడిగా ఎదిగాడని కొనియాడారు. సంస్థాగత అవసరాల రీత్యా విద్యాభ్యాసం డిగ్రీ పూర్తి చేసుకోని సమన్యాయం కార్యకర్తగా జమ్మూకాశ్మీర్ లో నాలుగు సంవత్సరాలు, పంజాబ్, అస్సాం రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు ఏబీవీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించి జాతీయ వాదం వైపు నడిపిస్తు నాయకుడిగా ఎదిగిన గణేష్ కుండే అని కొనియాడారు. ప్రస్తుతం గణేష్ కుండే మొయినాబాద్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాస్తవులు అని గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పదవి బాధ్యతలు పొందడంతో పాటు ప్రధానమంత్రి అభినందనలు పొందడం ఈ చేవెళ్ల నియోజకవర్గానికి గర్వకారణం అని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోర నర్సింహ్మారెడ్డి, దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాదాపురం శ్రీకాంత్, ఎల్గని వెంకటేష్ గౌడ్, లక్ష్మిపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ప్రవేశ పరీక్షల్లో రాణించిన పభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు





**కొడంగల్ సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ ప్రవేశ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి సీట్లు సాధించడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో ముందుకు సాగడం విశేషమని, అధ్యాపకుల మార్గదర్శకత్వం, విద్యార్థుల కఠిన శ్రమ వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన అభినందించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత పీజీ స్థాయిలో అడుగుపెట్టడం జీవితంలో కొత్త అధ్యాయమని, విద్యార్థులు మరింత కృషి చేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని కళాశాల అధ్యాపక బృందం ప్రోత్సహించింది. వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం మాట్లాడుతూ, విద్యార్థులు తమ విద్యను సమాజాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. యూనివర్సిటీ స్థాయిలో కే. అనిల్ ఫిజిక్స్‌లో 69వ ర్యాంకు, కే. జగదీష్ ఎంఏ తెలుగులో 14వ ర్యాంకు సాధించారు. కే. రమేష్ సెంట్రల్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో, అనిల్ మ్యాథమెటిక్స్ విభాగంలో సీట్లు సాధించారు. కెమిస్ట్రీలో ఆర్. స్వాతి, బి. అశ్విని, బి. కుమారి, బి. ప్రమీల, బాటనీలో అభినయ, వేణు, హిస్టరీ మరియు పొలిటికల్ సైన్స్‌లో మంచి ర్యాంకులు సాధించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పీజీ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు.



## ప్రజాకవి కాళోజీకి హైడ్రా నివాళి

**కాలోజీ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించిన హైడ్రా కమిషనర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** పద్మవిభూషణ్, ప్రజాకవి, స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 111 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నివాళులర్పించారు. అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవించారని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అన్నారు. "పుట్టుక నీది,చావు నీది, బ్రతుకంతా దేశానిది" అన్న వారి మాటలు అందరికీ స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. హైడ్రా అడ్మిన్ ఎస్పీ సుదర్శన్‌తో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాళోజీకి నివాళులర్పించారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు

**మహిళా సాధికారతకు ఊతం**

- గ్రేటర్ వ్యాప్తంగా జిహెచ్ఎంసీ సహకారంతో 33 క్యాంటీన్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్లను స్వయం సహాయక సంఘాలు విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో గత ఏడాది 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరంలో జిహెచ్ఎంసీ సహకారంతో ప్రస్తుతం నగరంలో 33 కాంటీన్లను మహిళలు నిర్వహిస్తున్నారు.

వీటిని నిర్వహిస్తూ సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రజలకూ నామమాత్రపు ధరలో పోషకాహార భోజనం అందుతోంది. ఈ కాంటీన్లు మహిళలకు కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, స్వావలంబన, గౌరవం కలిగించే మార్గంగా మారాయి. ఎన్బిటినగర్ కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘానికి చెందిన వసంత, మరో నలుగురు సభ్యులు కలిసి బ్యాంకు నుండి రూ.5 లక్షల రుణం తీసుకుని జిహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో ఇంద్రా మహిళా శక్తి కాంటీన్‌ను ఈ సంవత్సరం మార్చిలో స్థాపించారు. ఈ క్యాంటీన్ ను మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డిలు ప్రారంభించారు. వారు విజయవంతంగా క్యాంటీన్ ను నడుపుతూ, ఉద్యోగులు, సందర్శకులకు సేవలందిస్తున్నారు. వీరి ప్రయాణం నగరంలోని అనేక మహిళా సంఘాలకు స్ఫూర్తిగా మారింది. క్యాంటీన్ నిర్వాహకురాలు వసంత తన సక్సెస్ జర్నీని పంచు కుంది. ఈ అవకాశంతో నాకు, క్యాంటీన్‌లో భాగస్వాములైన మహిళలకు ఆర్థిక భద్రత లభించింది. మా కాళ్లపై నిలబడగలి గాము అంటూ ఆనందం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకరించిన జీహెచ్ఎంసీకి వసంత కృతజ్ఞతలు తెలిపింది.

> ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ భాగమై మహిళల ముఖాలపై చిరునవ్వులు చూడటం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో కూడా మహిళా సాధికారతకు జిహెచ్ఎంసీ కృషి చేస్తుంది.
>
> **కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

# విద్యా రంగంలో జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం

**గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి**
**పాల్గొన్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్**
**జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**





**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి సాటిలేని గౌరవం ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ నిజామాబాద్ జిల్లాను విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలపాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ గురువు గౌరవాన్ని మరింత ఉన్నతం చేయాలని ఆయన సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీసీఈబీ సెక్రటరీ బి. సీతయ్య తదితరులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 40 మందిని శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలతో పోలిస్తే ఉన్నత బోధనా సామర్థ్యం, నైపుణ్యాలు కలిగి ఉన్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నారని, రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు అంటే రూ. 22 వేల కోట్లు విద్యా రంగానికి కేటాయించారని తెలిపారు. ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, కొత్త డైట్ మెనూ అమలు వంటి చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయని, దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఆంగ్ల మాధ్యమ బోధన, ప్రీ-స్కూల్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని, విద్యార్థులకు మార్కులు, ర్యాంకులతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, యోగా, ధ్యానం వంటి అంశాలను బోధించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఆధునిక, సాంకేతిక విద్యను అందించి విద్యా శాఖ ఔన్నత్యాన్ని పెంచాలని, సమాజ ప్రగతి ఉపాధ్యాయుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని అన్నారు. జిల్లాలో విద్యా రంగం సంతృప్తికరంగా ఉందని, ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడుతున్నాయని ప్రశంసించారు. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాల కోసం ఆరు నెలల ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని, జిల్లాకు రూ. 42 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్య సమాజ ప్రగతికి కీలకమని, ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతుల్లో బోధన చేస్తూ కృత్రిమ మేధ, సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టి. హరిచరణ్, టి. సురేష్ కుమార్, డి. రవీందర్, సి.హెచ్. రాంప్రసాద్, జి. రాజశేఖర్, ఎస్. మల్లేష్, బి. శ్రీనివాస్ రాజు, ఓ. శ్రీనివాస్, ఎం. ప్రశాంత్ కుమార్, ఎన్. శ్రీనివాస్, పి. గణేష్, హెచ్. స్రవంతి, సయ్యద్ అబ్దుల్ నయీం, పి. గంగాధర్, ఎం. సుజాత, ఏ. లక్ష్మీనారాయణ, టి. సాయిలు, ఏ. స్వప్న, బి. శివకుమార్, పెద్ది రమణ, షేక్ అబ్దుల్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, నంబి శ్రీనివాస్, ఎన్. విజయలక్ష్మి, ఏ. రాజు, వి. సునీత, టి. వెంకటేశ్వర్లు, వై. శ్రుతిమ, అల్తాఫుద్దీన్ పర్వేజ్, డి. నరేంద్రశేఖర్, సి.హెచ్. శంకర్, టి. సాయన్న, ఎండీ. హఫీజుద్దీన్, ఆదిల్ అహ్మద్, నెల్ల శ్రీనివాస్, జి. కిషన్, ఎస్. శ్రీనివాస్, డీ. సునీత, కె. సుజాత, ఏ. రమేశ్‌లను సత్కరించారు. నాగజ్యోతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 సెప్టెంబర్ 2025

# వేగంగా శాసనమండలి పునరుద్దరణ పనులు

- పరిశీలించిన గుత్తా సుఖేందర్,స్పీకర్ గడ్డం ప్రసాద్ రావులు



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణములోని పాత అసెంబ్లీ పనులు చురుకుగా సాగుతున్నాయి. దీనిని మండలిగా మార్చేందుకు పునరుద్దరణ పనులు చేపట్టారు. తెలంగాణ శాసన పరిషత్ భవనం (హెరిటేజ్ బిల్డింగ్) పునర్నిర్మాణ పనులను తెలంగాణ శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పరిషత్ డిప్యూటీ–చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో హెరిటేజ్ భవనం అయినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న సమావేశాలు ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనులను పరిశీలించడానికి వస్తారని, పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా , వేగంగా పూర్తిచేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్అండ్ బి అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో అసెంబ్లీ స్పీకర్ చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : ప్రజాభవన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మంగళవారం 311 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో గృహ సంబంధిత దరఖాస్తులు 85, పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, రెవెన్యూ శాఖ కు సంబంధించి 50 దరఖాస్తు లు వచ్చాయి. ప్రవాసి ప్రజావాణిలో మూడు వినతి పత్రాలు సమర్పించారు. ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తు లు వచ్చాయని ప్రజావాణి అధికారులు తెలిపారు.

# కెసిఆర్ స్ఫూర్తితో జాగృతి పోరాటం

- అందరినీ కలుపుకుని సామాజిక తెలంగాణ కోసం పోరు
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరని అన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.. మంగళవారం నాడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని జాగృతి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి కవిత నివాళు లర్పించారు. ఇదే సమయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ జాగృతి కృషి చేస్తుందన్నారు. ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు వస్తామని.. సామాజిక తెలంగాణ సాధించేవరకు జాగృతి కృషి చేస్తుందని చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు జాగృతి కృషి చేస్తుందన్నారు. తెలంగాణ సాధనలో బొంత పురుగునైనా ముద్దాడుతానన్న కేసీఆర్ స్ఫూర్తితో ముందుకు పోతామని కవిత చెప్పుకొచ్చారు. లెఫ్ట్ టు- రైట్ అందర్నీ కలుపుకుని ముందుకు వెళతామన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి వచ్చుంటే సామాజిక తెలంగాణ కోసం కృషి చేసేవారని కవిత పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకుని రాజకీయంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారామె. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కీలక కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీటి కోసం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రూ. 1500 కోట్ల ప్రాజెక్టును రూ. 7,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సొమ్మును మెగా కృష్ణా రెడ్డికి దోచి పెడుతున్నారంటూ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కుంభకోణంలో భాగంగానే ప్రాజెక్టు అంచనాలు పెంచారని ఆరోపించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికపై జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ సుదర్శన్ రెడ్డి గెలవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి వన్నె తెస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంకితభావం ఉందన్నారు.

# పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఎందుకు పడావు పెట్టారు

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి
- విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రులు



జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అవుతున్న పాలమూరు బిడ్డ పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా ఎందుకు పడావు పెట్టారో చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సతీమణి కీ. శేషులు శ్వేతా రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం లక్ష్మారెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలో ఏర్పాటు చేసిన శ్వేతా రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావు, లక్ష్మారెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్వేతా రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జడ్చర్ల పట్టణంలోని ప్రేమ రంగా గార్డెన్ లో జరిగిన ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావు లు లక్ష్మారెడ్డి తో కలిసి శ్వేతా రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జడ్చర్ల పట్టణంలోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సమావేశానికి వెళ్లిన నేను పాలమూరు బిడ్డను ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుంటే చరిత్ర నన్ను క్షమించదు అంటాడు. 22 నెలలు అవుతున్న పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా ఎందుకు పడావు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలను పడావు బెట్టి.. ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎండబెడు తున్నది.. రైతుల నోట్లో మట్టి కొడుతున్నది సీఎం రేవంత్ రెడ్డినే అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ 21 నెలలో ఎక్కడ మాట్లాడిన నేను పాలమూరు బిడ్డను.. వెనుకబడ్డ ప్రాంతమైన నల్లమల నుంచి వచ్చిన బిడ్డను.. ఆకలి విలువ తెలిసిన వాన్ని.. రైతు గురించి తెలిసిన వాడిని.. రైతు కుటుంబంలో వచ్చిన వాడిని అని ప్రతి వేదికపైన చెప్పారు.

# జైరామ్ వ్యాఖ్యలు అహంకారపూరితం

- మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్, సెప్టెంబర్9 (జనంసాక్షి) : దేశ రాజకీయాలు కేవలం రెండు పార్టీలకే పరిమితం అన్నట్లుగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరంతర వైఫల్యాలకు ప్రధాన కారణం ఇదేనని ధ్వజమెత్తారు. 'మాకు మద్దతివ్వకపోతే.. మీరు బీజేపీ పక్షాన ఉన్నట్లే' అనే అహంకారపూరిత వైఖరి దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను ఒంటరిని చేసిందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా కొన్ని పార్టీల వైఖరిపై జైరాం రమేష్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ ఘాటుగా బదులిచ్చారు. దేశం ఒకప్పుడు ఉన్నట్లు–గా ఇప్పుడు రెండు ముక్కల దేశం కాదని ఆయన స్పష్టం చేశారు. 'జైరాం, ఇలాంటి అహంకారమే మీ పార్టీని జాతీయ రాజకీయాల్లో విఫలం చేసింది. 'మాతో ఉంటేనే మిత్రులు, లేదంటే వాళ్ల వైపు ఉన్నట్లే' అనే వాదన అసమర్థనీయమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు బీ–టీ–మ్ కాదని, బీజేపీకి కూడా బీ–టీ–మ్ కాదని తేల్చి చెప్పారు. తాము తెలంగాణ ప్రజల ఏటీఎమ్ అని స్పష్టం చేశారు. ప్రాంతీయ పార్టీలను రాజకీయ ఆటల్లోకి లాగే బదులు, తమ పార్టీ ఎదుర్కొంటు–న్న వైఫల్యాలపై దృష్టి పెట్టాలని జైరాం రమేష్‌కు హితవు పలికారు. భారతదేశ రాజకీయాలు కేవలం కాంగ్రెస్, బీజేపీల మధ్యనే నడుస్తున్నట్లు–గా భావించడం వారి వైఫల్యాలకు మరో ఉదాహరణ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రాధాన్యతలు తెలంగాణ ప్రజలకు కోసమేనని, తెలంగాణ ప్రజల శ్రేయస్సు, ఆకాంక్షలు, వారి గొంతుకగా ఢిల్లీలో నిలబడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీలోని రాజకీయాల ఆటల్లో తాము భాగస్వాములం కాదని తేల్చిచెప్పారు. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు విమర్శలు చేయడం మానుకుని, తమ పార్టీ పాలనాపరమైన, ఎన్నికల వైఫల్యాలపై కాంగ్రెస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు.

# పాట్నా-ఢిల్లీ మధ్య వందేభారత్ స్లీపర్ ట్రైన్

- బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్లాన్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వేశాఖ ప్రారంభించ నున్నది. ఢిల్లీ నుంచి పాట్నా మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు ఆ శాఖ ఏర్పాట్లు– చేస్తున్నది. ఈ రైలు ప్రయాగ్‌రాజ్ మీదుగా వెళ్తుంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 22వ తేదీన ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగుస్తుంది. అయితే ఆ తేదీలోగానే ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నవంబర్ 15లోగా ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు కేవలం డే జర్నీ వందేభారత్ రైళ్లను మాత్రం నడుస్తున్నాయి. అయితే వందేభారత్ స్లీపర్ రైళ్ల వల్ల రాత్రి జర్నీ కూడా సుఖంగా సాగనున్నది. దీపావళి సీజన్ సందర్భంగా ఆ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీ, పాట్నా మధ్య ప్రయాగ్‌రాజ్ మార్గంలో వెళ్లే వందేభారత్ రైలు కేవలం 11.5 గంటల్లో తన జర్నీ పూర్తి చేస్తుంది. అయితే ఇదే మార్గంలో వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు 23 గంటల సమయం పడుతోంది. బీఎంఈఎల్ కంపెనీ వందేభారత్ స్లీపర్ రైలును ఉత్పత్తి చేస్తున్నంది. ప్రస్తుతం రాజధాని ఎక్స్‌ప్రెస్, తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ట్రావెల్ ఆప్షన్ల కంటే ఆధునిక రీతిలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెడుతున్నారు. ఆ రైలు గంటకు సుమారు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. వందేభారత్ స్లీపర్ రైళ్లలో కేవలం 16 కోచ్‌లు ఉంటాయి. వీటిల్లో 11 ఏసీ–3 –టైర్ కోచ్‌లు, రెండు ఏసీ 2 –టైర్, ఓ ఏసీ ఫస్ట్‌క్లాస్ కోచ్ ఉంటుంది. సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ డోర్లు ఉన్నాయి.

# కెటిఆర్‌కు నీటిపారుదలపై అవగాహన లేదు

**మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 9(జనంసాక్షి) : మల్లన్నసాగర్‌కు ఎల్లంపల్లి నుంచే నీళ్లొస్తాయని, కెటిఆర్‌కు నీటి పారుదలపై అవగాహన లేదని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ఒక ఫెయిల్డ్ ప్రాజెక్టు అని తాను గతం లోనే చెప్పినట్లు గుర్తు చేశారు. మల్లన్నసాగర్ ఒక పెద్ద కుంభకోణమని అన్నారు. కెసిఆర్ కోసమే కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ నిర్మించా రని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేసింది ఒరిజినల్ ప్రాజెక్టు అని చెప్పారు. కెటిఆర్ ఫారెన్ మ్యాన్‌గా మాట్లాడుతున్నారన్నారు. పాత ప్రాజెక్టు ద్వారానే హైదరాబాద్‌కు నీళ్లొస్తాయని తెలిపారు. అదే విధంగా దేశంలో ట్రెండ్ సెట్టర్ గా ఉండాలని పనిచేస్తున్నామని చెప్పారు. విదేశాల్లో మంచి ఉద్యోగాలు సాధించేందుకు స్టూడెంట్స్‌కు స్కిల్స్ నేర్పిస్తామని వెల్లడించారు. 46 ఎటిసిలు స్థాపిస్తున్నామని, 46 ఎటిసి సెంటర్లలో 98 శాతం అడ్మిషన్లు అయ్యాయని చెప్పారు. ఫ్యాకల్టీని సమకూర్చాలని సిఎంను కోరామన్నారు. ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యం అని వివేక్ అన్నారు. టామ్ కామ్ సంస్థతో స్టూడెంట్స్‌కు శిక్షణ ఇచ్చేందుకు కీలక ఒప్పందం కదుర్చుకున్నామని వెల్లడించారు. సాఫ్ట్ స్కిల్స్ ను టామ్ కామ్ నేర్పిస్తుందన్నారు.

# మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిపిరి తిరుపతి

**తిరుపతి అలియాస్ దేవ్‌జీ స్వస్థలం కోరుట్ల**

ఖమ్మం,సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిపిరి తిరుపతి అలియాస్ దేవ్'జీని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎన్నుకున్నట్లు సమాచారం. ఈ మేరకు మావోయిస్టు పార్టీ అధికారిక నియామక లేఖ విడుదల చేసినట్లు ప్రచారం జరిగినా, ఆ లేఖ వెలుగులోకి రాలేదు. అయితే ఈ నియామక విషయం మంగళవారం ప్రచారంలోకి వచ్చింది. మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఇటీవల ఎన్కౌంటర్లో మరణించిన అనంతరం కొద్ది నెలలుగా మావోయిస్టు దళపతి నియామకం జరగలేదు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబాల అనంతరం, తాజాగా తెలంగాణ దళిత కుటుంబానికి చెందిన తిరుపతి నియామకం వెలుగులోకి వచ్చింది. మావోయిస్టు పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎందరో దళ సభ్యులు కీలక నాయకులుగా పనిచేసిన చరిత్ర ఉంది. తాజాగా మళ్లీ తెలుగువాడికే మావోయిస్టు పార్టీ దళపతిగా అవకాశం లభించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మావోయిస్టు పార్టీ నూతన జాతీయ ప్రధాన కార్యదర్శి తిపిరి తిరుపతి అలియాస్ దేవ్'జీ... సంజీవ్, చేతన్, రామన్న, దేవ్'జీ అనే పేర్లతో దళంలో కీలక బాధ్యతలు పోషించారు. అయితే చిరకాలంగా దళంలో దేవ్'జీ అనే పేరే వాడకంలో ఉంది. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం సమయంలో ఆర్ఎస్ యూ అధ్యక్షునిగా తిరుపతి పనిచేశారు. అనంతరం 1983 లో కరీంనగర్ ఎస్ఆర్ ఆర్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ తీసుకు న్నారు. 1984లో ఆయనను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్'కు తరలించగా బెయిల్'పై ఇంటికి వచ్చిన తిరుపతి అడ్వకేట్'ను కలిసి వస్తానని వెళ్లి, మళ్లీ ఇంతవరకు తిరిగి రాలేదు. దళంలోకి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులు ఆయన్ని కలవాలని ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు. అయన కూడా స్వగ్రామానికి రావడానికి, బంధువులకు కలవడానికి ప్రయత్నించలేదు. దళంలో చేరిన తిరుపతి మొదట మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లా కార్యదర్శి గా సంజీవ్ పేరుతో పనిచేశారు. తదుపరి రాష్ట్ర కమిటీ సభ్యునిగా చేతన్ పేరుతో, అంతరం మిల్ట్రీ కమిషన్ సభ్యునిగా రామన్న పేరుతో పనిచేశారు. అనంతరం సెంట్రల్ కమిటీ సభ్యునిగా, పొలిట్ బ్యూరో మెంబర్గా దేవ్'జీ పేరుతో చిరకా లంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతి అలియాస్ దేవజీని నియమించినట్లు ప్రచారం జరుగుతున్నది.



# అమ్మానాన్న చూపిన బాట మరువం

- వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం
- దేవిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

కరీంనగర్ (జనంసాక్షి) : అమ్మానాన్న చూపిన బాట మరువబోమని, వారు చూపిన మార్గంలో పయనిస్తూ, వారి ఆశయ సాధనకు కృషిచేస్తామని దేవిశెట్టి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు తెలిపారు. వారి తండ్రి దేవిశెట్టి రాజమౌళి పితృయజ్ఞం కరీంనగర్ గణేష్‌నగర్‌లోని వారి స్వగృహంలో మంగళవారం నిర్వహించారు. ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తండ్రి దేవిశెట్టి రాజమౌళి ఆగస్టు 29 న పరమపదించారని, అలాగే జనవరి 17 న తమ మాతృ మూర్తి దేవిశెట్టి రాజమణి గారు పరమ పదించారని తెలిపారు. ఈ విధంగా ఒకే ఏడాది లో తల్లి దండ్రులు ఇరువురిని కోల్పోవడం తమ కుటుంబం లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని, వారి మరణం తమకు తీరని లోటని, వారి ఆశయ సాధనకు కృషి చేయటం ఒక్కటే వారికీ తామిచ్చే ఘనమైన నివాళి అవుతుందని దేవిశెట్టి శ్రీనివాస్, ఆంజనేయులు, నవీన్ కుమార్, తోట అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్ పీఆర్ మాజీ డైరెక్టర్ బి.రాజమౌళి, ప్రముఖ చెస్ట్ ఫిజిషియన్ బి.సుమన్ కుమార్, జనంసాక్షి సిఎండి రెహమాన్, పలువురు బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. దేవిశెట్టి రాజమౌళికి ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రయివేటు భూముల వివాదాలకు దూరం

- ప్రభుత్వ స్థలాలు కబ్జా అయితే ఊరుకోం
- ఈ క్రమంలోనే వర్టెక్స్‌పై రెండు కేసులు నమోదు
- సుంకరి నరేష్ వ్యాఖ్యలను ఖండించిన హైడ్రా

హైదరాబాద్, సెప్టెంబరు 09 (జనంసాక్షి) : ప్రైవేటు భూములకు సంబంధించిన వివాదాల జోలికి వెళ్లమని హైడ్రా మరో సారి స్పష్టం చేసింది. ఇదే సమయంలో చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరిగితే ఊరుకోదని తేల్చి చెప్పింది. తుక్కుగూడ మున్సిపాలిటీలోని వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు – చైతన్య రెడ్డి అనే మహిళకి మధ్య ఉన్న వివాదం పూర్తిగా ప్రైవేటు వ్యవహారమని పేర్కొంది. దీని సంబంధించి అందిన ఫిర్యాదు నేపథ్యంలో ఇరుపక్షాలను ఎదురెదురుగా పెట్టి ఎంతో పారదర్శకంగా హైడ్రా విచారించింది. ఇద్దరి మధ్య ఉన్న భూ తగాదాలో హైడ్రా తల దూర్చదని హైడ్రా స్పష్టం చేసింది. సూరం చెరువులో వర్టెక్స్ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని హైడ్రా కూల్చి వేసింది. కొత్తకుంట చెరువులో వర్టెక్స్ సంస్థ మట్టి పోయడాన్ని హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. ఈమేరకు వర్టెక్స్‌పై రెండు కేసులు కూడా నమోదు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే.. హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించబడి సాంకేతిక కారణాలతో స్టే తెచ్చుకున్న సుంకరి నరేష్ లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆ విషయాలన్నీ హైడ్రాకు ఆపాదించడాన్ని హైడ్రా ఖండించింది. చైతన్యరెడ్డి పేర్కొన్న విధంగా .. ఆమెకు చెందిన భూమిలోంచి వర్టెక్స్ సంస్థ రహదారి వేసిన వివాదంలో.. ఆ ఇరువురే తేల్చుకోవాలి. ఈ విషయమై చైతన్య రెడ్డి ఇదివరకే పోలీసు స్టేషన్‌లో వర్టెక్స్‌పై కేసు కూడా పెట్టారు. న్యాయం కోసం కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. తన నుంచి రూ. 50 లక్షలు తీసుకున్నారంటూ సుకంకరి నరేష్‌తో పాటు దళారీలుగా వ్యవహరించిన వారిపై చైతన్య రెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చైతన్యారెడ్డితో పాటు.. దళారీగా ఆమె పేర్కొన్న వ్యక్తిని కూడా ఎదురెదురుగా పెట్టి విచారిం చింది. ఈ విషయమై మరింత లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో హైడ్రా కేసు పెట్టింది. కోర్టు బార్ కౌన్సిల్ తొలగించిన తర్వాత స్టే తెచ్చుకున్న వ్యక్తికి.. న్యాయవాదిగా ఫీజు చెల్లించిందని సుంకరి నరేష్ పేర్కొనడం కూడా గమనార్హం. సుంకరి నరేష్ మంగళవారం మరో సారి లేనిపోని ఆరోపణలు చేయడాన్ని హైడ్రా ఖండించింది. ఈ దళారీ వ్యవహారంపై పోలీసులు లోతుగా విచారించి నిజాలు నిగ్గు తేల్చుతారని హైడ్రా ఆశిస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370